## 40 సంవత్సరాల అవ్యక్త పాలనకు ఫలితంగా నాలుగు విషయాలను స్మృతిలో ఉంచుకోండి ; 1.శుభచింతకులుగా అవ్వండి 2.శుభచింతన చేయండి 3.శుభవృత్తి ద్వారా శుభవాయుమండలాన్ని తయారుచేయండి 4.జీరో మరియు హీరో స్మృతిలో ఉండండి ....18-1- 09

ఈరోజు బాప్‌దాదా నలువైపుల ఉన్న తన సేవా సహయోగి పిల్లలను కలుసు కునేటందుకు వచ్చారు. ఆది నుండి సేవాసహయోగులుగా మరియు ఇప్పుడు కూడా సేవా సహయోగులుగా అయ్యి సేవను బాగా వృద్ధి చేస్తున్నారు. బాప్‌దాదా ఇలా తన సేవకు సహయోగులుగా ఉండే పిల్లలను చూసి సంతోషిస్తున్నారు మరియు మనస్సులో ఓహో నా విశ్వపరివర్తక సేవా సహయోగులు ఓహో అనే పాట పాడుతున్నారు. ఈరోజు అమృతవేళ నుండి నలువైపుల నుండి బాప్‌దాదాకి స్నేహం యొక్క మాలలు వేస్తున్నారు. మూడు రకాలైన మాలలు ఉన్నాయి 1. బాబా సమానంగా అయ్యే ఉత్సాహ, ఉల్లాసాల యొక్క మాలలు, 2. చాలా సమయం నుండి తప్పిపోయి బంధనాలలో బంధించబడి ఉన్న గోపికల మాలలు వీరి మాలలు మెరుస్తూ అతి అమూల్యమైన కన్నీళ్ళ యొక్క మాలలు. వారి యొక్క ఒక్కొక్క కన్నీటి బిందువు ముత్యంలా మెరుస్తూ ఉంది 3.కొంతమంది పిల్లల నిందల మాలలు.

ఈరోజు అమృతవేళ నుండి విశేషంగా అందరిలో స్నేహం ఇమిడి ఉంది. బాప్‌దాదా తన యొక్క విరాటరూపం యొక్క భుజాలలో పిల్లలందరినీ ఇముడ్చు కున్నారు. ఈరోజు స్నేహంతో పాటు సర్వశక్తులు అర్పణ చేసే రోజు. ఒక బిడ్డ యొక్క చేతిలో చేయి వేసి సర్వశక్తులను అర్పణ చేసి శక్తిసేన మరియు పాండవులైన పిల్లలందరికీ అర్పణ చేసారు, బాప్‌దాదా చూసారు, కొంతమంది పిల్లలు పాండవులు మరియు శక్తులు కూడా గుప్తంగా అంతర్ముఖి అయ్యి పురుషార్ధంలో తీవ్రంగా ముందుకు వెళ్తున్నారు. బయటికి కనిపించడంలేదు కానీ మంచి పురుషార్ధం చేస్తున్నారు. బాప్‌దాదా ఈరోజు విశేషంగా అందరి ముఖంలో స్నేహమనే సబ్జక్టు యొక్క మెరుపు చూసారు. మీరు జ్ఞానం కలిగిన పిల్లలే కానీ స్నేహమనే సబ్జక్టు అవసరం ఎందుకంటే స్నేహి ఆత్మలు శ్రమ తక్కువగా చేస్తారు మరియు ప్రేమ యొక్క అనుభవంలో సహజంగా ఉంటారు. స్నేహశక్తి ఎటువంటి పర్వతంవంటి పరిస్థితిని అయినా రాయిగా చేస్తుంది. పర్వతాన్ని నీరులా తేలికగా చేస్తుంది. స్నేహమనేది ఒక ఛత్రఛాయ కనుకనే సదా రక్షణగా ఉంటారు. సహజంగా రక్షణగా ఉంటారు. స్నేహం ద్వారా పరమాత్మ లేదా భగవంతుడిని మీ మిత్రునిగా చేసుకోగల్గుతున్నారు. ఖుదాని అంటే భగవంతుడిని దోస్త్‌గా అంటే స్నేహితునిగా చేసుకున్న దాని స్మృతిచిహ్నం కూడా ఉంది. భగవంతుడిని స్నేహితునిగా చేసుకుంటే స్నేహితుని సంబంధం ద్వారా ఏ సమస్యని అయినా సహజంగా చేసుకోగలరు. బాబాని మీ సాతీగా (సహయోగిగా) చేసుకోగలరు. జ్ఞానమనేది బీజం కానీ ప్రేమ అనే నీరు బీజానికి ప్రాప్తి అనే ఫలాన్ని ఇస్తుంది. ఇలా బాబాకి స్నేహిగా ఉండే పిల్లలు బాబాని స్మృతి చేయటం కష్టంగా భావించరు కానీ మర్చిపోవటం కష్టంగా అనుభవం చేసుకుంటారు. స్నేహి ఆత్మలు ఎప్పుడు స్నేహిని మర్చిపోరు. హృదయ పూర్వకమైన స్నేహంతో నా బాబా అని అంటే సర్వఖజానాల తాళంచెవి లభిస్తుంది. అటువంటి స్నేహి ఆత్మల ముందు బాప్‌దాదాలు ఇరువురు హాజరైపోతారు. అందరు బాబాని స్మృతి చేస్తారు కానీ కొంతమంది కొద్దిగా శ్రమతో

Created by Universal Document Converter

చేస్తారు మరియు కొంతమంది స్నేహ సాగరంలో లవలీనమై ఉంటారు. ప్రపంచంవారైతే ఆత్మ పరమాత్మలో లీనమైపోతుంది అని అంటారు కానీ ఆత్మ పరమాత్మ ప్రేమలో లవలీనం అవుతుంది. లీనం అవ్వటం కాదు లవలీనం అవుతుంది.

ఈరోజు ప్రేమలో లవలీనం అయ్యే రోజు. శ్రమ సమాప్తి అయ్యి ప్రేమ రూపంలో పరివర్తన అయిపోతుంది. బాప్‌దాదా పిల్లలందరి ఫలితం కూడా చూసారు, చాలామంది పిల్లలు హోమ్‌వర్క్ చేసారు. బాబా సమానంగా అయ్యే లక్ష్యం మాటిమాటికి రివైజ్ కూడా చేసారు, అనుభవం చేసుకున్నారు.75 శాతం పిల్లల ఫలితం బావుంది. బాబా సమానంగా అవ్వాల్సిందే, ఎటువంటి తుఫానులు వచ్చినా ఎందుకంటే ఇది కలియుగ అంతిమ సమయం కనుక తుఫానులనేవి వస్తాయి, పరివర్తన సమయం కదా కానీ బాబా పిల్లలైన మీకు ఈ తుఫానులు ఏమిటి! తుఫానులు తుఫానులు కాదు కానీ అవి మీకు ఒక కానుక ఎందుకంటే బాప్‌దాదా యొక్క వరదాని హస్తం పురుషార్థి పిల్లలపై ఉంది. ఎవరైతే ధృఢసంకల్పం అంటే ధృడత అనే తాళంచెవిని కార్యంలో ఉపయో గించారో వారికి ఇప్పటి ఫలితాన్ని అనుసరించి సఫలత కూడా లభించింది కానీ సదాకాలికంగా తుఫానులను కానుకగా చేసుకుని, సమస్యకు సమాధాన రూపాన్ని ఇచ్చి ముందుకు వెళ్తూ ఉండండి. బాప్‌దాదా అయితే ఇప్పటి ఫలితానికి సంతోషిస్తున్నారు. యోగ తపస్యలో కూడా తయారవ్వాల్సిందే అనే లక్ష్యం ధృడంగా పెట్టుకున్నారు.

40 సంవత్సరాల అవ్యక్త పాలన పూర్తి అయ్యింది. 40 సంవత్సరాలలో మొదట ఏమి వస్తుంది - బిందువు, జీరో. జీరో అనేది నేను హీరో, సత్యమైన హీరో, మహాన్ హీరో మరియు హీరో పాత్రధారి అయ్యి ప్రతి కార్యం హీరో సమానంగా చేయాలి అనే స్మృతిని ఇప్పిస్తుంది కనుక జీరో మరియు హీరో అనే స్మృతి సదా ఉండాలి మరియు మిగిలిన నాలుగు విషయాలు ఏవైతే ఉన్నాయో వాటిని జీవితంలోకి తీసుకురావాలి. ధృడతాపూర్వకంగా చేయాలి, చేస్తారా? తయారేనా? ఎటువంటి పరీక్షలు వచ్చినా కానీ ఆ నాలుగు విషయాలు మీ జీవితంలో చేయాల్సిందే. పక్కాయేనా? పక్కాయేనా? పక్కాయేనా? వెనుక ఉన్నవారు పక్కాయే కదా! కచ్చాగా ఉన్నవారిని మాయ తినేస్తుంది కనుక పక్కాగా ఉండాలి.

మొదటి విషయం - సదా శుభచింతకులుగా ఉండాలి. ఎవరిలో అయినా బలహీనత చూసినా లేదా వినినా శుభచింతకులుగా అయ్యి వారికి సహయోగాన్ని ఇవ్వాల్సిందే. బలహీనతను చూడకూడదు కానీ సహయోగాన్ని ఇవ్వాల్సిందే. అటువంటి వారినే శుభ చింతకులు అని అంటారు. పక్కాగా ఉంటారు కదా! సహయోగాన్నిచ్చే దాతలు కనుక దయాహృదయులై సహయోగాన్ని ఇవ్వండి. వారిని వేరు చేయటం, అసహ్యించుకోవటం చేయకూడదు. క్షమించాలి. పరవశమైనవారిని ఎప్పుడు అసహ్యించుకోకూడదు. సహయోగాన్ని ఇవ్వాలి. శుభచింతకులుగా అవ్వాలి.

రెండవ విషయం-శుభచింతన; ఈరోజుల్లో బాప్‌దాదా చూసినదేమి టంటే చాలా మంది పిల్లలలో చాలా వ్యర్థసంకల్పాలు నడుస్తున్నాయి, దీనిలో జమ చేసుకున్న శక్తులు వ్యర్థంగా వెళ్ళిపోతున్నాయి అందువలనే శుభచింతన చేయాలి. ఏదోక స్వమానం అంటే మీ బిరుదుని మనస్సుకి హోమ్‌వర్క్‌గా ఇచ్చుకోండి. మనస్సు యొక్క దినచర్యను తయారు చేసుకోండి. అమృతవేళ బాబా యొక్క కలయిక తర్వాత మనస్సుకి ఏదోక స్వమానాన్ని ఇచ్చుకోండి మరలా మధ్యలో

Created by Universal Document Converter

మీకు 12-13 సార్లు సమయం లభిస్తుంది కనుక ఆ సమయంలో అనుభవం చేసుకోండి మరియు మరలా రివైజ్ చేసుకోండి. ఇలా మనస్సుని బిజీగా ఉంచుకోవటం ద్వారా సమయమనేది వ్యర్థసంకల్పాలలో గడవదు. శ్రమ చేయాల్సిన అవసరం కూడా ఉండదు మరియు ప్రతి సమయం సంగమయుగం యొక్క మజా ఏదైతే ఉందో ఆ మజాలో ఉండగల్గుతారు కనుక రెండవది - శుభచింతన. పరిశీలన చేసుకోండి మరియు పరివర్తన చేసుకోండి.

మూడవ విషయం- శుభవృత్తి. అశుద్ధవృత్తి ద్వారా వాయుమండలంలో కూడా అశుద్ధత వ్యాపిస్తుంది కనుక శుభవృత్తి ఉండాలి.

నాల్గవ విషయం - ప్రతి ఒక్కరు ఈ బాధ్యత తీసుకోవాలి - నేను ఇతరులను చూడకూడదు మరియు నా పని ఏమిటంటే శుభవాయుమండలాన్ని తయారుచేయటం. ఎప్పుడైనా వాయుమండలంలో చెడువాసన వస్తే ఏమి చేస్తారు? సువాసనను వ్యాపింపచేస్తారు కదా! చెడువాసనను సహించలేరు, సువాసనను ఇచ్చే ఏదొక సాధనాన్ని ఉపయోగిస్తారు అలాగే సాధారణ వాయు మండలాన్ని మరియు అశుద్ధ వాయుమండలాన్ని మార్చాల్సిందే. చిన్నవారైనా, క్రొత్తవారైనా కానీ ఈ బాధ్యత అందరికీ ఉంది. నేను శుభ వాయుమండలాన్ని తయారుచేయాల్సిందే అనే ధృడసంకల్పం చేయాలి. ఈ ప్రతిజ్ఞ ప్రత్యక్షతను చేస్తుంది. ప్రతిజ్ఞ చేస్తున్నారు దీనికి బాప్‌దాదా సంతోషిస్తున్నారు కానీ ప్రతిజ్ఞలో అప్పుడప్పుడు ధృడత ఉండటంలేదు అందు వలనే ఎంతగా సఫలత కోరుకుంటున్నారో అంత సఫలత ఉండటంలేదు. మొత్తం విశ్వం యొక్క, ప్రకృతి యొక్క, ఆత్మల యొక్క ఆత్మలు అంటే బ్రాహ్మణాత్మలు కూడా వస్తారు కనుక ప్రతి ఒక్కరు మీ సేవాస్థానం యొక్క వాతావరణాన్ని ధృడతతో ఈవిధంగా తయారుచేసుకోండి. దీనిలో కొన్ని త్యాగం చేయాల్సి వచ్చినా త్యాగం చేయండి, అంతే కానీ త్యాగం చేస్తే నేను చేస్తాను అని అనకండి. పద్ధతి బావుంటే చేస్తాను ..... ఇలా అనకండి.నేను చేయాల్సిందే అనుకోండి. విశ్వపరివర్తకులు అనే స్వమానం ఉంది కదా! అందరు విశ్వపరివర్తకులే కదా! చేతులు ఎత్తండి! మంచిది, అందరు విశ్వపరివర్తకులు. చాలా మంచిది. మొదట బాప్‌దాదా ఇది చూడాలనుకుంటున్నారు, ఇలాంటి వాతావరణం ఉండి ఉండవచ్చు కూడా కానీ ఈ సంవత్సరంలో బాప్‌దాదా చిన్న సేవాకేంద్రం అయినా, పెద్ద సేవాకేంద్రమైనా చక్రం తిరిగితే ఎటువంటి వాతావరణం ఉండాలి? ఈరోజు ఎలా అయితే స్నేహం మరియు శక్తి యొక్క వాతావరణం ఉందో ఇలా గ్రామ, గ్రామంలో ఉన్న సేవాకేంద్రం యొక్క వాతావరణం మరియు పెద్ద సేవాకేంద్రాల వాతావరణం చైతన్య మందిరంలా ఉండాలి. వ్యతిరేకాన్ని మంచిలోకి పరివర్తన చేసుకోవటంలో మొదట నేను అనుకోవాలి. మొదట మీరు అనటం కాదు దీనిలో మొదట నేను అనుకోవాలి ఎందుకంటే బాప్‌దాదా మరియు ఎడ్వాన్స్ పార్టీ ఆత్మలు మరియు ప్రకృతి కూడా మీ కోసం ఎదురుచూస్తుంది. ఎందుకంటే తయారుచేసేవారు మీరు కనుక మీరు ఎదురుచూసేవారిగా కాదు, తయారవ్వాలి.

ఈరోజుల్లో నలువైపుల భయం వ్యాపించి ఉంది. ప్రపంచంలో చాలా మంది మనస్సులో ఇదే సంకల్పం ఉంది, రేపు ఏమౌతుంది! అని. రేపు ఏమౌతుంది అనేది మీకు తెలుసు. పరివర్తన చేయటంలో మొదట నేను నిమిత్తమవుతాను అనే ఈ సంకల్పం ఎవరు చేస్తారు? దీనిలో చేతులు ఎత్తండి! చేయాల్సి ఉంటుంది, చేయాల్సి ఉంటుంది, మారాల్సి ఉంటుంది, రక్షణగా అవ్వాల్సి ఉంటుంది, కొన్ని వదలవలసి ఉంటుంది మరియు ప్రేమను తీసుకోవాల్సి ఉంటుంది కనుక

Created by Universal Document Converter

దీనిలో మనస్సుతో చేతులు ఎత్తారా లేదా మామూలుగా చేతులు ఎత్తారా! మనస్సుతో చేతులు ఎత్తినవారు ఎవరు? ఎందుకంటే మనస్సు మారితే విశ్వం మారుతుంది. కనుక ఈ సంవత్సరంలో ఏమి సూక్తి ఉంటుంది? ఏమి సూక్తి ఉంటుంది? నో ప్రాబ్లమ్ (సమస్య ఏదీ లేదు). మనస్సులో విజయీ జెండా ఎగురుతుంది మరియు అందరు సదా మనస్సుతో సంతోషం యొక్క నృత్యం చేస్తారు. మనస్సు యొక్క నృత్యం అంటే సంతోషం. ప్రతి సమయం సంతోషంతో నృత్యం చేస్తారు. దాత యొక్క పిల్లలు కనుక ఎవరు వచ్చినా ప్రతి ఒక్కరికి ఏదోక గుణాన్ని బహుమతిగా ఇవ్వండి. ఒక సెకనులో ఆ ధృడసంకల్పం, దాత సంకల్పం లిఫ్ట్‌గా అయిపోతుంది మరియు సెకనులో పరంధామం, సూక్ష్మవతనం, సాకార వతనంలో స్థూల మధువనం ఇలా ఎక్కడికి కావాలంటే అక్కడికి శ్రమ లేకుండా సెకనులో చేరిపోతారు. ఎవరు మన దగ్గరికి వచ్చినా వారిని ఖాళీ చేతులతో పంపించకూడదు, ముఖం ద్వారా, నడవడిక ద్వారా, నోటి ద్వారా ఏదోక గుణం యొక్క బహుమతి లేకుండా కలుసుకోకూడదు.

ఈ సంవత్సరం ప్రతి నెల యొక్క ఫలితం మీ దగ్గర కూడా పెట్టుకోవాలి మరియు యజ్ఞ టీచర్ ద్వారా ఓ.కె అనే కార్డ్ పంపించాలి, పెద్ద ఉత్తరాలు పంపవద్దు. ఈ ప్రపంచంలో కార్డుల వంటివి పంపవద్దు. టీచర్ ద్వారా ఏదైతే వరదానం యొక్క కార్డ్ లభిస్తుందో ఆ కార్డ్‌ని పంపించండి. గుణాల బహుమతులు, శక్తుల బహుమతులు ఎన్ని ఉన్నాయి? జాబితా కనుక తీస్తే ఎంత పెద్ద జాబితా ఉంటుంది! మరియు మీరు ఎంతగా ఇస్తూ ఉంటారో అంత తక్కువ అవ్వవు మరింత పెరుగుతూ ఉంటాయి. ఛూ మంత్రం అని అంటూంటారు కదా కానీ ఇది శివమంత్రం దీని ద్వారా మీకు గుణాలు తక్కువ అవ్వవు ఇస్తూ ఉంటే మరింత పెరుగుతాయి ఎందుకంటే దానం ఇవ్వటం ద్వారా గ్రహణం తొలగిపోతుంది అని అంటారు.

మంచిది, ఈసారి ఎవరైతే మొదటగా వచ్చారో వారు నిల్చోండి! మంచిది. (మధ్యప్రదేశ్ గవర్నర్ ఎదురుగా కూర్చుని ఉన్నారు) ఈ సంగటనలోకి వచ్చారు, మంచిది. బాప్‌దాదా మీ అందరికీ మరియు వచ్చేవారికి ఇదే వరదానాన్ని ఇస్తున్నారు - సదా బాబాకి గుడ్‌మార్నింగ్ (శుభోదయం) మరియు గుడ్‌నైట్ (శుభరాత్రి) తప్పకుండా చెప్పాలి ఎందుకంటే మొట్టమొదట కళ్ళు తెరుస్తూనే బాబాని చూస్తే మొత్తం రోజంతా బావుంటుంది. మొదటిసారి వచ్చిన పిల్లలకు బాప్‌దాదా యొక్క కోటానుకోట్ల ప్రియస్మృతులు మరియు అభినందనలు. మంచిది.

ఇప్పుడు అందరికి 4 విషయాలు ఏవైతే చెప్పానో అవి మరియు ఐదవది, జీరో మరియు హీరో ఈ విషయాలను మననం చేస్తూ మగ్నస్థితిలో స్థితులయ్యే బ్రాహ్మణుల నుండి ఫరిస్తాగా అయ్యే ఆత్మలకు, దేవతగా అవ్వటమనేది మీ జన్మసిద్ధ అధికారం, ఫరిస్తా నుండి దేవతగా అవుతారు.

**ఇలా సదా స్నేహంలో లవలీనమై ఉండేవారికి, సదా ధృడసంకల్పమనే తాళంచెవిని సదా మనస్సులో, బుద్ధిలో స్మృతిలో ఉంచుకునేవారికి ఎందుకంటే ఈ తాళంచెవి వెనుక మాయ చాలా చక్రం తిరుగుతూ ఉంటుంది. మనస్సు మరియు బుద్ధి ద్వారా సదా సమర్థంగా ఉండే నలువైపుల ఉన్న పిల్లలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.**

Created by Universal Document Converter

# సేవ చేస్తూ డబల్ లైట్ స్థితి ద్వారా ఫరిస్తాస్థితిలో స్థితులవ్వండి, అశరీరిగా అయ్యే అభ్యాసం చేయండి .....5-2-09

ఈరోజు బాప్‌దాదా నలువైపుల ఉన్న పిల్లల యొక్క మూడు రూపాలను చూస్తున్నారు - ఎలా అయితే బాబా యొక్క మూడు రూపాల గురించి తెలుసో అదేవిధంగా పిల్లల మూడు రూపాలను కూడా చూస్తున్నారు.మొదటి స్వరూపం -బ్రాహ్మణస్వరూపం, రెండవది-ఫరిస్తా స్వరూపం, మూడవది-దేవతా స్వరూపం. ఇవే సంగమయుగం యొక్క లక్ష్యం మరియు లక్షణాలు. బ్రాహ్మణుల నుండి ఫరిస్తాగా అవుతారు మరియు ఫరిస్తా నుండి దేవతగా అవుతారు కనుక వర్తమాన సమయంలో ఇప్పుడు విశేషంగా ఏ లక్ష్యం ఎదురుగా ఉంటుంది? ఎందుకంటే ఫరిస్తాగా కాకుండా దేవతగా కాలేరు. వర్తమాన సమయాను సారంగా మరియు స్వయం యొక్క పురుషార్థానుసారంగా ఇప్పుడు లక్ష్యం ఇదే -ఫరిస్తాగా అవ్వాలి. సంగమయుగం యొక్క సంపన్నస్వరూపం ఫరిస్తా నుండి దేవతగా అవ్వాలి. ఫరిస్తా యొక్క పరిభాష గురించి మీకు తెలుసు, ఫరిస్తా అంటే పాత ప్రపంచం యొక్క సంబంధం, సంస్కారాలు, సంకల్పాలతో తేలికగా ఉండాలి. పాత సంస్కారాలతో కూడా తేలికగా ఉండాలి కేవలం మీ స్వభావ, సంస్కారాలతో తేలికగా ఉండటమే కాదు కానీ ఫరిస్తా అంటే సర్వ సంబంధాలలోకి వస్తూ సర్వుల స్వభావ, సంస్కారాలతో కూడా తేలికగా ఉండాలి. ఈ తేలికతనానికి గుర్తు ఏమిటి? అటువంటి ఫరిస్తా ఆత్మ సర్వులకు ప్రియంగా ఉంటుంది. కొంతమందికే కాదు, సర్వులకు ప్రియంగా ఉంటుంది. ఎలా అయితే శివబాబాను మరియు బ్రహ్మాబాబాను ప్రతి ఒక్కరు నా వారు అని అనుకుంటారు. నా బాబా అని అంటారో అలాగే ఫరిస్తా అంటే సర్వులకు ప్రియంగా ఉంటుంది. కొంతమంది పిల్లలు బ్రహ్మాబాబా బ్రహ్మాబాబాయే అని ఆలోచిస్తున్నారు కానీ మీరందరు మీ సమానమైన బ్రాహ్మణాత్మలలో కూడా మీ ప్రియమైన దాదీని కూడా అందరు ప్రేమతో నా దాదీ అని అనుభవం చేసుకుంటున్నారు కదా! అన్ని రకాలైన స్వభావాలు, సంస్కారాలు మరియు ఈ పాతప్రపంచంలో ఉంటూ అతీతంగా మరియు ప్రియంగా ఉన్నారు అందరు మన దాదీ అని హక్కుగా మాట్లాడుతున్నారు. కారణం ఏమిటి? దాదీ స్వయం స్వభావ, సంస్కారాలలో తేలికగా ఉండేవారు అందువలనే అందరికీ నావారు అనే అనుభవం చేయించారు. జగదాంబను కూడా చూసారు కదా కానీ ఆమె జగదాంబ కదా అని కొంతమంది ఆలోచిస్తున్నారు, కానీ దాదీ అయితే మీ బ్రాహ్మణ పరివారంలో మీ సహయోగే కదా! ఆమె నోటి నుండి సదా పురుషార్థం గురించి చెప్పినా లేదా అడిగినా ఒకే మాట చెప్పేవారు - ఇప్పుడు కర్మాతీతంగా అవ్వాలి అని. కర్మాతీతంగా అవ్వాలనే సంలగ్నతలో ఇతరులకు కూఢా ఇదే మాట మాటిమాటికి స్మృతి ఇప్పించేవారు. ప్రతి బ్రాహ్మణాత్మకి ఇప్పుడు విశేషంగా ఇదే లక్ష్యం మరియు లక్షణాలు ఉండాలి. నెంబర్‌వారీగా ఉన్నప్పటికీ ఇదే లక్ష్యం ఉండాలి. ఇప్పుడు ఫరిస్తాగా అవ్వవలసిందే అనే సంలగ్నత ఉండాలి. ఫరిస్తా అంటే ఈ దేహం అంటే సాకార దేహానికి అతీతంగా, సదా ప్రకాశ శరీరధారిగా ఉండాలి. ఫరిస్తా అంటే ఈ కర్మేంద్రియాలకు రాజుగా ఉండాలి. బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు, మొత్తం సృష్టిచక్రంలో బాప్‌దాదా ఒక్కరే నా యొక్క ప్రతి బిడ్డ రాజాబిడ్డ, స్వరాజ్యాధికారులు అని నిశ్చయంతో చెప్పగలరు. ఫరిస్తా అంటే స్వరాజ్యాధికారులు. అటువంటి స్వరాజ్యాధికారి

Created by Universal Document Converter

ఆత్మలు ప్రకాశ స్వరూపులుగా ఉంటారు. ఇలా ఎవరైతే డబల్ తేలిక స్థితిలో స్థితులవుతారో వారి మస్తకంలో నడుస్తూ, తిరుగుతూ ఇప్పుడు ఈ తీవ్రపురుషార్థం యొక్క లక్ష్యం మరియు లక్షణాలను సదా ప్రత్యక్షంలోకి తీసుకురండి. ఎలా అయితే బ్రహ్మబాబాని చూసారు కదా, ఎవరైనా కలుసుకున్నా, దృష్టి తీసుకున్నా, మాట్లాడుతున్నా ఏమి కనిపించేది? మరియు అంతిమంలో కూడా అనుభవం చేసుకున్నారు కదా, బ్రహ్మబాబా మాట్లాడుతూ, మాట్లాడుతూ కూడా అశరీరీ స్థితిలో స్థితులయ్యేవారు, ఇతరులు సేవా సమాచారం వినిపిస్తున్నా కూడా అది వింటూ కూడా సెకనులో అశరీరీస్థితిని అనుభవం చేసుకుంటూ ఉండే వారు మరియు ఏ మురళిలో అయినా పరిశీలన చేయండి, మాటిమాటికి నేను అశరీరీ ఆత్మను అనే ఆత్మ పాఠాన్ని ఎన్నిసార్లు స్మృతిని ఇప్పించేవారు. ఇప్పుడు సమయానుసారంగా చిన్న, చిన్న విస్తారం యొక్క విషయాలు, స్వభావ, సంస్కారాల యొక్క విషయాలు అశరీరీస్థితి నుండి దూరం చేస్తున్నాయి. ఇప్పుడు పరివర్తన కావాలి.

బాప్‌దాదా చూసారు, సేవలో ఫలితం మంచిగా ఉంటుంది, సేవ కొరకు చాలా మంది ఉత్సాహ, ఉల్లాసాలతో ప్లాన్స్ కూడా తయారుచేస్తూ ఉంటారు కానీ సేవతో పాటు, సందేశం ఇవ్వటమనేది కూడా అవసరం మరియు బాప్‌దాదా ఈరోజు భిన్న, భిన్న వర్గాల యొక్క సేవ, భిన్న భిన్న స్థానాల సేవ యొక్క మంచి ఫలితం చూసారు కానీ అశరీరీస్థితి యొక్క వాయుమండలం శ్రమను తగ్గిస్తుంది మరియు ఎక్కువ ప్రభావాన్ని వేస్తుంది. విన్నది బావుంది అనిపిస్తుంది కానీ వాయుమండలం ద్వారా అశరీరీస్థితి యొక్క దృష్టి ద్వారా అనుభవం చేయించగలరు మరియు అనుభవాన్ని మర్చిపోలేరు. ఇప్పుడు ఫరిస్తాస్థితి యొక్క విశేషత సేవలో విశేషంగా కలపండి. శాంతి, సుఖం, సంతోషం, ఆత్మిక ప్రేమ ఇలా ఏదోక అనుభవం చేయంచండి. నడవడికలో ప్రేమ మరియు సంబంధం ద్వారా, పరివారం ద్వారా గౌరవాన్ని అయితే అనుభవం చేసుకుంటున్నారు కానీ ఇప్పుడు వాయుమండలం మరియు తరంగాల ద్వారా అతీంద్రియసుఖం యొక్క అనుభూతి, శాంతి యొక్క ఆత్మికనషా అనుభవం చేయించాలి విశేషంగా ఈ ధ్యాస పెట్టుకోండి. ఏదోకటి విశేషమైన అనుభవాన్ని చేయించండి. ఎలా అయితే మీ పద్ధతులకు ప్రభావితం అవుతున్నారు కదా, ఇటువంటి పద్ధతులు మరియు పరివారం యొక్క ప్రేమ ఎక్కడా దొరకదు అని అదేవిధంగా ఇప్పుడు ఏదోక శక్తి యొక్క, ఏదోక ప్రాప్తి యొక్క అనుభవం చేసుకుని వెళ్ళాలి. ఇప్పుడు 70-72 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. ఈ సమయంలో ఫలితంలో ఏమి కనిపిస్తుంది! శ్రమ చేసారు కానీ ఇప్పటివరకు బ్రహ్మకుమారీలు చేస్తున్నారు, బ్రహ్మకుమారీల జ్ఞానం మంచిది అంటున్నారు కానీ ఆ జ్ఞానం ఇచ్చేవారు ఎవరు! నడిపించేవారు ఎవరు! ఆధారం ఎవరు! మీ బాబా అనే మాట విని వీరి బాబా అని అంటున్నారు కానీ ఆయన నాకు కూడా తండ్రి అనే బాబా యొక్క ప్రత్యక్షత ఇప్పుడు గుప్తంగా ఉంది. బాబా, బాబా అంటున్నారు కానీ నా బాబా, నేను బాబా వాడిని, బాబా నావారు అనే మాట కోట్లలో కొద్దిమంది నుండే వస్తుంది.

సంగమయుగం యొక్క లక్ష్యం ఏమిటి? ఆత్మలైన మన అందరి తండ్రి వచ్చేసారు, వారసత్వం అయితే బాబా ద్వారా లభిస్తుంది కదా! వాయు మండలంలో ఆ ప్రభావం ఫరిస్తాస్థితి ద్వారానే వ్యాపిస్తుంది.వీరి దృష్టి ద్వారా ప్రకాశం లభిస్తుంది, వీరి దృష్టిలో ఆత్మీయత యొక్క ప్రకాశం కనిపిస్తుంది అనే అనుభవం అవుతుంది. ఇప్పుడు తీవ్రపురుషార్థం ఇదే లక్ష్యం పెట్టుకోండి, నేను డబల్‌లైట్ ఫరిస్తాను అని నడుస్తూ, తిరుగుతూ ఫరిస్తా స్వరూపం యొక్క అనుభూతిని

Created by Universal Document Converter

పెంచుకోండి. సెకనులో ఏ సంకల్పాలనైనా సమాప్తి చేయటంలో, స్వభావ, సంస్కారాలలో డబల్‌లైట్‌గా ఉండాలి. కొంతమంది పిల్లలు మేము తేలికగానే ఉంటున్నాము కానీ మమ్మల్ని ఇతరులు తెలుసుకోవటం లేదు అంటున్నారు కానీ ఇటువంటి డబల్‌ఫరిస్తాల యొక్క డబల్‌లైట్ యొక్క లైట్ దాగదు. స్థూలమైన చిన్న టార్చ్‌లైట్ అయినా లేదా చిన్న అగ్గిపుల్లను ఎక్కడైనా వెలిగించినా కానీ దాని వెలుగు దాగదు మరి ఇది ఆత్మికలైట్ కనుక ఈ లైట్ యొక్క అనుభవం ద్వారా వీరు ఎవరు అనే అనుభూతిని వారికి చేయించండి. జగదాంబ సరస్వతి మరియు దాదీ నన్ను ఎవరు తెలుసుకోవటం లేదు అని అనలేదు. వారి వాయుమండలం ద్వారా సర్వులకు ప్రియంగా అయ్యారు. అందువలనే దాదీ యొక్క ఉదాహరణ చెప్తున్నాను ఎందుకంటే బ్రహ్మాబాబా గురించి చెప్తుంటే బ్రహ్మాబాబాలో శివబాబా ఉండేవారు కదా అంటున్నారు లేదా శివబాబా గురించి చెప్తుంటే శివబాబా అయితే నిరాకారుడు, అతీతుడు మేమైతే స్థూలశరీరధారులం అని అంటున్నారు. ఇంత పెద్ద సంఘటనలో ఉంటున్నాము, ప్రతి ఒక్కరి సంస్కారాల మధ్య ఉండేవారము అని అంటున్నారు కానీ సంస్కారాలను కలుపుకోవటం అంటే ఫరిస్తాగా అవ్వటం. సంస్కారాలను చూసి కొంతమంది పిల్లలు బలహీనంగా కూడా అయిపోతున్నారు, బాబా చాలా మంచివారు, బ్రహ్మాబాబా కూడా చాలా మంచివారు జ్ఞానం కూడా చాలా మంచిది, ప్రాప్తులు కూడా చాలా మంచివి అంటున్నారు కానీ స్వభావ, సంస్కారాలను కలుసుకోవటం అంటే సర్వులకు ప్రియంగా అవ్వటం. కొంతమందికే ప్రియంగా అవ్వటం కాదు, ఎందుకంటే కొంతమంది పిల్లలు కొంతమందితో వారి విశేషతను చూసి ప్రియంగా అనిపిస్తున్నారు అని అంటున్నారు, వీరి ఉపన్యాసం బావుంటుంది, వీరిలో ఈ విశేషత చాలా బావుంది, వీరి వాణీ చాలా బావుంది అంటున్నారు కానీ ఫరిస్తాగా అవ్వటంలో ఇవే విఘ్నాలుగా వస్తాయి. ప్రియంగా చేయండి కానీ నేను ఆత్మను అతీతమైన వాడిని ఇలా అతీతస్థితిలో ప్రియంగా చేయండి. విశేషత వలన ప్రియంగా అవ్వటం కాదు. వీరి ఈ గుణం నాకు మంచిగా అనిపిస్తుంది అంటున్నారు భలే ఆ విశేషతను ధారణ చేయండి కానీ దాని వలన ప్రియంగా అవ్వటమనేది తప్పు. ఫరిస్తా అంటే అందరికీ ప్రియంగా ఉండాలి. ప్రతి ఒక్కరు నావారు అనే అనుభవం చేసుకోవాలి. ఫరిస్తాస్థితిలో రెండు విషయాలు విఘ్నం వేస్తున్నాయి. ఒకటి – దేహభ్రాంతి, ఇదైతే అందరికీ అనుభవమే, 63 జన్మల నుండి మరలా, మరలా దేహభ్రాంతి ప్రకటితమవుతూ ఉంది మరియు రెండవది – దేహాభిమానం. దేహభ్రాంతి మరియు దేహాభిమానం. జ్ఞానంలో ముందుకి వెళ్తూ అప్పుడప్పుడు స్వయం పట్ల కూడా దేహాభిమానంలోకి వచ్చేస్తున్నారు, ఆ అభిమానం అనేది క్రిందికి పడేస్తుంది. ఏమి దేహాభిమానం వస్తుంది? ఏదోక విశేషత ఉంటుంది కదా, ఆ విశేషత కారణంగా అభిమానం వస్తుంది, నేనేమి తక్కువ, నా ఉపన్యాసం అందరికీ ఇష్టమనిపిస్తుంది, నా సేవ ఎక్కువగా ప్రభావం వేస్తుంది, ఇలా ఏదోక కళ యొక్క అభిమానం అంటే నా సంభాషణాశక్తి చాలా మంచిది, నేను చాలా బాగా కోర్స్ చెప్పగలను ఇలా జ్ఞానంలో ముందుకి వెళ్ళికొలది, సేవలో ముందుకి వెళ్ళికొలది స్వయం గురించి కూడా ఈ అభిమానం వస్తుంది మరియు ఇతరుల గుణం లేదా కళ లేదా విశేషతను చూసి కూడా ప్రియంగా అయిపోతున్నారు కానీ ఏమి స్మృతి వస్తుంది? దేహాభిమానమే స్మృతి వస్తుంది కదా! ఫలానా వారి బుద్ధి చాలా మంచిది, నా సంభాషణాశక్తి చాలా మంచిది అనే ఈ అభిమానం సేవలో లేదా పురుషార్థంలో ముందుకి వెళ్ళేవారికి అభిమాన రూపంలో వస్తుంది కనుక కూడా పరిశీలన

Created by Universal Document Converter

చేసుకోవాలి మరియు అభిమానం ఉన్నవారికి అభిమానాన్ని పరిశీలించుకునే సాధనం ఏమిటంటే – అభిమానం ఉన్నవారి ఆలోచనను, వారి సలహాను, వారి కళను, వారి సంభాళనను ఎవరైనా అవమానపరిస్తే వారికి చాలా తొందరగా ఆ అవమానం అనుభవం అయిపోతుంది మరియు మరొక సూక్ష్మ గుర్తు ఏమిటంటే వారికి క్రోధం యొక్క అంశమైన గర్వం కూడా ఉత్పన్నం అయిపోతుంది; అది ఫరిస్తాగా అవ్వనివ్వదు.

వర్తమాన సమయానుసారంగా బాప్‌దాదా మరలా సైగ చేస్తున్నారు – మీ సంగమయుగం యొక్క చివరి స్వరూపమైన ఫరిస్తాస్థితిని ఇప్పుడు జీవితంలో ప్రత్యక్షం చేయండి, సాకారంలోకి తీసుకురండి. ఫరిస్తాగా అవ్వటం ద్వారా అశరీరీగా అవ్వటం చాలా సహజం అయిపోతుంది. స్వయాన్ని పరిశీలించుకోండి – సూక్ష్మ రూపంలో కూడా స్వయం యొక్క లేదా ఎవరి విశేషత యొక్క అభిమానం అయితే లేదు కదా? కొంతమంది పిల్లలకు చిన్న విషయం జరిగినా స్థితి అలజడి అయిపోతుంది. సంతోషకరమైన ముఖానికి బదులు చింతనతో కూడిన ముఖం లేదా చింతతో కూడిన ముఖం ఉంటుంది మరియు నడుస్తూ,నడుస్తూ బలహీనం కూడా అయిపోతున్నారు. సంతోషంగా ఉండడానికి బదులు బలహీనంగా అయిపోతున్నారు కనుక అర్థమైందా ఇప్పుడు మీ సంగమయుగం యొక్క చివరిస్థితి అయిన ఫరిస్తాస్థితి యొక్క సంస్కారాన్ని ప్రత్యక్షం చేయండి. బ్రహ్మాబాబాని చూసారు కదా, తండ్రిని అనుసరించాలి కదా! ఆయన చివరి స్థితి గురించి కొంతమంది పిల్లలకు అనుభవం ఉంది కదా, సమాచారం వినిపించడానికి వచ్చేవారు కానీ బాబా ఆ సమాచారాన్ని వింటూ దానికి అతీతంగా, ధ్వనికి అతీతమైన స్థితి యొక్క అనుభవంలో ఉండే వారు ఈ స్థితిని కొంతమంది అనుభవం చేసుకున్నారు మరియు చూసారు కూడా! అనేక విషయాల సమాచారం వినిపించడానికి, చాలా ప్లాన్స్ తయారుచేసుకుని ఇది చెప్పాలి, ఇది చెప్పాలి, ఇది అడగాలి అని వచ్చేవారు కానీ ఎదురుగా రాగానే ఏది మాట్లాడాలి అని అనుకునేవారో అది మర్చిపోయే వారు; ఇదే ఫరిస్తాస్థితి. ఈరోజు పాఠాన్ని పక్కా చేసుకున్నారా? నేనెవరు? ఫరిస్తా. ఏ విషయాలతో అయినా, ఇతరుల విశేషతలతో అయినా, మీ విశేషతతో అయినా దేహాభిమానానికి అతీతంగా డబల్‌లైట్ ఫరిస్తాగా ఉండాలి ఎందుకంటే ఫరిస్తాగా అవ్వకుండా ఉన్నతమైన దేవతాపదవి లభించదు. సత్యయుగంలోకి అయితే వస్తారు ఎందుకంటే పిల్లలుగా అయ్యారు కనుక వారసత్వం అయితే లభిస్తుంది కానీ శ్రేష్ట పదవి లభించదు. సదా వెంట ఉంటాము మరియు వెనువెంట రాజ్యం చేస్తాము అనే ప్రతిజ్ఞానుసారంగా సింహాసనంపై కూర్చోకపోయినా కానీ రాజ్యాధికారిగా అవుతారు అక్కడి రాజ్యసభ చూసారు కదా! రాజ్యసభకు అధికారులు తిలకం మరియు కిరీటధారులుగా ఉంటారు. రాజ్య తిలకం మరియు కిరీటం రాజ్యానికి గుర్తు. చాలాకాలం నుండి స్వరాజ్యాధి కారులు అవ్వాలి, మధ్యమధ్యలో కాదు. చాలాకాలం నుండి స్వరాజ్యాధి కారులుగా ఉండేవారు, సింహాసనంపై కూర్చోకపోయినా కానీ రాయల్ ఫ్యామిలీలో అధికారిగా అవుతారు. మంచిది.

ఎవరైతే మొదటిసారి వచ్చారో వారు నిల్చోండి! మంచిది. సభలో మూడు వంతుల మంది నిల్చున్నారు. మంచిది, ఎవరైతే మొదటిసారి వచ్చారో వారందరికీ బాబా యొక్క సాకారమిలనం యొక్క మరియు మొదటి జన్మదినోత్సవం యొక్క శుభాకాంక్షలు. వచ్చిన పిల్లలందరికీ బాప్‌దాదా యొక్క వరదానం ఇదే, ఇప్పుడిక బాగా ఆలస్యం అనే బోర్డ్ వచ్చే సమయం కానీ క్రొత్తగా వచ్చిన

Created by Universal Document Converter

పిల్లలకు ఒక విశేషమైన వరదానం ఇస్తున్నాను.మేము ఎలా ముందుకి వెళ్తాము? అని ఎప్పుడూ కూడా ఈ సంకల్పం చేయకండి. ఇప్పుడు మీరు ఆలస్యంగా వచ్చారు కానీ బాగా ఆలస్యంగా రాలేదు. ఇప్పుడు మీ పట్ల బాప్‌దాదాకి మరియు నిమిత్తంగా అయిన బ్రాహ్మణపరివారం యొక్క సోదరి సోదరులకు విశేష సహయోగం యొక్క భావన ఉంది. మీరు ఈ కొద్ది సమయాన్ని అంటే ఒక్కొక్క సెకనుని సఫలం చేసుకోవాలి ఎందుకంటే కొద్ది సమయంలో చాలా పొందాలి. ఒక సెకను కూడా వ్యర్థంగా పోగొట్టు కోకూడదు, కర్మయోగి అయ్యి నడవాలి, కర్మ వదలకూడదు కానీ కర్మలో యోగాన్ని కలిపి కర్మ మరియు యోగం యొక్క సమానతను ఉంచుకోవాలి. సమానత ఉంచుకునే వారికి ఎగ్స్ట్రా (అదనపు) ఆశీర్వాదాలు లభిస్తాయి. బాగా ఆలస్యం అనే బోర్డ్ ఇక ముందు పెడతారు కానీ ఎవరైతే ఆలస్యంగా వచ్చారో వారు ఈ కొద్ది సమయంలో చాలా పురుషార్థం చేసుకోవచ్చు, ధైర్యం ఉన్న పిల్లలకు బాబా సహాయం చేస్తారు అనే వరదానాన్ని బాప్‌దాదా ఇస్తున్నారు.ఎలా అయితే సేవపై ధ్యాస పెడుతున్నారు కదా కనుక వృద్ధిని పొందుతూ వచ్చింది కదా దీనికి బాప్‌దాదా సంతోషిస్తున్నారు కానీ ఇప్పుడు ధారణపై మరింత ధ్యాస ఉండాలి ఎందుకంటే అంతిమంలో సేవ చేయాలనుకున్నా చేయలేరు. ఇప్పుడు చేసుకున్నదే ఉండిపోతుంది. ఆ సమయంలో ఫరిస్తా జీవితం మరియు అశరీరీ అయ్యి సెకనులో బిందువు పెట్టడం ఇవే ఉపయోగ పడతాయి మరియు అకస్మాత్తుగా జరుగుతాయి.సేవ చేసారు కానీ ఈ అభ్యాసం తక్కువగా ఉండి సేవలోనే నిమగ్నం అయిపోకూడదు కానీ రెండింటి సమానత ఉండాలి. బాప్‌దాదా మాటిమాటికి సైగ చేస్తున్నారు - అకస్మాత్తుగా పరిస్థితులు చాలా రానున్నాయి అందువలన మీరు చెప్పలేదు అని బాప్‌దాదాని నిందించకండి. మాటిమాటికి బాబా రకరకాలైన సైగలు చేస్తున్నారు.సేవకి ఫలం లభిస్తుంది మరియు సేవకి మార్కులు కూడా ఉంటాయి ఎందుకంటే నాలుగు సబ్జక్టులు కదా కనుక సేవా సబ్జక్టులో మార్కులు లభిస్తాయి కానీ మిగిలిన మూడు సబ్జక్టులలో అంటే ఒకవేళ ఒక సబ్జక్టులో మార్కులు తీసుకుని మిగిలిన మూడింటిలో తక్కువ మార్కులు తీసుకుంటే ఏ నెంబర్ వస్తుంది?నాల్గింటిలో మొదటినెంబర్ రావాలి కదా! ప్రతి బిడ్డపై బాబాకి ఉన్న శుభ ఆశ ఇదే. బాబా యొక్క ఆశాసితారలు ఎవరు? చేతులు ఎత్తండి! బాబా యొక్క ఆశాసితారలైతే బాప్‌దాదా యొక్క గొప్ప ఆశ ఏమిటంటే- నాలుగు సబ్జక్టులలో మంచి నెంబర్ తీసుకోవాలి. లేకపోతే కనుక పాస్‌విత్‌ఆనర్ కాలేరు. నాలుగు సబ్జక్టులలో మంచి నెంబర్ తీసుకున్నవారినే మహారథి అని అంటారు. అనడానికి అయితే వీరు మహారథి, వారు మహారథి అని చాలామందిని అంటారు కానీ ఒకవేళ మంచి నెంబర్ కనుక తీసుకోకపోతే బాప్‌దాదాకి నమ్మకమైన ఆత్మలే కానీ ఆశాసితారలు కాదు. ఎలా అవ్వాలి? నమ్మకమైనవారిగా అవ్వాలి? ఆశాసితారలుగా, సఫలతాసితారలుగా అవ్వాలి.

డబల్ విదేశీయులతో - (80 దేశాల నుండి వచ్చారు) మధువనంలో అందరి సంఘటన జరగాలి అని ఏదైతే ప్రోగ్రామ్ తయారుచేసారో అది బాప్‌దాదాకి చాలా ఇష్టమనిపిస్తుంది ఎందుకంటే మధువనం రావటం ద్వారా ఎంత పెద్ద పరివారం ఉంటుంది! నలువైపుల సేవలు ఎలా జరుగుతున్నాయి అనేది కూడా తెలుస్తుంది. భారతదేశం వారు విదేశీ సేవ ద్వారా విదేశంలో ఇది చేస్తున్నారు మనం కూడా చేయాలి అనే లాభాన్ని పొందుతున్నారు మరియు విదేశం వారు భారతదేశం యొక్క సమాచారం విని తమ స్థానంలో ఎక్కడ నుండి ఏదైతే అక్కడ లాభాన్ని పొందుతున్నారు.

Created by Universal Document Converter

విదేశీయులను విదేశంలో కలుసుకోవాలంటే కష్టం కానీ మధువనంలోడబల్ లాభం ఉంది. బాప్‌దాదాతో కలయిక కూడా జరుగుతుంది మరియు పరివారంతో కలయిక కూడా జరుగుతుంది. ఇప్పుడు నియమప్రమాణంగా మధువనంలో ఏవైతే మీటింగ్స్ మరియు ఏవైతే చిన్న చిన్న సంఘటనలు జరుగుతున్నాయో అవి బాప్‌దాదాకి చాలా ఇష్టమనిపిస్తున్నాయి మరియు ప్లాన్ కూడా మంచిగా తయారుచేస్తున్నారు మరియు ప్రత్యక్షంలో కూడా చేస్తున్నారు. డబల్‌విదేశీయులు ప్రతి సంవత్సరం జరిగే వృద్ధిని చూసి బాప్‌దాదా నలువైపుల ఉన్న డబల్‌విదేశీ పిల్లలకు శుభాకాంక్షలు ఇస్తున్నారు మరియు ఎంతెంత సంఘటన జరుగుతూ ఉంటుందో ఆ సంఘటన ద్వారా ఒకరి అనుభవాలు ఒకరు వినటం ద్వారా బలం లభిస్తుంది. కొంతమందికి అనుభవం ద్వారా కూడా బలం లభిస్తుంది. ఎవరైనా బలహీనంగా అయిపోతే, వీరు సదా సంతోషంగా ఉంటారు, వీరి ముఖం ఎప్పుడూ వాడిపోదు అని అనుభవం ఇతరుల అనుభవం వినిపిస్తే వారు కూడా ఉల్లాసంలోకి వస్తారు. ఒక్కొక్కరి అనుభవాలు తక్కువేమీ కాదు, ప్రతి ఒక్కరికి డ్రామానుసారం ఏదోక విశేషత బాబా ద్వారా లభించింది. ఆ అనుభవాన్ని వినటం వలన వారు చేయగల్గుతున్నప్పుడు నేనెందుకు చేయలేను అనే ఉల్లాసం వస్తుంది. ఎప్పుడూ హృదయాన్ని చిన్నదిగా చేసుకోకూడదు; హృదయం విశాలంగా ఉండాలి. బాబా విశాలమైనవారు కనుక పిల్లల హృదయం కూడా విశాలంగా ఉండాలి. బాప్‌దాదా యొక్క స్లోగన్ ఏమిటంటే – స్వచ్ఛమైన మరియు సత్యమైన హృదయానికి యజమాని రాజీ అవుతారు. ఏదైనా మురికి వచ్చినా ఎందుకంటే ఇది మురికి ప్రపంచం కదా కనుక ఎప్పుడైనా వాయుమండలంలో మురికి ఎగిరి వస్తుంది కానీ ఆ మురికిని మీ దగ్గర పెట్టుకోకండి.

ఎలా అయితే స్థూలంగా నిద్రించే గదిలో ఏదైనా మురికి ఉంటే ఏమౌతుంది? దానిని శుభ్రం చేయకపోతే దోమలు వచ్చేస్తాయి మరలా అనారోగ్యం వస్తుంది అలాగే ఇక్కడ కూడా ఒకవేళ మనస్సులో ఏదైనా విషయం ఉంటే దానిని తొలగించుకోకపోతే అది వృద్ధి అవుతూ ఉంటుంది. బాబా, నా బాబా అని అంటే బాబా హాజరైపోతారు, బందీ అయిపోతారు. మీరు బాబాకి పిల్లలు, భగవంతుని పిల్లలు నా బాబా అని స్మృతి చేయగానే బాబా హాజరు అవ్వకపోవట మనేది ఉండదు. మీ దగ్గర బాబాని బంధించే త్రాడు ఉంది అది ఏమిటి? హృదయపూర్వకమైన ప్రేమ. కొంతమందికి బాబాపై ప్రేమ ఉంది; లేదు అని అనటంలేదు కానీ ప్రేమ అనేది రెండు రకాలుగా ఉంటుంది –1.జ్ఞానం ఆధారంగా ప్రేమ అంటే నేను ఆత్మను, శరీరాన్ని కాదు మరియు ఆత్మలకు తండ్రి పరమాత్మ మరియు జ్యోతి స్వరూపుడు తప్ప మరెవ్వరు అందరికీ పరమాత్మ అవ్వరు. తండ్రి తండ్రే, జ్యోతిస్వరూపుడే, సహయోగం ఇస్తారు కానీ ప్రతి సమయం హృదయపూర్వకమైన స్నేహంతో స్వతహాగా నా బాబా అనే మాట రావాలి. అవసర సమయానికి ఉపయోగపడేటందుకు సహయోగిని తయారు చేసుకుంటారు కదా కానీ మీరు బాబాని కంబైండ్‌గా పెట్టుకున్నారు, సాతీగా చేసుకున్నారు కనుక సమయానికి సహయోగాన్ని తీసుకోండి. స్నేహంతో జ్ఞాపకంచేయండి. 1.జ్ఞానం ఆధారంగా స్నేహం పెట్టుకోవటం. 2. హృదయపూర్వకమైన ప్రేమతో స్నేహం చేయటం. హృదయపూర్వకమైన ప్రేమ ఉందా? అనేది పరిశీలన చేసుకోండి. ప్రేమ ఉన్నవారిని మర్చిపోవటం కష్టం అవుతుంది. షుగర్ ఉన్నవారు పంచదార తినకూడదు కానీ వారికి పంచదారతో ప్రేమ ఉంటుంది కనుక అదే జ్ఞాపకం వస్తుంది దానిని మర్చిపోగలరా?

Created by Universal Document Converter

వైద్యులు మందులు ఇస్తూ ఉంటారు, తినవద్దు అని చెప్తారు కానీ వారు తింటూ ఉంటారు దానితో ప్రేమ ఉన్న కారణంగా చెప్పినా వదలలేకపోతున్నారు ఇక్కడ బాబా సర్వప్రాప్తులు అనుభవం చేయించేవాడు. అందరు వింటున్నారు కదా! నిమిత్తంగా విదేశీయులకు చెప్తున్నాను కానీ అందరు వింటున్నారు. కనుక ఇప్పుడు హృదయపూర్వకమైన ప్రేమ ఉందా? అనేది పరిశీలన చేసుకోండి. భగవంతుడిని స్నేహితునిగాచేసుకున్నారా? స్నేహితుడిని ఎందువలన తయారుచేసుకుంటారు? తండ్రి మీద కంటే స్నేహితునిపై ఎక్కువ ప్రేమ ఉంటుంది కనుక భగవంతుడిని స్నేహితునిగా చేసుకున్నారా? ఏదైనా విషయం వచ్చినా బాబా నువ్వే సంభాళించు అని ఇలా చిన్న పిల్లలుగా అయిపోండి, పెద్దవారిగా అవ్వకండి. బాధ్యత బాబా తీసుకుంటారు. బాబాని ప్రేమ అనే త్రాడుతో మరలా కదలకుండా ఉండేలా బందించేయండి. అర్ధమైందా! అందరు అర్ధం చేసుకున్నారు కదా! కొన్నిసార్లు ఈరోజు నిన్ను మర్చిపోయాము బాబా అని అంటున్నారు. అది విని బాప్‌దాదాకి ఎంతో ఆశ్చర్యంగా అనిపిస్తుంది! మర్చిపోయారా! 63 జన్మల నుండి మర్చిపోతూ వచ్చారు, ఇప్పుడు కూడా మర్చిపోతున్నారా! ఒక జన్మ మరియు చిన్న జన్మ.21 జన్మలు పూర్తిగా మర్చిపోయారు ఇప్పుడు కూడా మర్చిపోతున్నారా ఏమిటి?

అందువలన ఇప్పుడు మాయ యొక్క చతురతను కూడా అర్ధం చేసుకోండి. అప్పుడప్పుడు మాయకు మర్యాద కూడా చేస్తున్నారు. మేము సమయానికి తయారైపోతాము అంటున్నారు. మేము తయారైపోతాము ఇలా మాయకు సహయోగం ఇవ్వటం వలన, మర్యాద చేయటం వలన ఆ మర్యాదను చూసి మాయ కూడా నీరు మరియు టీ త్రాగుతూ ఉండిపోతుంది. తండ్రిని అనుసరించడానికి బదులు మాయను అనుసరిస్తున్నారు. పురుషార్ధులం కదా, ఎవరూ సంపూర్ణంగా కాలేదు, ఇదైతే జరుగుతూనే ఉంటుంది ఇలా ఆలోచించడమే మాయను అనుసరించడం. ఇప్పుడు అప్పుడప్పుడు బాప్‌దాదా పరిక్రమణకు వచ్చినప్పుడు ఎటువంటి ముఖాన్ని చూసారో తెలుసా! అప్పుడప్పుడు ముఖం మంచిగా ఉండటంలేదు. ఆలోచిస్తూ ఉంటున్నారు. ఏమి చేయము, ఇది చేయమా, వద్దా, ఇది చేయటం వలన లాభం ఉంటుందా, మంచిగా అవుతుందా ఇలా చాలా ఆలోచిస్తున్నారు. బ్రహ్మాబాబాని అనుసరించండి. బ్రహ్మాబాబా గమ్యానికి చేరుకున్నారు కదా! ఎక్కువగా ఎందుకు ఆలోచిస్తున్నారు? కేవలం తండ్రిని అనుసరించండి అంతే.ఇది కేవలం విదేశీయులకే చెప్పటం లేదు, అందరికీ చెప్తున్నాను.( విదేశి డేవిడ్ అన్నయ్యతో మాట్లాడుతున్నారు) పిల్లలకు ఉత్సాహ, ఉల్లాసాలు అలా ఉన్నాయి ఇది బాప్‌దాదా చూసారు. ఇప్పుడు ఆ ఉత్సాహ, ఉల్లాసాలను ప్రత్యక్షంలోకి తీసుకురావటంలో సహయోగి అయ్యి సహయోగం తీసుకుంటూ మరియు సహయోగాన్ని ఇస్తూ ఉంటే ముందుకి వెళ్ళగలరు. విషయాలైతే వస్తూ ఉంటాయి కానీ ఉత్సాహ, ఉల్లాసాలను ఎప్పుడూ బలహీనం చేసుకోకూడదు. విషయాలైతే వస్తూ ఉంటాయి కానీ ఉత్సాహ, ఉల్లాసాలనే రెక్కలను బలహీనం చేసుకోకూడదు, ఎగురుతూ ఉండాలి. రెక్కలు ఎగరడానికే ఉన్నాయి. ఉత్సాహ ఉల్లాసాలు కొద్దిగా తక్కువైనా కానీ ఎగరలేరు. విషయాలైతే వెళ్ళిపోతాయి కానీ సంతోషం పోకూడదు, ఉత్సాహ, ఉల్లాసాలు పోకూడదు. ఉత్సాహం మంచిగా ఉంది అనేది బాప్‌దాదా చూసారు ఇప్పుడు దానిని సదా స్థిరంగా ఉంచుకోవాలి అప్పుడు జంప్ చేయగలరు.

నలువైపుల ఉన్న సంతోషంగా, సత్యమైన హృదయంతో, స్వచ్ఛమైన హృదయంతో ఉండేవారికి ప్రతి సంకల్పంలో బాబా రాజీ అయిపోతారు. దీని అర్ధమేమిటంటే ఏ సంకల్పం చేసినా బాబాకి

Created by Universal Document Converter

సఫలత ప్రాప్తిస్తుంది. ఇలా విశాలహృదయం, సత్యమైన హృదయం, సత్యమైన హృదయం ఈ మూడు విశేషలతో ఉండే నలువైపుల ఉన్న పిల్లలనుచూసి బాప్‌దాదా కోటానుకోట్ల కంటే ఎక్కువగా సంతోషం అవుతున్నారు మరియు స్వతహాగా ఓహో నా పిల్లలు ఓహో అనే పాట పాడుతున్నారు. సదా శుభాకాంక్షలకు పాత్రులైన పిల్లలు ఓహో అని పాడుతున్నారు. సదా బాబాని సాతీగా చేసుకుని నడిచేవారికి, చేతిలో చేయి వేసి చేయి అంటే శ్రీమతం ఇలా చేతిలో చేయి వేసి ఎగిరేవారికి, ఇప్పుడు నడవటమనేది సమాప్తి అయిపోయింది ఇప్పుడు ఎగిరేవారు, ప్రతి అడుగులో బ్రహ్మాబాబాను అనుసరించేవారు. ఇక ఏమీ ఆలోచించకండి. చేయనా, వద్దా, మంచిగా అవుతుందా, అవ్వదా, ఇష్టమనిపిస్తుందో లేదో ఇలా ఆలోచించవలసిన అవసరంలేదు. బ్రహ్మాబాబా ఏదైతే చేసారో అది రైట్, ఆలోచించవలసిన అవసరం లేదు. అనుసరించడం అయితే సహజం కదా! మరలా ఈరోజు ఏంటో భారంగా అనిపిస్తుంది ఏమయ్యిందో తెలియటంలేదు అని అంటున్నారు ఎందుకంటే ఏదోక విషయం గురించి ఆలోచిస్తున్నారు.

నలువైపుల ఉన్న పిల్లలందరికీ బాప్‌దాదా యొక్క హృదయపూర్వకమైన ఆశీర్వాదాలు మరియు కోటానుకోట్ల అభినందనలు. ఎవరైతే శివరాత్రికి తమ తమ సేవలలో ఉంటారో వారికి ఇప్పటినుండే శివరాత్రి అంటే  మీ పుట్టినరోజు  యొక్క ఆశీర్వాదాలు మరియు శుభాకాంక్షలు ఇస్తున్నారు మరియు ఏవైతే ఉత్తరాలు, ఈ-మెయిల్స్‌పంపిస్తున్నారో అవి సెకను కంటే తక్కువ సమయంలో బాప్‌దాదా దగ్గరికి చేరుకుంటాయి. అటువంటి ఆత్మలకు కూడా ప్రియస్మృతులు. దాహంతో ఉన్న ఆత్మలకు, బంధనాలలో ఉండేవారు విఘ్నాలను కూడా హారంగా చేసుకున్నారు అటువంటి ఆత్మలకు కూడా ప్రియస్మృతులు మరియు ఇప్పుడు క్రొత్తగా ఎవరైతే స్నేహి ఆత్మలు వస్తున్నారో వారికి కానీ వారు తక్కువగా ఉంటారు. ఇలా నలువైపుల ఉన్న యువకులకు, వృద్ధులకు, మాతలకు, పాండవులకు అందరికీ  ముందుగానే  మీ యొక్క మరియు బాబా యొక్క పుట్టినరోజు యొక్క  శుభాకాంక్షలు.

## జన్మదినోత్సవమున తీవ్రపురుషార్థం ద్వారా మొదటి తరగతిలోకి వచ్చే బహుమతిని పొందేటందుకు ప్రతి శ్వాస, సంకల్పం సమర్థంగా ఉండాలి. మనస్సు విశాలంగా మరియు సత్యంగా  ఉంటే ప్రతి అవసరం తీరుతుంది ....22-2-09

ఈరోజు జీరో (బిందువు) అయిన బాబా తన యొక్క హీరో పిల్లలను కలుసు కునేటందుకు వచ్చారు. ఈరోజు మీరందరు బాబా యొక్క మరియు బాబాతో పాటు మీ యొక్క జన్మదినోత్సవాన్ని జరుపుకునేటందుకు వచ్చారు. కనుక బాప్‌దాదా పిల్లలందరికీ, ఎదురుగా కూర్చున్నా కానీ, దూరంగా ఉన్నా కానీ మనస్సుతో దగ్గరగా కూర్చున్న వారికి, నలువైపుల ఉన్న పిల్లలందరికీ సర్వ సంబంధాలతో శుభాకాంక్షలు ఇస్తున్నారు. విశేషంగా మూడు రూపాలుగా శుభాకాంక్షలు. తండ్రి, శిక్షకుడు మరియు సద్గురువు యొక్క రూపంతో మూడు శుభాకాంక్షలు అంటే పాలన, చదువు మరియు వరదానాలను నలువైపుల ఉన్న పిల్లలందరికీ  విశేషంగా  ఇస్తున్నారు.  పిల్లలందరికీ

Created by Universal Document Converter

శుభాకాంక్షలు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. ఈనాటి ఈ జన్మదినోత్సవాన్ని భక్తులు కూడా జరుపుకుంటారు కానీ పిల్లలైన మీకు తెలుసు - ఈ జన్మదినం తండ్రి మరియు పిల్లల యొక్క స్నేహపూర్వక జన్మదినం. ఆది నుండి తండ్రి మరియు పిల్లలు కలిసి ఉన్నారు. విశ్వపరివర్తనా కార్యంలో కూడా తండ్రి పిల్లలతో కలిసి ఉన్నారు ఎందుకంటే తండ్రికి పిల్లలంటే చాలా చాలా స్నేహం. ఇప్పుడు కూడా కలిసి ఉన్నారు మరియు ఇంటికి వెళ్ళేది కూడా కలిసే వెళ్ళాలి. బాబా తన పిల్లలు లేకుండా వెళ్ళలేరు, పిల్లలు బాబా లేకుండా వెళ్ళలేరు, ఎందుకంటే మనస్పూర్వక స్నేహంతో కలిసి ఉన్నారు. ఇంటికి వెళ్ళిన తర్వాత రాజ్యంలోకి వచ్చేటప్పుడు కూడా బ్రహ్మాబాబాతో పాటు రాజ్యం చేస్తారు. అన్ని జన్మలకంటే ఈ జన్మ అతి ప్రియమైనది మరియు అతీతమైనది. ఈ జన్మకి ఉన్న విలువ కల్పమంతటి 84 జన్మలకు ఉండదు. ఇటువంటి స్నేహం మరియు తోడుగా ఉండే విశేష వజ్రతుల్య జన్మ ఇది. మీరందరు మీ జన్మదినాన్ని జరుపుకునేటందుకు వచ్చారా లేక బాబా జన్మదినాన్ని జరుపుకునేటందుకు వచ్చారా? బాబా పిల్లలది జరుపుకునేటందుకు మరియు పిల్లలు బాబాది జరుపుకునేటందుకు వచ్చారా? భక్తులు కూడా నలువైపుల శివజయంతి లేదా శివరాత్రిని జరుపుకుంటారు. చాలా ప్రేమతో జరుపుకుంటారు, కానీ వారు జరుపుకోవటం మరియి మీరు జరుపుకోవటంలో తేడా ఉంది. వారు రాత్రి జరుపుకుంటారు మీరు అమృతవేళ జరుపుకుంటారు. అమృతవేళ శ్రేష్టమైన వేళ. అమృతవేళలోనే బాప్‌దాదా ప్రతి బిడ్డ యొక్క జోలెను వరదానాలతో నింపుతారు. అందరి జోలె వరదానాలతో నిండింది కదా! రోజూ వరదాత నుండి వరదానం లభిస్తూనే ఉంటుంది. మీ ఒకొక్కరికీ బాప్‌దాదా నుండి ఎన్నెన్ని వరదానాలు లభించాయి! ఆ వరదానాలతో జోలె నిండిపోయింది కదా! చాలా ఉత్సాహ ఉల్లాసాలతో వచ్చారు. పిల్లలను చూసి బాప్‌దాదా కూడా చాలా చాలా సంతోషిస్తున్నారు. ఓహో పిల్లలూ! ఓహో!! అని పాడుకుంటున్నారు. ఓహో బాబా! ఓహో!! అని పిల్లలు పాడుకుంటున్నారు కానీ బాబా ఓహో పిల్లలూ! ఓహో!! అని పాడుకుంటున్నారు. ఎందుకంటే ఎవరైతే బాబా పిల్లలుగా అయ్యారో వారందరు కోట్లలో కొందరిలో కొందరు. విశ్వంలో ఎన్ని కోట్ల ఆత్మలు ఉన్నారు కానీ వారందరిలో పిల్లలైన మీరు అదృష్టవంతులు మరియు ప్రియమైనవారు అని బాప్‌దాదా అంటారు. అన్ని కోట్లలో పిల్లలైన మీరు కొందరే. కోట్లలో కొద్దిమందిలో మేము కొద్దిమందిగా కల్పకల్పాలు ఉంటాం అనే నషా ఉందా? వర్తమాన సమయంలో ఎంత పెద్ద పెద్ద పదవులు కలిగిన ఆత్మలు ఉన్నా కానీ బాబాని గుర్తించి, బాబా యొక్క జన్మదినాన్ని జరుపుకునేవారు, బాబాని గుర్తించిన నలువైపుల పిల్లలు కోట్లలో కొద్దిమందే ఉంటారు. కోట్లలో కొద్దిమందిలో మేము ఉన్నాం అనే సంతోషం ఉందా? నషా ఉందా? చేతులెత్తండి. అవినాశి నషా ఉంది కదా! అప్పుడప్పుడు నషా ఉండేవాళ్ళు కాదు కదా! సదా ఉంది మరియు సదా ఉంటుంది. మాయ అయితే పరీక్ష తీసుకుంటుంది. అనుభవం ఉంది కదా! పరమాత్మ పిల్లలంటే మాయకు కూడా చాలా ప్రేమ. కానీ పిల్లలైన మీకు తెలుసు - డ్రామా ఆది నుండి అంతిమం వరకు పరమాత్మ పిల్లలకు మరియు మాయకు సంబంధం ఉంటుంది. మాయ మరియు పరమాత్మ పిల్లలు ఇద్దరికీ పరస్పరంలో సంబంధం ఉంటుంది. మాయ పని - రావటం మరియు పిల్లల పని ఏమిటి? మాయను దూరం నుండే పారద్రోలటం. రానివ్వకూడదు, రానిస్తున్నారా? రానివ్వకూడదు, దూరం నుండే తరిమేయండి. రానిస్తే ఇక రావటం అలవాటు అయిపోతుంది, రానిస్తున్నారు కదా యుద్ధం అని ఆట కూడా అనుకుంటారు.

Created by Universal Document Converter

బాబా చూశారు - కొంతమంది పిల్లలు మాయను రానివ్వటమే కాదు, మాయకు మర్యాద కూడా చేస్తున్నారు, మంచినీళ్ళు, టీ కూడా ఇచ్చి ఎలా మర్యాద చేస్తున్నారో తెలుసా? మాయా ప్రభావంలోకి వచ్చేసి ఇప్పుడు ఇంకా టూ లేట్ (బాగా ఆలశ్యం) అనే బోర్డు ఇంకా పెట్టలేదు కదా అంటే ఇంకా సమయం ఉంది. పురుషార్ధం చేస్తూ ఉన్నాం, చేరిపోతాం అని అనుకుంటున్నారు. నన్ను రానివ్వటమే కాకుండా, నా తోడుగా ఉంటున్నారు, నాకు మర్యాద చేస్తున్నారు అని మాయ కూడా అనుకుంటుంది. కొంతమంది పిల్లలు మాయను గ్రహించటంలోనే పొరపాటు చేస్తున్నారు. మాయ యొక్క మతమో, బాబా యొక్క మతమో గ్రహించని కారణంగా మాయా ప్రభావంలోకి వెళ్ళిపోతున్నారు. కానీ బాబా తన యొక్క అదృష్ట, మహావీర్, విజయీ పిల్లలకు చెప్తున్నారు - మాయను రానివ్వకండి. వచ్చినా కానీ తరిమివేయండి. దీని కోసం సమయం ఉపయోగించకండి ఎందుకంటే సమయం తక్కువగా ఉంది మరియు విశ్వపరివర్తకులై, విశ్వసేవకులై ఆత్మలకు బాబా పరిచయాన్నిచ్చి ముక్తి వారసత్వం ఇస్తాం అనే మీరు శపథం చేసిన కార్యం ఇప్పుడింకా సమాప్తి అవ్వలేదు. ఈ కార్యాన్ని సమాప్తి చేయటంలో సమయాన్ని ఉపయోగించాలి. మాయను తరమటంలో సమయాన్ని ఉపయోగిస్తే విశ్వపరివర్తకులం అనే శపథాన్ని ఎలా పూర్తి చేయగలరు! బాబా తోడుగా ఉండేవారు కదా! ఇప్పుడు కూడా తోడుగా ఉంటాం, తోడుగానే వెళ్తాం అని జన్మతోనే ప్రతిజ్ఞ చేశారు కదా! అందువలన ఇప్పుడు బాబా నుండి ఏవైతే శక్తులు లభించాయో ఆ శక్తుల ఆధారంగా మాయను దూరం నుండే తరిమేయండి. దీనిలో సమయాన్ని ఉపయోగించకండి. చూడండి, 70 సం॥లుగా పురుషార్ధం చేస్తూనే ఉన్నారు, ఇప్పటికీ మాయ రావటం మరియు తరమటం, ఇప్పటి సమయం దీనికోసం కాదు. ఎందుకో మీకు తెలుసు, జ్ఞానసాగరులు కదా! డ్రామా జ్ఞానం అంతా ఉంది అంటే జ్ఞానసాగరులు కనుక ఇప్పుడు సమయం దేనికోసం ఉపయోగించాలి. రెండు ఖజానాలను చాలా జమ చేసుకోవాలి. ఆ రెండు ఖజానాలు ఏవి? 1. సంకల్పం 2. సమయం. ఈ రెండు ఖజానాలు గొప్పవి. జ్ఞానసాగరుని పిల్లలు మీరు కూడా జ్ఞాన సాగరులు కనుక మీకు కూడా తెలుసు కదా! మాస్టర్ జ్ఞానసాగరులు కదా! అందరూ జ్ఞాన సాగరులేనా? చేతులెత్తారు, మంచిది. ఓహో! జ్ఞానం అంతా వచ్చేసింది. మాయను పారద్రోలే జ్ఞానం ఉందా? వెనుక ఉన్నవారికి ఉందా? మంచిది. జెండాలు ఊపుతున్నారు. మాతలకు ఉందా? మాతలు జ్ఞాన సాగరులేనా? డబల్ విదేశీయులు! డబల్ విదేశీయులూ జెండాలు ఊపుతున్నారు. మంచిది, చూడండి! దృశ్యం ఎంత బావుందో! జెండాలు బాగా పట్టుకున్నారు. జ్ఞాన సాగరులు అంటే మాయను దూరం నుండే పారద్రోలేవారు. అటువంటి వారేనా? ఎందుకంటే బాప్‌దాదా ఇంతకు ముందే చెప్పేశారు, ఖజానాలు జమ చేసుకునే బ్యాంక్ కేవలం ఈ సంగమయుగి సమయంలోనే ఉంటుంది. కల్పమంతటిలో మరెప్పుడూ ఇటువంటి బ్యాంక్ ఉండదు. ఇప్పుడు జమ చేసుకున్నదే అప్పుడు పనికి వస్తూ ఉంటుంది. జమ చేసుకునే బ్యాంక్ ఇప్పుడు సంగమయుగంలోనే తెరిచి ఉంటుంది. అందువలనే మీరు అందరికీ ఏమి చెప్తూ ఉంటారు, సందేశం ఇచ్చే సమయంలో ఇప్పుడు లేకున్నా మరెప్పుడూ లేదు అని అందరికీ చెప్తూంటారు కదా! అంటే ఇది మీ అందరికీ గుర్తు ఉండే ఉంటుంది కదా, ఇప్పుడు లేకున్నా మరెప్పుడూ లేదు అనేది అందరికీ గుర్తు ఉంటుందా? ఎందుకంటే సంగమయుగి జన్మ అన్నింటికంటే చిన్నది కానీ అమూల్యమైనది. ఈ జన్మ యొక్క విలువ కల్పమంతా ఉంటుంది. మా జమా ఖాతా ఎంత వరకు ఉంది? అని పరిశీలించుకుంటున్నారా? ఎంత కూడబెట్టుకున్నారో

Created by Universal Document Converter

అంత జమ అవుతుందా? ఎందుకంటే బాప్‌దాదా గతంలో కూడా చెప్పారు - ఇప్పుడు నడిచే సమయం సమాప్తి అయిపోయింది, ఇది ఎగిరే సమయం. పురుషార్థం యొక్క సమయం పూర్తి అయిపోయింది, ఇప్పుడు తీవ్రపురుషార్థం యొక్క సమయం. అది కూడా కొద్దిగానే ఉంది. అందువలనే బాప్‌దాదా డబల్ విదేశీయులకి డబల్ తీవ్రపురుషార్థి అనే బిరుదు ఇచ్చారు. చెప్పండి, డబల్ తీవ్ర పురుషార్థులేనా? చేతులెత్తండి! డబల్ తీవ్ర పురుషార్థులు, పాస్ అయిపోయారు. మంచిది. బాప్‌దాదా జన్మదిన శుభాకాంక్షలతో పాటు ఈ శుభాకాంక్షలను కూడా ఇస్తున్నారు. పదమా పద శుభాకాంక్షలు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. బాప్‌దాదా చూశారు - ఓ.కె. అని వ్రాసుకోమని బాబా హోమ్‌వర్క్ ఇచ్చారు. దానిపై చాలామంది పిల్లలు ధ్యాస పెట్టారు. కానీ 100 మార్కులు కొద్దిమందికే లభించాయి. 50 శాతం వారు ఎక్కువమంది ఉన్నారు. కానీ బాప్‌దాదా ఏమి కోరుకుంటున్నారంటే, చెప్పనా ఏమి కోరుకుంటున్నారో? ప్రతి ఆశాదీపంపై లేదా బాబా ఆశలను సంపన్నం చేసే మహావీర్ పిల్లలందరిపై బాబా యొక్క ఆశ ఏమిటంటే సమయానుసారం ఇప్పుడు చాలాకాలం నుండి తీవ్ర పురుషార్థం యొక్క జమ చేసుకోవాలి. సమయానుసారం ప్రతి సమయం బాప్‌దాదా మూడు మాటలను స్మృతి ఇప్పిస్తున్నారు- 1. అకస్మాత్తు 2. ఎవరెడీ 3.చాలాకాలం యొక్క జమ. ఇప్పుడిక మీ రాజ్యం వచ్చేసినట్లే. తండ్రి వచ్చేశారు అని సందేశం వినిపిస్తారు కదా అదేవిధంగా ఇప్పుడిక మీ దైవీరాజ్యం, సుఖ శాంతిమయ రాజ్యం రానే వచ్చింది అనే శుభవార్త వినిపిస్తారు కదా! అందరికీ ఈ సందేశాన్ని వినిపిస్తున్నప్పుడు మీ పురుషార్థం కూడా తీవ్రంగా, చాలాకాలంగా మరియు మీ రాజ్యంలో మొదటి జన్మ నుండి 21వ జన్మ వరకు పూర్తి రాజ్యభాగ్యానికి అధికారిగా అయ్యేవిధంగా ఉండాలి కదా! చాలాకాలం అనే లెక్కను స్మృతిలో ఉంచుకోండి ఎందుకంటే కొత్త ఇంట్లో మజా ఉంటుంది, రెండు, మూడు జన్మలు అయిపోయిన తర్వాత వస్తే, మూడు నాలుగు నెలలు అయిపోయిన తర్వాత ఇంట్లోకి వస్తే ఏమంటారు? కొత్త ఇల్లు అంటారా, మూడు నెలలు అయిపోయినవి అంటారా? అందువలన బాప్‌దాదా కోరుకునేది ఏమిటంటే బాప్‌దాదా యొక్క ఒకొక్క గారాభ బిడ్డ, బాప్‌దాదా యొక్క హృదయసింహాసనాధికారి బిడ్డ మొదటి జన్మలో బ్రహ్మాబాబాతో పాటు కలిసి రావాలి. ఇష్టమే కదా! ఇష్టమేనా? ఇష్టమేనా? మంచిది. అయితే ఏమి చేయవలసి ఉంటుంది? మీకు ఇష్టం, బాబాకి కూడా ఇష్టం సరే, కానీ దీనికోసం ఏమి చేయవలసి ఉంటుంది? ఇప్పటి వరకు జరిగిపోయిందేదో జరిగిపోయింది, బాప్‌దాదా క్షమిస్తారు, కానీ ఇప్పటి నుండి బాప్‌దాదాకి ఏ జన్మదిన కానుక ఇస్తారు? బాబాకి ఏదొక బహుమతి ఇస్తారు కదా! బాబా జన్మదినోత్సవాన్ని జరుపుకునేటందుకు వచ్చారు, అయితే బాబాకి ఏమి బహుమతి ఇస్తారు? బాబాకి ప్రతి బిడ్డపై ఆశ ఉంటుంది, చివర వచ్చినా కానీ వేగంగా వెళ్ళగలరు. మొదటిసారిగా వచ్చినవారు చేతులెత్తండి. మంచిది.

చివరగా వచ్చిన పిల్లలందరికీ మొదటిసారి వచ్చినందుకు బాప్‌దాదా పదమాపద శుభాకాంక్షలు ఇస్తున్నారు. కానీ ఒక భాగ్యం గురించి కూడా చెప్తున్నాను, ఇప్పటికీ భాగ్యం తయారుచేసుకునే అవకాశం ఉంది, బాగా ఆలశ్యమైపోయింది అనే బోర్డ్ ఇంకా పెట్టలేదు. ఒకవేళ ఎవరైనా చివర అంటే ఇప్పుడు వచ్చినా కానీ వేగంగా వెళ్ళి మొదటి తరగతిలోకి వెళ్ళవచ్చు. మొదటి నెంబరుగా కాలేరు, ఆ నెంబరు ఎవరో ప్రకటించబడిపోయింది కానీ మొదటి తరగతిలోకి రాగలరు. ఇష్టమేనా? కొత్తగావచ్చిన పిల్లలకు ఇష్టమేనా? అవకాశం ఉంది, బాప్‌దాదా సీట్ ఇస్తారు కానీ కొంచెం

Created by Universal Document Converter

చేయవలసి కూడా ఉంటుంది కదా! ఒకొక్క శ్వాస, ఒకొక్క సంకల్పంపై ధ్యాస పెట్టండి, ప్రతి శ్వాస, ప్రతి సంకల్పం సమర్ధంగా ఉండాలి. వ్యర్థం కాకూడదు ఎందుకంటే మీ అందరి యొక్క అంటే ముందు వచ్చిన వారిది అయినా, వెనుక వచ్చిన వారిది అయినా అందరి టైటిల్ ఏమిటి? సమర్ధ పిల్లలు, బలహీన పిల్లలు కాదు. బాప్‌దాదా ఎవరికి ప్రియస్మృతులు ఇస్తారు? గారాభమైన, ప్రియమైన, హృదయసింహాసనాధికారి పిల్లలకు రోజూ ప్రియస్మృతులు ఇస్తారు. అందువలన బాబా ఈ స్వర్ణిమ అవకాశాన్ని ఇస్తున్నారు కానీ తీసుకునేవారు తీస్కోవాలి. బాబా ఇస్తారు, బాబా ఇవ్వడానికి కట్టుబడి ఉన్నారు. అయితే తీవ్రపురుషార్థులు ఎవరైనా ఉన్నారా? అవకాశం ఉంది. బాగా ఆలశ్యం అనే బోర్డ్ పెట్టేస్తే ఇది కూడా సమాప్తం. బాప్‌దాదాకి జన్మదిన కానుక ఏది ఇస్తారు? జన్మదినోత్సవాన్ని జరుపుకునేటందుకు వచ్చారు కదా! బాప్‌దాదా అయితే పిల్లలైన మీ జన్మదినోత్సవ సందర్భంగా మీ అందరికీ ఇచ్చిన బహుమతి ఏమిటంటే ఆది నుండి అంతిమం వరకు మీ తీవ్రపురుషార్థం 90 శాతం ఉంటే మిగిలిన 10 శాతం బాప్‌దాదా పెంచుతారు. సరేనా! ఇప్పుడు వ్యర్థం సమాప్తి అయిపోవాలి.

సత్యయుగి దేవాత్మలు వస్తూ ఉంటారు కదా, అప్పుడు వారికి ఇక్కడి వారి భాష ఏమిటో తెలియనే తెలియదు. పురుషార్థం అని మీరు అన్నారనుకోండి వారికి పురుషార్థం అంటే ఏమిటో తెలియదు ఎందుకంటే వారు ప్రాలబ్ధాన్ని అనుభవించేవారు. అదేవిధంగా తీవ్రపురుషార్థులు అయిన మీ కలలో లేదా సంకల్పంలో లేదా ప్రత్యక్ష కర్మలో వ్యర్థం అంటే ఏమిటో తెలియకూడదు, అంతగా సమాప్తి అయిపోవాలి. అంత ధైర్యం ఉందా? 10 శాతం బాబా అదనంగా కలుపుతారు. అంగీకారమేనా? చేతులెత్తండి. ఎంత శాతం పక్కాగా ఉండాలి? 100 శాతం కాదు, 101 శాతం ఎందుకంటే పిల్లలు లేకుండా, పిల్లల తోడు లేకుండా బాప్‌దాదా ఇష్టమనిపించదు. మీరు - నా బాబా అన్నారు, బాబా - నా పిల్లలు అని అన్నారు, కనుక బాబా సమానంగా అవ్వవలసిందే. ఇప్పుడు ధృడసంకల్పం అవసరం. మీరు పుస్తకాలు ముద్రించారు కదా! సఫలతకి తాళంచెవి - ధృడ సంకల్పం. సంకల్పాన్ని సాధారణం చేసుకోకండి. మీరు ఎవరు? ప్రెసిడెంట్ అయిన వారు సాధారణ నడవడిక నడిస్తే బావుంటుందా? మరి మీరెవరు? మీరు మూడు సింహాసనాలకు అధికారులు. అన్నింటికంటే గొప్ప సింహాసనం - బాప్‌దాదా యొక్క హృదయ సింహాసనం. హృదయ సింహాసనాధికారులు మొదటి జన్మలో తోడుగా అవుతారు. సింహాసనంపై అయితే ఒక్కరే కూర్చుంటారు కానీ రాయల్ ఫ్యామిలీలో రాజ్యాధికారులుగా అయితే అవుతారు కదా! ఇలా తోడుగా ఉండే వారు. ఇంటి వరకు అయితే కలిసే వెళ్తారు. బాప్‌దాదా ఎలాగైనా తీసుకునే వెళ్తారు. వయా తీసుకువెళ్ళినా లేదా డైరెక్ట్‌గా తీసుకువెళ్ళినా కానీ తీసుకునే వెళ్తారు. ఆ తర్వాత ఇంట్లోనే ఉండిపోతారా, బ్రహ్మాబాబా వెళ్ళిపోతారు మీరు ఇంట్లోనే ఉండిపోతారా, అలా ఉంటే బావుంటుందా? రాజయోగులు కదా? స్వయానికి ఏ టైటిల్ ఇచ్చుకుంటారు లేదా ఇతరులకు కూడా ఏమి నేర్పిస్తారు? రాజయోగమా లేక ప్రజాయోగమా? రాయల్ ప్రజలు అయినా కానీ ప్రజాయోగం కాదు కదా! రాజయోగులు. పిల్లలైన మీకు బాబా ఇచ్చిన బహుమతి అందరికీ గుర్తు ఉంటుందా? ఎంత వరకు? అంతిమం వరకు. బాప్‌దాదా చూశారు - పురుషార్థం అయితే చాలా చేస్తున్నారు, పిల్లలు బాగా శ్రమ చేయటం చూసి బాబాకి ఇష్టమనిపించటం లేదు. అందువలన ప్రేమలో ఉండండి అప్పుడు శ్రమ సమాప్తం అయిపోతుంది. నా బాబా అంటే ఇక మిగిలిన సావి

Created by Universal Document Converter

అన్నీ సమాప్తం. నా బాబా అన్నారంటే మిగిలిన నావి అనేవి అన్నీ సమాప్తం అయిపోయాయి కదా! ఒకదానిలో ఒకటి, ఒకదానిలో ఒకటి పెట్టేసే బొమ్మలు ఉంటాయి కదా, ఒకదానిలోనే 10 లేదా 12 బొమ్మలు పట్టేస్తాయి. అదేవిధంగా మీరందరు నా బాబా అనేవారే కదా, నా బాబా కదా! మహారథీల బాబా కాదు, నా బాబా. ఇలా నా బాబా అన్నారంటే హద్దులోని నావి అనేవి అన్నీ నీదిలో కలిపేయండి. నాది అనడానికి బదులు నీది అనండి. రెండింటికీ ఎంత తేడా ఉంది! నా మరియు నీ. ఒక అక్షరం తేడా. నా బాబా అనేది పక్కా కదా? పక్కా, అయితే ఎంత శాతం? 100 శాతమా? లేక 101 శాతమా? ఒక వ్రేలుని పైకి చూపండి. 101 శాతం అనేవారు వ్రేలు చూపండి. బాప్‌దాదా చూస్తున్నారు మరియు టీ.వి.లో కూడా చూస్తున్నారు.

ఇప్పుడు శివరాత్రి లేదా శివజయంతిని జరుపుకునేటప్పుడు విశేషంగా మూడు విషయాలు ఆచరిస్తారు. అద్భుతం, ఈ విధులతో ఉత్సవాన్ని జరుపుకునేవారు ఏవిధంగా కాపీ చేశారో అని బాప్‌దాదా వారికి కూడా శుభాకాంక్షలు ఇస్తున్నారు. విశేషంగా మూడు విషయాలు ఆచరిస్తారు 1. వ్రతం పాటిస్తారు. మిమ్మల్నే కాపీ చేశారు కానీ అల్పకాలికంగా. బాబా వారిగా అయిన తర్వాత మీరందరు కూడా రెండు వ్రతాలు తీసుకున్నారు. ఒకటి - పవిత్రత, అంటే కేవలం బ్రహ్మచర్యమే కాదు, బ్రహ్మాచారి కూడా. కొంతమంది పిల్లలు ఏం చేస్తున్నారంటే ముఖ్యమైన పెద్ద పెద్ద వికారాల గురించి వ్రతం పెట్టుకుంటున్నారు కానీ చిన్న చిన్నవాటిని వదిలేస్తున్నారు. కానీ చిన్న వాటిని కూడా మహాబలి చేయాలి. చిన్నవి కూడా తక్కువ కాదు. సమయానికి మోసం చేసేవి చిన్నవే. ఎలుక చిన్నదిగానే ఉంటుంది, కానీ కరవటంలో నెంబర్‌వన్. నోటితో ఊదుతుంది ఆ తర్వాత కరుస్తుంది, అసలు కరిచినట్లే తెలియదు. అదేవిధంగా చిన్న చిన్న వికారాలు, అంటే కొంతమంది పిల్లలు క్రోధం గురించి అనుకుంటున్నారు - ఇది ఉంటూనే ఉంటుంది, కోప్పడవలిసే ఉంటుంది. అటువంటి వారిని సంపూర్ణ ఆత్మ అని అంటారా? అంశ వంశ సహితంగా, చిన్న పెద్ద వాటి గురించి వ్రతాన్ని తీసుకున్నారు. మేము సదా పవిత్రంగా ఉంటాం అని ప్రతిజ్ఞ చేశారు కదా? లేక కేవలం బ్రహ్మచర్యవ్రతం గురించే చేశారా? మీ టైటిల్ ఏమిటి? సంపూర్ణ నిర్వికారి, మర్యాదా పురుషోత్తములు ఇవే మీ టైటిల్స్ కదా? లేక కొన్ని కొన్ని మర్యాదలు తక్కువ ఉంటాయా? నా బాబా అని మీరందరు అన్నారు, అందరూ చేతులెత్తారు, మరి నా బాబా అన్నప్పుడు బాబా సమానంగా అవ్వాలి కదా! కేవలం ఒక అక్షరాన్ని మార్చండి, నాది అనేది వచ్చినప్పుడు నీది అనేది గుర్తు ఉంచుకోండి. ఒక అక్షరం యొక్క తేడాను గుర్తు ఉంచుకోవటం ద్వారా మూడు సింహాసనాలకు అధికారి అవుతారు. సదా పవిత్రత మరియు మర్యాదా పురుషోత్తములుగా అయ్యే వ్రతాన్ని సదాకాలికంగా ధారణ చేశారు, వారు ఒకరోజే వ్రతం చేస్తారు, మిమ్మల్ని అనుసరించారు కానీ పిండిలో ఉప్పు వలె కొంచెంగానే అనుసరించారు. అయినా కానీ అనుసరించారు కదా! బుద్ధిమంతులు కదా! మరోవ్రతం ఏమిటంటే ఆహార పానీయాల వ్రతం. మీరందరు కూడా శుద్ధ భోజనం గురించి వ్రతం తీసుకున్నారు కదా. దీనిని కూడా వారు అనుసరించారు కదా! మీరు కూడా ఈ వ్రతాన్ని పూర్తిగా తీసుకున్నారా లేక అలసిపోయినప్పుడు ఏదైనా తినేద్దాం అనుకుంటున్నారా? అలా లేరు కదా? అలసిపోయినా, విసిగిపోయినా కానీ వ్రతాన్ని వదలకూడదు. యువకులు ఏమి చేస్తున్నారు? కుమారులు ఎవరైతే ఉన్నారో వారు చేతులెత్తండి. కుమారులు, మంచిది, చాలా మంచిది. కుమారీలు చేతులెత్తండి. విదేశీయులలో కుమారీలు లైట్ పెట్టుకుని

Created by Universal Document Converter

ఉన్నారు. (తలపై చిన్న బల్బ్‌ని పెట్టుకున్నారు) కుమారులు వ్రతాన్ని పూర్తిగా పాటిస్తున్నారా లేక కొద్దిగా అలసిపోతున్నారా? రావటం దగ్గర నుండి ఇప్పటి వరకు విధిపూర్వకంగా ఆహారపానీయాల వ్రతం పాటిస్తున్న కుమారులు చేతులెత్తండి. పాస్ అయిపోయారు, మంచిది, శుభాకాంక్షలు. మీకు పదమాపద శుభాకాంక్షలు. కొంచెం కష్టంగా అనిపిస్తుంది కానీ బాబా ప్రేమలో అది శ్రమ కాదు, ప్రేమ. మరయితే చూడండి, భక్తులు ఈ విషయాన్ని కూడా అనుసరించారు కదా! ఒకరోజు కోసం వ్రతం పెట్టుకుంటారు. మీరు జీవితాంతం వ్రతం తీసుకున్నారు. జీవితాంతం ఈ వ్రతంలో స్వతహాగానే నడుస్తూ ఉంటారు. ఇక శ్రమ చేయవలసిన పని ఉండదు. ఈ ఒక్క చిన్న జన్మలో తప్పకుండా శ్రమ ఉంది, త్యాగం ఉంది కానీ ఆ త్యాగానికి భాగ్యం తయారవుతుంది. ఇంకా ఏమి చేస్తారు? జాగరణ చేస్తారు. మీరు ఏ జాగరణ చేశారు? వారు నిద్రను త్యాగం చేస్తారు, మీరు మీ అజ్ఞాని నిద్రను త్యాగం చేశారు. అజ్ఞాన నిద్రను, అనువుగాని సమయంలో నిద్రను రానివ్వరు. కుటికిపాట్లు పడరు కదా! ఈ వ్రతం కూడా తీసుకున్నారు కదా! కునికిపాట్లు పడటం కొందరికి అలవాటుగా ఉంటుంది. బాప్‌దాదా అంటున్నారు - త్యాగం చేశారు, ధృఢ సంకల్పం చేశారు మరలా ధృఢ సంకల్పాన్ని బలహీనంగా ఎందుకు చేసుకుంటున్నారు? స్క్రూని బిగించటం రావటం లేదా? దీనిని బిగించే స్క్రూ డ్రైవర్ - ప్రతిజ్ఞ. ఇప్పుడు ఒక కార్యం మిగిలి ఉంది, ఏది మిగిలిఉందో చెప్పండి. చెప్పండి. ప్రత్యక్షతా కార్యం మిగిలి ఉంది. దీని కోసమే పురుషార్థం చేస్తున్నారు కదా? నా తండ్రి వచ్చేశారు. ఈ జెండాను ఎందుకు ఎగురవేస్తారు? ఏ కార్యం చేస్తున్నా జెండాను ఎగురవేస్తారు కదా? ఈరోజు కూడా జెండా ఎగురవేస్తారు కదా! ఎవరి జెండా ఎగురవేస్తారు? బాప్‌దాదా యొక్క, సేవ యొక్క, జన్మదినోత్సవం యొక్క జెండా ఎగురవేస్తారు. జెండా ఎగురవేసేటప్పుడు పూర్తిగా అది తెరుచుకోనంత వరకు కొంచెం కొంచెంగా తెరుచుకుంటూ ఉంటుంది. పువ్వులు కురిసే వరకు జెండా ఎగురవేయటం పూర్తి కాదు. అదేవిధంగా మీరు కూడా ఏ ప్రత్యక్షతను కోరుకుంటున్నారు? బాబా యొక్క ప్రత్యక్షత జరగాలి. అయితే ఎంతగా జాగరణ, వ్రతం, ప్రతిజ్ఞ చేస్తారో అంత త్వరత్వరగా ప్రత్యక్షత జరుగుతుంది. బాబా ప్రత్యక్షత జరగాలని కోరుకుంటున్నారు కదా! మరయితే సమయాన్ని సమీపంగా తీసుకువచ్చేవారు ఎవరు? మీరందరూ కదా! సమయాన్ని సమీపంగా తీసుకువచ్చే సత్యమైన సేవాధారి పిల్లలు మీరు. విశ్వపరివర్తకులైన పిల్లలు. అయితే జన్మదిన కానుక అంగీకారమేనా? కానుక ఇవ్వటం మరియు తీసుకోవటం, రెండింటి గురించి చెప్పాను. రెండూ చేసేవారు చేతులెత్తండి. రెండూ చేస్తారా? మంచిది, చాలా మంచిది, మంచిది. మీ ఈ చిత్రం టి.వి.లో వస్తుంది, మరలా ఎవరైనా ఫెయిల్ అయిపోతే ఈ చిత్రాన్ని పంపిస్తారు. మరలా చేతులెత్తండి. టి.వి.లో వస్తుంది. మంచిది, మంచిది, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. బాప్‌దాదా దగ్గరకి నలువైపుల నుండి కోటానుకోట్ల శుభాకాంక్షలు చేరుకున్నాయి. ప్రతి ఒక్కరు మనస్సుతో చెప్తున్నారు లేదా ఉత్తరంలో వ్రాస్తున్నారు లేదా ఈ-మెయిల్ పంపిస్తున్నారు. మా శుభాకాంక్షలు అందరికంటే ముందు చేరాలి అని అనుకుంటున్నారు. అయితే బాప్‌దాదా చెప్తున్నారు అందరి శుభాకాంక్షలు ముందుగానే స్వీకరించాను. దీనిలో నెంబర్ లేదు, అందరి మనస్సుల యొక్క శుభాకాంక్షలను ఒక్కసారిగానే స్వీకరించాను. దూరంగా ఉండి చూసేవారు కూడా చప్పట్లు కొడుతున్నారు మరియు నలువైపుల అందరి మనస్సుల్లో శుభాకాంక్షలు, శుభాకాంక్షలు అనే పాట వస్తుంది. ఇది పాట కాదు, మనస్సుతో

Created by Universal Document Converter

పాడే పాట. ఏ శ్రమ లేకుండానే సంతోషంతో ఈ పాట మొదలైపోతుంది. మనస్సుతో పాడే పాటకు సంతోషం తాళంచెవి. ఓహో బాబా! మధురమైన బాబా! అంటారు, ఇదే తాళంచెవి. తాళంచెవి ఉంది కదా? అప్పుడప్పుడు ఉండే తాళంచెవి కాదు. సదా సంతోషం. బాప్‌దాదాకి ఏ బిడ్డ యొక్క ముఖం అయినా, మాట అయినా, కర్మ అయినా కొంచెమైనా చింతన చేస్తున్నట్లు, చింత కలిగినట్లు, వ్యర్థ సంకల్పాలతో లేదా సంశయంతో ఉన్న ముఖాన్ని చూసినప్పుడు బాబాకి ఇష్టమనిపించటం లేదు. భగవంతుని పిల్లలు సదా సంతోషంగా ఉండకపోతే ఇంకెవరు ఉంటారు! మీరే ఉంటారు కదా! కనుక ముఖం ఎప్పుడూ చింతగా ఉండకూడదు, శుభచింతన ఉండాలి. ఎప్పుడైనా ఏ రకమైన చింత వస్తే – బాబా నాతోడుగా ఉన్నారు అని భావించి చింతని బాబాకి ఇచ్చేయండి, మీరు శుభ చింతకులు అయిపోండి. ఎందుకంటే బాప్‌దాదా సదా హర్షితంగా ఉంటారు కానీ పిల్లలు వాడిపోయి ఉంటే బావుంటుందా? మీరు ఎవరి పిల్లలు? భగవంతుని పిల్లలు. కనుక పర్వతంలాంటి పరిస్థితి వచ్చినా కానీ ముఖం వాడిపోకూడదు, ఆ పర్వతాన్ని కూడా మీరు దూది వలె చేసుకోవచ్చు. బాబాతో పాటు మిమ్మల్ని కలుపుకోండి అప్పుడు ఏమైపోతుంది? పర్వతం దూదిగా అయిపోతుంది; ఎందుకంటే సర్వశక్తివంతుడిని తోడుగా పెట్టుకున్నారు. మీరు బలహీనంగా ఉన్నా కానీ సర్వశక్తివంతుడు మీ తోడుగా ఉన్నారు కనుక ఆయనను సమయానుసారం ఉపయోగించుకోండి. కేవలం చెప్పటం వరకు కాదు, పనిలో ఉపయోగించు కోండి. అప్పుడు ముఖం సదా సంతోషవంతంగా మరియు మనస్సు సదా అదృష్టవంతంగా ఉంటుంది. అదృష్టవంతమైన, సంతోష వంతమైన ముఖాలను చూడాలనుకుంటే భగవంతుని సేవాకేంద్రాలకు వెళ్ళి చూడండి అని బాబాని చాలెంజ్ చేయమంటారా? చేయమంటారా శపథం? ఎప్పుడూ వాడిపోకూడదు. ఎందుకు వాడిపోవాలి! ఏదైనా లోటుగా ఉంటే వాడిపోవాలి. మీకు ఏమి లోటు? ఆరోగ్యం, ధనం ఏదైనా లోటుగా ఉందా మీకు! సంతోషం అనే ఆహారం మీకు లభించింది కదా! సంతోషం గురించి ఏమి చెప్తారు? సంతోషం వంటి ఖజానా మరొకటి లేదు. అంటే సంతోషమే సంపద అయ్యింది కదా! అయితే మీ దగ్గర సంపద ఉందా? అంటే సంతోషం ఉందా? చేతులెత్తండి! సంతోషం ఉంది కదా! అంటే సంపద ఉన్నట్లే. అదేవిధంగా సంతోషానికి మించిన భోజనం ఏదీ లేదు; 36 రకాల పదార్థాల భోజనం ఉన్నా కానీ సంతోషం లేకపోతే అది నిస్సారం. సంతోషం ఉంటే ఎండిన రొట్టెలు కూడా 36 రకాల పదార్థాలంత సుఖాన్నిస్తుంది. మరియు బాబా యొక్క ప్రతిజ్ఞ ఏమిటంటే హృదయం సత్యంగా, స్వచ్ఛంగా మరియు విశాలంగా ఉండాలి.

మూడు విషయాలను గుర్తు పెట్టుకోండి సత్యమైన మనస్సు, స్వచ్ఛమైన మనస్సు, విశాలమైన మనస్సు ఈ మూడు విషయాలు జ్ఞాపకం ఉంచుకుంటే ఏ సమయంలోనైనా, ప్రపంచ పరిస్థితులు ఏవిధంగా ఉన్నా కానీ మీ అందరికీ పప్పు-రొట్టె బాబా పెడతారు. రెండు, నాలుగు కూరలు పెట్టరు, పప్పు-రొట్టె పెడతారు. ఆ పప్పు రొట్టె తినండి, భగవంతుని పాటలు పాడుకోండి. అనుభవం చేసుకున్నారు కదా! మొట్టమొదట్లో వచ్చిన పాతవారు దీనిని అనుభవం చేసుకున్నారు. ఎప్పుడైనా మీరు ఆకలిగా ఉన్నారా? బెల్లాన్నే బోర్నవిటాగా తయారుచేసి బాప్‌దాదా తన చేతులతో ఇచ్చేవారు. బాప్‌దాదా చేతితో రొట్టెలు తినగానే అందరి పొట్ట నిండిపోయేది. ఈ బోర్నవిటా చేయటం వచ్చా, రాదా? ఎటువంటి పరిస్థితిలోనైనా, కూరగాయలు, పప్పు ఏదీ లేకపోయినా

Created by Universal Document Converter

కానీ బోర్నవిటా (బెల్లం) చాలా సుఖానిస్తుంది. దీనిని తయారుచేయటం నేర్చుకుని వెళ్ళండి. అందరూ ఇక్కడి నుండి నేర్చుకుని వెళ్ళండి. అవసర సమయంలో ఈ బోర్నవిటా చాలా పనికొస్తుంది. కానీ నాలుగు విషయాలు గుర్తు ఉంచు కోవాలి. దీనిలో ఒక్క విషయం తక్కువ అయినా కానీ వెతకవలసి ఉంటుంది, సహజంగా దొరకదు. కనుక పరిశీలించుకోండి - తనువు, మనస్సు, ధనం, సంబంధ సంపర్కాలలో సత్యంగా, విశాలంగా ఉండాలి. మనస్సు విశాలంగా ఉంటే ఏ కోరిక అయినా లేదా అవసరం అయినా తీరిపోతుంది. చేసి చూడండి. ఎక్కడ హృదయం విశాలంగా ఉంటుందో అక్కడ కోరికలన్నీ పూర్తి అయిపోతాయి. మనస్సుని చిన్నగా చేసుకుంటే రచన అంతా చిన్నది అయిపో తుంది. బాబాయే రాజీ అయిపోతే ఇక లోటు ఏముంటుంది! కనుక పురుషార్థం చేయండి ఆ తర్వాత శుభాకాంక్షల చప్పట్లు కొట్టండి.

నలువైపుల ఉన్న బాప్‌దాదా యొక్క హృదయ సింహాసనాధికారులకి, నలువైపుల ఉన్న తీవ్ర పురుషార్థి పిల్లలకు, బాప్‌దాదా ఇచ్చిన బహుమతిని స్వీకరించే నలువైపుల ఉన్న పిల్లలకు మరియు బాబాని బహుమతి ఇవ్వాలని ఏదైతే సంకల్పం చేశారో ఆ సంకల్పాన్ని సదా దృఢంగా చేసుకునే దృఢ పురుషార్థిలకు, ప్రతిజ్ఞ చేసి బాబాని ప్రత్యక్షం చేసే పిల్లలందరికీ, బాప్‌దాదా యొక్క చాలా చాలా మనస్పూర్వక పాలన మరియు మనస్పూర్వక ప్రియస్మృతులను స్వీకరించండి మరియు పిల్లలందరికీ చాలా చాలా శుభాకాంక్షలు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు.

## హోలీ యొక్క విశేష బహుమతి - రోజూ మధ్యమధ్యలో ఫరిస్తా దుస్తులను ధరించటం మరియు పాత సంస్కారాలను కాల్చటం .....9-3-09

ఈరోజు పవిత్ర తండ్రి తన యొక్క పవిత్ర పిల్లలతో హోలీ జరుపుకునే టందుకు వచ్చారు. పిల్లలందరూ పవిత్రమైన పిల్లలు. మీరందరు కూడా హోలీ జరుపుకునేటందుకు వచ్చారు. పవిత్ర ఆత్మలైన మీపై ఏ రంగు అంటిందో; దాని ద్వారా మీరు పవిత్రంగా అయ్యారో ఆలోచించండి! రంగులు అయితే అనేకం కానీ మీకు ఏ రంగు అంటినది? అన్నింటికంటే శ్రేష్ఠమైన రంగు ఏది; దాని ద్వారానే మీరు పవిత్రంగా అయ్యారు? అన్నింటికంటే గొప్ప రంగు పరమాత్మ సాంగత్యం యొక్క రంగు. పరమాత్మ సాంగత్యం అనే రంగుని అంటించుకోవటం ద్వారా సహజంగా పవిత్రంగా అయిపోయారు ఎందుకంటే పరమాత్మ సాంగత్యం అవినాశి సాంగత్యం యొక్క రంగు. ఇతర రంగులు అయితే కొద్దిసమయమే అంటి ఉంటాయి కానీ పరమాత్మ సాంగత్యం అనే రంగు అంటడం ద్వారా సహజంగానే పవిత్రం అయిపోయారు. ఆత్మ యొక్క రంగు అపవిత్రత నుండి పవిత్రం అయిపోయింది ఎందుకంటే మీరందరు పరమాత్మను మీ తోడుగా చేసేసుకున్నారు, పరమాత్మ సాంగత్యం చేశారు కనుక ఇద్దరూ కలిసిపోయారు. ఇలా కలిసిఉన్న రూపం చాలా ప్రియంగా ఉంటుంది. ఈ కంబైండ్ రూపం ఎప్పుడూ వేరు అవ్వలేదు. అనుభవం ఉంది కదా! సదా బాబాతో కలిసే ఉంటున్నారు కదా, ఒంటరిగా లేరు కదా!ఒంటరిగా చేయడానికి మాయ ప్రయత్నిస్తుంది కానీ సదా కలిసి ఉండేవారు ఎప్పుడూ కూడా వేరు అవ్వరు. మాయ ఇద్దరినీ

Created by Universal Document Converter

వేరు చేసేసి పాత సంస్కారాలను తీసుకువస్తుంది, అలా పాత సంస్కారాలు బయటకి వస్తే శుద్ధ సంస్కారాలు గుప్తం అయిపోతాయి. పాత సంస్కారాలు అంటే సోమరితనం మరియు నిర్లక్ష్యం; ఇవి రకరకాల రూపాలలో రావటం వలన కంబైండ్ రూపం నుండి వేరు అయిపోతున్నారు. ప్రతి ఒక్కరు పరిశీలించుకోండి-సదా కంబైండ్‌గా ఉంటున్నారా? లేక అప్పుడప్పుడు ఒంటరిగా అయిపోతున్నారా? మాయ యొక్క అనేక స్వరూపాలు మీకు తెలిసిపోయినవి కదా! మాయ తెలివిగా తన రంగుని అంటిస్తుంది. బాబాతో వేరవ్వటం అంటే మాయా రంగుని అంటించుకోవటం. సోమరితనం మరియు నిర్లక్ష్యం చాలా రకరకాల రూపాలలో వస్తాయి ; ఈవిధంగా మాయ తన వైపుకి ఆకర్షించుకుంటుంది. సోమరితనం మరియు నిర్లక్ష్యం అనేవి రావణుని ఖజానాలు, బాబా ఖజానాలు కావు. నేను చేయాలనుకోవటం లేదు కానీ ఇది నా సంస్కారం అని రావణుని ఖజానాను చాలా నషాగా చెప్తున్నారు. నా సంస్కారం అని అంటున్నారు. ఇవి పరమాత్మ ఖజానాలా? లేక రావణుని ఖజానాలా? వాటిని నా సంస్కారం అనటం సరైనదా? వాటిని మీవిగా చేయటం మాయ యొక్క తెలివి. బాబా ఖజానాలు ప్రియమా లేక రావణుని ఖజానాలు ప్రియమా? నేను చేయాలనుకోవటం లేదు కానీ ఇది నా సంస్కారం అని చాలా సాధారణ పద్ధతిలో స్వయం తప్పించుకునేటందుకు పిల్లలు ఇది నా సంస్కారం అని అనేస్తున్నారు. కానీ నిజంగా అవి మీవేనా ఆలోచించండి! బాబా చెప్తున్నారు - రావణుని ఖజానాను మీదిగా చేసుకోవటం ద్వారా మీలో ఉన్న శుద్ధ సంస్కారాలు నెమ్మదినెమ్మదిగా సమాప్తం అయిపోతాయి. పరమాత్మ సాంగత్యం యొక్క రంగు వెలసిపోతుంది, మాయా రంగు ప్రత్యక్షమైపోతుంది. కనుక నడుస్తూ నడుస్తూ ఏ రంగు అంటి ఉంది అని స్వయాన్ని పరిశీలించుకోవాలి. హోలీ రోజున ప్రజలు కూడా ఏమి చేస్తారు? మొదట చెడుని కాలుస్తారు తర్వాత రంగులు చల్లుకుంటారు, పండుగ జరుపుకుంటారు. అదేవిధంగా బాప్‌దాదా మీపై తన సాంగత్యం అనే రంగుని చల్లారు. దాంతో పాటు జ్ఞానం అనే రంగుని, శక్తులు అనే రంగుని, గుణాల రంగుని కూడా చల్లుతూనే ఉన్నారు.

అందరిపై ఈ ఆత్మిక రంగు అంటి ఉంది కదా! అంటినదా? చేతులెత్తండి. ఆత్మిక రంగు అంటినది, వెలసిపోయేది కాదు కదా! ఎవరిపైనైతే ఆత్మిక రంగు అవినాశిగా అంటి ఉన్నదో వారిపై మరే ఇతర రంగు అంటదు. ఈ రంగు ద్వారా ఎంత పవిత్రంగా అయిపోయారు? కల్పమంతటిలో మీ వంటి పవిత్రులుగా ఎవరూ కాలేరు. మీ పవిత్రత, పరమాత్మ సాంగత్యం యొక్క రంగు, పరమాత్మతో కంబైండ్‌గా ఉండే అనుభవం అన్నింటికంటే అతీతమైనది మరియు ప్రియమైనది. ఇతరులు ఎవరైతే పవిత్రంగా అవుతారో వారు శరీరంతో పవిత్రంగా అవ్వరు, ఆత్మ మాత్రమే పవిత్రంగా అవుతుంది కానీ మీ శరీరం మరియు ఆత్మ రెండూ పవిత్రంగా అవుతాయి. పవిత్రతను సుఖం, శాంతి, ప్రేమ, ఆనందాలకు జనని (తల్లి) అని అంటారు. ఎక్కడ పవిత్రత ఉంటుందో అక్కడ సుఖం, శాంతి వెనువెంట ఉంటాయి; ఎందుకంటే తల్లి ఎక్కడ ఉంటుందో పిల్లలు కూడా అక్కడే ఉంటారు కదా! బాబా వచ్చి మిమ్మల్ని ఎంత పవిత్రులుగా చేస్తారంటే కలియుగం యొక్క అంతిమ జన్మలో కూడా మీ జడచిత్రాలను చూడండి - వాటిని ఎంత విధిపూర్వకంగా పూజిస్తారో కదా! ఇది పవిత్రత యొక్క విశేషత. ఇక ఇతర మహాత్ములు లేదా ధర్మాత్ములు ఎంతమంది పవిత్రంగా అయినా కానీ ఎవరికీ మందిరాలు తయారవ్వవు మరియు ఇటువంటి విధిపూర్వక పూజ కూడా ఎవరికీ జరగదు. మీ జడచిత్రాలు అయితే అంతిమ జన్మ

Created by Universal Document Converter

వరకు ఆశీర్వాదాలను ఇస్తూ ఉంటాయి మరియు వాటి సమక్షంలో అల్పకాలిక సుఖ, శాంతులను అనుభవం చేసుకుంటారు. అయితే మీ హోలీ మరియు ప్రాపంచిక హోలీకి ఎంత తేడాయో చూడండి. మనస్సుని ఉల్లాసంగా ఉంచుకునేటందుకు మీరు కూడా కొంచెం స్థూలంగా హోలీని జరుపుకుంటారు కానీ సత్యమైన హోలీ అంటే పరమాత్మ సాంగత్యం యొక్క రంగుని అంటించుకోవటం మరియు కంబైండ్ స్వరూపం యొక్క యదార్థమైన హోలీని మీరు జరుపుకుంటున్నారు. ప్రజలు కూడా హోలీని రకరకాలుగా జరుపుకుంటారు. కానీ వాస్తవానికి మీకు తెలుసు – హోలీ అనే మాటకు కూడా రహస్యం ఉంది, అది మీకే తెలుసు. కనుక మీరే ఆవిధంగా జరుపుకుంటారు. హోలీ అంటే హో... లీ... అంటే జరిగిపోయిందేదో జరిగిపోయింది అని అర్థం. మీరందరు కూడా పాత జీవితం, పాత విషయాలు, పాత సంస్కారాలు, పాత వ్యర్థ సంకల్పాలు వీటన్నింటినీ హోలీ చేసేశారు కదా! అంటే జరిగిపోయినవి. అలా చేశారు కదా? లేక ఇప్పటికీ పొరపాటుగా పాత సంస్కారాలు వచ్చేస్తున్నాయా? మీ జన్మయే క్రొత్తది, మీరందరు మరజీవ అయిపోయారు కదా! అయిపోయారా? మరజీవ అయ్యారా? చేతులెత్తండి. మంచిది. కొత్తజన్మ తీసుకున్నారు. అయితే పాత జన్మ ఎలా గుర్తు వస్తుంది? పాతది పాతబడిపోయింది కదా? జరిగిపోయిన విషయాలు లేదా సంకల్పాలు, సంస్కారాలు ప్రత్యక్షమవుతున్నాయంటే ఏమంటారు? హోలీ జరుపుకున్నట్లా? వాటిని హో...లీ... చేశారా? అంటే పరమాత్మ సాంగత్యమనే రంగు సరిగ్గా అంటలేదు. పరమాత్మ సాంగత్యమనే రంగు అంటడం అంటే పాత జన్మను మర్చిపోవటం. పాత విషయాలను మర్చిపోవటం. ఎందుకంటే మరజీవ అయిపోయారు కదా! శరీరంతో ఒక జన్మ నుండి మరో జన్మ తీసుకున్నప్పుడు పాత జన్మ గుర్తుంటుందా? అదేవిధంగా మీరందరు బ్రాహ్మణ జన్మ తీసుకున్నవారు. అయితే పాత జన్మ యొక్క సంస్కారాలు, పొరపాటుగా వాటిని నా సంస్కారాలు అని అంటున్నారు, అవి మీవా? అవి బ్రాహ్మణ జీవితం యొక్క సంస్కారాలా? అప్పుడప్పుడు సోమరితనం, అప్పుడప్పుడు సూక్ష్మ నిర్లక్ష్యం, ఈ నిర్లక్ష్యం కూడా చాలా రకరకాల రూపాలలో వస్తుంది. నిర్లక్ష్యం ఏయే రూపాలలో వస్తుందో; ఎంత సూక్ష్మరూపంలో వస్తుందో ఎప్పుడైనా దీని గురించి క్లాస్ చేస్కోండి.

కనుక బ్రాహ్మణ జీవితం అంటే కొత్త జీవితం, దీంట్లో పాతవి ఏమీ ఉండవు. ఈరోజు హోలీ జరుపుకునేటందుకు వచ్చారు కదా! హోలీ అంటే జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఈరోజు హోలీ జరుపుకోవటం అంటే పాత సంస్కారాలను కాల్చేయాలి. కాల్చేసిన తర్వాతే జరుపుకోవటం ఉంటుంది. కనుక ఇప్పుడు మీది జరుపుకునే స్వరూపం. కాల్చేశారు కనుక ఇప్పుడిక జరుపుకోవాలి. ప్రభు సాంగత్యం యొక్క రంగు యొక్క ఆనందాన్ని పొందేవారు మరియు కంబైండ్ రూపాన్ని అనుభవం చేసుకునేవారు, ఎందుకు? పవిత్ర తండ్రి మీపై పవిత్రత అనే రంగుని చల్లారు.

ఈరోజు ఏ హోలీ జరుపుకుంటున్నారు? విశేషంగా ఈరోజు ఏ పాత సంస్కారాన్ని రానివ్వకూడదు. ఈ హోలీ జరుపుకోవాలి. జరుపుకోగలరా లేక అప్పుడప్పుడు అవి వచ్చేస్తాయా? నేను చేయాలనుకోలేదు కానీ ఇది నా సంస్కారం అని చాలా రాయల్ మాటలు చెప్తున్నారు. ఈ మాటలను ఈరోజు ధృడ సంకల్పం అనే విధితో సమాప్తి చేయండి. ఈరోజు నుండి ఇటువంటి సదాకాలిక హోలీని జరుపుకునే ధైర్యం ఉందా? లేక అప్పుడప్పుడు జరుపుకుంటారా? ఈరోజు

Created by Universal Document Converter

నుండి పాత సంస్కారాలు హోలీ అంటే గతించిపోయినవి, క్రొత్త జన్మ, పాత జన్మ సమాప్తం అని ధైర్యం పెట్టుకునే వారు, బాబాకి మధురాతి మధురమైన గారాభ పిల్లలు కదా! ఈవిధంగా సంకల్పం కాదు, ధృడ సంకల్పం చేసే ధైర్యం ఉందా? చేతులెత్తండి. చూడండి, అందరూ ధైర్యం పెట్టుకున్నారు. కొద్దిమంది మిగిలి ఉన్నా కానీ మీరందరు తోడుగా ఉన్నారు కదా. పక్కాగా తోడు ఉండేవారు రెండు చేతులెత్తండి! వీరందరికీ ఫోటో తీయండి.మంచిది. డబల్ విదేశీయులు కూడా చేతులెత్తుతున్నారు.

అయితే మీ అందరికీ బాప్‌దాదా పదమా పదమాపద శుభాకాంక్షలు ఇస్తున్నారు. హోలీని హో..లీ..గా జరుపుకునేటందుకు. ఇప్పటి నుండి ఇక పొరపాటుగా కూడా ఈ మాటలు రాకూడదు. నా సంస్కారం అంటున్నారు, రావణుని సంస్కారాలను నావి అంటున్నారు, అద్భుతం! రావణుడిని శత్రువు అని అంటారు, మీ శత్రువు యొక్క ఖజానాని మీదిగా చేసుకోవటం ఆశ్చర్యకరమైన విషయం! ఏమంటున్నాం మేము అని మీకు కూడా ఆశ్చర్యమనిపిస్తుంది కదా. పొరపాటున అనేస్తున్నారు. అంటున్నారు కానీ లోపల మనస్సు తినేస్తూ ఉంటుంది, అనుభవం కూడా చేసుకుంటున్నారు, బాబాతో చెప్తారు కూడా, బాబా రేపటి నుండి ఈవిధంగా చేయము అని క్షమాపణ కోరతారు మరలా చేస్తూ ఉంటారు. అప్పుడు బాబా ఏం చేస్తారు? చూస్తూ ఉంటారా? ఇప్పుడు ఈ మాటను కాల్చేయండి. కాల్చటం గురించి ఒక మంచి విషయం చెప్తారు - పక్షిని వండుకునేటందుకు త్రాడుతో కట్టేసి కాలుస్తారు, ఆ పక్షి ఉడికిపోతుంది కానీ త్రాడు మాత్రం కాలదు. మీరు ఆత్మ అవినాశి, శరీరం వినాశి అని మొదటి పాఠం చదువుకున్నారు కదా! ఇలాంటి పండుగలు, శాస్త్రాలను తయారుచేసేవారు కూడా బాబాకి పిల్లలే కదా కానీ మీరు గారాభ పిల్లలు; ఆ పిల్లల అద్భుతం కూడా తక్కువేమీ కాదు. పిండిలో ఉప్పు అంత నిజం ఉంటుంది కానీ దాని గురించి కథలు పెద్దగా తయారుచేసేశారు. ప్రతి పండుగని స్మృతిచిహ్నంగా తయారుచేశారు కానీ చాలా సూక్ష్మ విషయాలకు స్థూల రూపాన్ని ఇచ్చేశారు. కానీ స్మృతిచిహ్నాన్ని అయితే తయారుచేశారు కదా! భక్తిలో కూడా తక్కువ చేయలేదు కదా! భక్తిలో ద్వాపర, కలియుగాల్లో కూడా కొన్ని విషయాలు స్మృతిలో ఉంచుకున్నారు. వాటి ద్వారా మనిషిని అతి వికారిగా చేయకుండా రక్షించారు. కనుక బాప్‌దాదా కూడా ఇటువంటి సామాగ్రి, శాస్త్రాలు లేదా పండుగలు తయారుచేసే పిల్లలకు కూడా ఫలం ఇస్తారు. ఏదైనా కానీ భక్తిలో కూడా ఎంతోకొంత స్మృతి చేస్తారు కదా, కొద్ది సమయం అయినా వికారాల నుండి రక్షణగా ఉంటారు.

అయితే ఈరోజు మీరు ఏ హోలీ జరుపుకున్నారు? ఏ హోలీ జరుపుకున్నారు? హోలీ, అందరూ చెప్పండి హో..లీ... పక్కా కదా? జరుపుకున్నారా? జరుపుకున్నారా? మంచిది. అయితే రేపే మాయ వస్తుంది; ఎందుకంటే మాయ కూడా వింటుంది కానీ మీరు మాయను మీవైపుకి పిలవకూడదు, ఆవిధంగా చేయకూడదు. దీంట్లో మజా ఉంది కదా, ఉంది కదా మజా! ఆ మజాలో ఉండాలి. బాబాని జ్ఞాపకం చేసుకోవాలి, బాబా మనకు ఎంతగా ఆత్మిక రంగుని అంటిస్తున్నారో కదా, దాని ద్వారా మీరు పవిత్ర హంసలు అయిపోతున్నారు. పవిత్ర హంస అంటే నిర్ణయశక్తి గల పవిత్ర హంసలు. ఏ పని చేస్తున్నా కానీ ఒక స్థితిని తయారుచేసుకోండి, ఆ స్థితిలో స్థితులై ఆ తర్వాత నిర్ణయం చేయండి, ఆ స్థితి ఏమిటో తెలుసా? ఆ స్థితి - త్రికాలదర్శి స్థితి. మొదట త్రికాలదర్శి స్థితిలో స్థితులై మూడు కాలాలను చూడండి, కేవలం వర్తమానాన్ని

Created by Universal Document Converter

కాదు; ఆది మధ్యాంతాలు మూడింటినీ చూడండి. మూడు కాలాలలో లాభం ఉందా, నష్టం ఉందా? అని చూడండి. కొంతమంది పిల్లలు చాలా తెలివైనవారు; ఏమి తెలివి చూపిస్తున్నారో చెప్పనా? ఏదో పని జరిపించాలి కనుక అలా చేసేశాం, కానీ ఇది చేయకూడదు అని నాకూ తెలుసు కానీ చేసేశాం అని అంటున్నారు. మీరు అలా చేసేశారు సరే కానీ ఆ కర్మకి ఫలం లభిస్తుంది కదా! కనుక తెలివి చూపించకండి, బాబాని కూడా చాలా సంతోషపరుస్తున్నారు. పొరపాట్లు చేసేసి ఆ తర్వాత బాబా నీవు దయాసాగరుడివి కదా, క్షమాసాగరుడివి కదా ఇలా బాబా ఎవరో అది బాబాకే జ్ఞాపకం చేస్తున్నారు. చేసిన పొరపాటు నాకు చెప్పి సమాప్తి చేస్కోండి అని నీవే చెప్పావు కదా అని అంటున్నారు. కానీ పశ్చాత్తాపంతో చెప్పి సమాప్తి చేస్కోండి. చెప్పమన్నారు కదా అని సగం మాటను పక్కా చేసుకుని చెప్తున్నారు కానీ మొదట స్వయాన్ని పరివర్తన చేస్కోవాలి అని ధృడ సంకల్పం చేసుకుని ఆ తర్వాత చెప్పండి. నీవే చెప్పావు కదా అని బాబాని చాలా సంతోషపెడుతున్నారు. నీవు ఇలా చెప్పావు కదా, అలా చెప్పావు కదా అని బాబాకే గుర్తు చేస్తున్నారు. ఇలా చాలా తెలివి చూపిస్తున్నారు. ఇప్పుడిక ఆ తెలివి చూపించకూడదు. ధైర్యం పెట్టుకోండి. చేస్తాం, చూస్తాం కాదు; చేయాల్సిందే. చేస్తాం, చూపిస్తాం, అవుతాం... ఇలా రోజంతటిలో ఈ పాటలు బాప్‌దాదా ఎక్కువగా వింటున్నారు. కానీ మీ వేగం ఏమిటి? ఇలా చేస్తాం, చూస్తాం అనేవారు బాబా వెంట వెళ్తారా? బాబా అయితే ఎవరెడీ మరి చేస్తాం, చూస్తాం అనేవారు ఎవరెడీ అవ్వలేదు కదా కనుక బాబా వెంట ఎలా వెళ్తారు? బాబాతో పాటు వెళ్ళేవారిని చూస్తూ ఉంటారు. బాబాకి ఒకొక్క బిడ్డపై పదమాపదాల ప్రేమ ఉంది. నా పిల్లలు నాతో రాకుండా ఉండాలని బాబా అనుకోరు. ఇంటికి వెళ్ళే సమయం వచ్చినప్పుడు ఇంటికి వెళ్ళరా? ఎందుకంటే ఇంటికి వెళ్ళి తిరిగి రాజ్యానికి రావాలి. బాబాతో కలిసి ఇంటికి వెళ్ళకపోతే బ్రహ్మాబాబాతో కలిసి రాజ్యానికి కూడా రాలేరు, తర్వాత వస్తారు. కానీ మీ ప్రతిజ్ఞ ఏమిటి? వెంటే వెళ్తాం అనా లేక వచ్చేస్తాం అంటారా? మేము వచ్చేస్తాం, బాబా చూడు మేము వచ్చేస్తాం అంటారా? ఈ భాషను ఇప్పుడు సమాప్తి చేయండి.

ఈరోజు బాప్‌దాదా వతనంలో కూడా హోలీ జరుపుకున్నారు; ఎవరితో? మీరయితే ఇప్పుడు జరుపుకుంటారు. ఎడ్వాన్స్‌పార్టీ వారితో హోలీ జరుపుకున్నారు. ఎడ్వాన్స్‌పార్టీ ఉంది కదా, పేరే ఎడ్వాన్స్‌పార్టీ. కనుక బాప్‌దాదా ఎడ్వాన్స్‌గా హోలీ జరుపుకున్నారు. ఎడ్వాన్స్‌పార్టీ క్రొత్తవారు, పాతవారు అందరు ఉన్నారు. కొద్దికాలం క్రితమే వెళ్ళిపోయిన మహారథీలను మీరు గుర్తు చేసుకుంటారు కదా వారిని కూడా ప్రత్యక్షం చేశారు ఎందుకంటే ఇప్పుడే వెళ్ళిన వారందరు చిన్నతనం నుండి లేదా చాలా సమయం నుండి సేవాపాత్రను అభినయించినవారు. మీరు కూడా మీ యొక్క ఆ సహయోగులను గుర్తు చేసుకుంటారు కదా! ఆ స్థానాన్ని భర్తీ చేసుకోవలసి వస్తుంది కదా! కనుక ఈరోజు వతనంలో మమ్మా, దీది మరియు దాదీ ముగ్గురినీ విశేషంగా అందరి సంఘటన మధ్యలో నిలబెట్టారు మరియు ఇంకా ఇతర సహయోగులు ఉన్నారు కానీ ఈ ముగ్గురుని విశేష పాత్రగా నిలబెట్టారు మరియు వారికి స్మృతి ఇప్పించారు. వారికి స్మృతి ఉంది కూడా కానీ వీరు గుప్తరూపంలో సేవ చేయవలసి ఉంటుంది. అమృతవేళ వీరు కూడా వతనంలో ప్రత్యక్షమవుతారు తిరిగి సేవకి వెళ్తారు. విశేషాత్మలు సేవను వదల్లేదు. అమృతవేళ వీరు వతనానికి రావటం నిర్ణయమైపోయింది, వచ్చి తమ అసలైన బ్రాహ్మణ జీవితంలోకి వస్తారు మరియు సహయోగుల

Created by Universal Document Converter

ఏదొక సేవార్థం వెళ్తారు. తమ మనసాసేవ ద్వారా, మనస్సు మరియు బుద్ధి ద్వారా ఆత్మల మనస్సు, బుద్ధిని ఆకర్షించే విశేష సేవ చేస్తారు. మీరు ఏమి చేస్తున్నారు? అని ఈరోజు బాప్‌దాదా ఈ ముగ్గురుని అడిగారు.

బాబాకి తెలుసు అయినా కానీ అడగాలి కదా! అప్పుడు వారు చెప్పారు – మేము రెండు రకాలైన వారికి ప్రేరణనిస్తున్నాం. 1.అలజడి చేసేవారికి మరియు 2.కొత్త సృష్టికి నిమిత్తమయ్యేవారికి; ఎందుకంటే మేము ఎదురు చూస్తున్నాం. మేము చాలాకాలం నుండి వేచి చూస్తున్నాం అని మమ్మా అన్నారు. అందువలన మా సఖిలను అడగండి – ఇప్పటికీ ఇంకా వేచి చూడాలా లేక కొంచెం తయారవ్వాలా? మమ్మా యొక్క మరియు దీదీ, దాదీల సఖీలు చాలామంది కూర్చుని ఉన్నారు, సఖులు కూడా ఉన్నారు. అంటే వారి తోటి అన్నయ్యలు ఉన్నారు, అక్కయ్యలు ఉన్నారు. వారి ప్రశ్న ఏమిటంటే వేచి చూడటం మా పని కానీ ఎడ్వాన్స్‌స్థితి కలిగిన మీ పాత్ర ఏమిటి? మేము అయితే ఎదురుచూస్తున్నాం, మీరు అయితే తయారవ్వాలి. అయితే తారీఖు ఎప్పుడు నిర్ణయిస్తారు? బాబా పిల్లలైన మీరందరు సమానంగా, సంపూర్ణంగా అయినప్పుడే తయారీలు జరుగుతాయి. దీదీ అన్నారు, నా తరపున ఒక ప్రశ్న అందరినీ అడగండి. అయితే దీదీ ఏమన్నారు? ఎవరెడీగా అనే విషయం మీ అందరికీ తెలిసిందే మరియు అంటూంటారు కూడా. అయితే సంపన్నం మరియు సంపూర్ణంగా అయ్యేటందుకు ఎవరెడీయేనా? ఇక దాదీ ఏమన్నారు? ఈరోజు ఆత్మిక సంభాషణ జరిగింది. దాదీ అన్నారు – నాతో ఎవరైనా కలిసినప్పుడు నేను చూశాను మరియు అందరూ నాతో అంటూండేవారు కూడా – దాదీ మీకు కర్మాతీతంగా అవ్వాలి, అవ్వాలి ఇదే సంలగ్నత ఉంది అని. మేము కూడా వెంట వెళ్ళాలి కదా, ఇప్పుడు కూడా నా తోటి సహయోగులకు నేను చెప్పేది ఇదే – కర్మాతీతంగా అవ్వాల్సిందే కానీ ఎప్పుడు? ఎప్పుడో అనే దానిని ఇప్పుడులోకి మారుస్తారా? బాబా అయితే నవ్వుకుంటూ ఉన్నారు. ఈరోజు మొదట వీరి యొక్క ఆత్మిక సంభాషణ జరిగింది, మిగిలిన వారందరు కూడా వారితో కలిసిపోయారు, చాలా బాగా చెప్పారు అని మమ్మా అన్నారు, దీదీ మీరు కొద్దిగా శక్తినింపండి అని అన్నారు. దాదీ మీరు అయితే అందరికీ తోడునిచ్చారు. బాబా అవ్యక్తం అవుతూనే మీరు పాత్ర అభినయించారు. మా అందరి మనస్సుల్లో దాదీ యొక్క ఈ మాట గుర్తు ఉంది కానీ ఇంకా వారి యొక్క ఇతర సహయోగులు అన్నారు, దాదీ, ఇప్పుడు మీ మాటను జ్ఞాపకం చేయండి. బాబా అవ్యక్తం, శివబాబా నిరాకారి, బ్రహ్మాబాబా అవ్యక్తఫరిస్తా కానీ దాదీ అయితే సాకారంలోనే ఉండేవారు కదా, ఇప్పుడు మీరు ఆలోచించింది చేసి చూపండి. దాదీ వంటి భాధ్యత తీసుకుని చూపించండి. అంటే ఈరోజు హృదయం తెరిచి ఆత్మిక సంభాషణ చేశారు. ఇప్పుడు ఏమి చేయాలి?

హోలీ జరుపుకున్నారు కదా! నిన్నటి విషయాలే లేవు, ఇక ముందు జన్మ విషయాలు ఆలోచించటం ఏమిటి! ఇలా అందరూ సంభాషించు కుంటుండగా బాప్‌దాదా హోలీ జరుపుకోవటం ప్రారంభించేశారు. అందరూ తెల్లని వస్త్రాలలో ఉన్నారు మరియు వతనంలో అయితే ఫరిస్తా రూపంలో ఉన్నారు. హోలీ జరుపుకుంటున్నాం అని బాబా చెప్పనేలేదు అకస్మాత్తుగా చేసేశారు. అందరూ అర్థ చంద్రాకారంలో కూర్చుని ఉన్నారు, నిల్చుని లేరు, కూర్చుని ఉన్నారు, 4,5 వరుసలుగా ఉన్నారు. మొదట చిన్నవారు తర్వాత పెద్దవారు, ఆ తర్వాత ఇంకా పెద్దవారు అలా వరుసక్రమంలో కూర్చున్నారు. అప్పుడు బాప్‌దాదా ఏమి చేశారు? అకస్మాత్తుగానే 7 రంగుల వజ్రాలను పొడి

Created by Universal Document Converter

చేశారు. ఆ పొడిని అందరిపై చల్లారు. ఫరిస్తా దుస్తుల యొక్క మెరుపు ఒకటి మరియు దానిపై 7 రంగుల పొడి చల్లారు. ఇప్పుడు మీరు దీనిని ప్రత్యక్షం చేస్కోండి – మెరిసే దుస్తులపై 7రంగుల పొడి చల్లితే అది ఎలా ఉంటుందో! సత్యయుగంలో కూడా ఇటువంటి దుస్తులు లభించవు. అలా అందరూ మెరిసిపోయారు. దీదీ అయితే నషాలోకి వెళ్ళిపోయారు. ఇక్కడ ఉన్నప్పుడు కూడా ఆమె నషాలోకి వెళ్ళిపోయేవారు కదా అలా అక్కడ కూడా నషాలోకి వెళ్ళిపోయి అందరూ ఒకరినొకరు పట్టుకుని నాట్యం చేయటం ప్రారంభించారు. మధువనంలో మీరు మధువనంలో మిఠాయి తయారుచేస్తారు కదా, అలాగే బాబా వతనంలో మిఠాయిని ప్రత్యక్షం చేశారు. అప్పటికి మధువనం నుండి అయితే రాలేదు. ఆ మిఠాయిని అందరికీ పెట్టారు. ఇలా అందరూ చాలా మజాగా హోలీ జరుపుకున్నారు. మీరు కూడా ఫరిస్తా దుస్తుల్లాంటివి రకరకాల దుస్తులు మార్చుకుంటారు కదా, అలాగే రోజంతటిలో మధ్యమధ్యలో ఫరిస్తా దుస్తులను వేసుకుని చూడండి. 5 నిమిషాలు లేదా 10 నిమిషాలు నేను ఫరిస్తా రూపంలో ఉన్నాను అనుకోండి అంతే దుస్తులు మార్చేసుకున్నట్లే. సాధారణ రూపం నుండి ఫరిస్తా రూపం యొక్క దుస్తులు ధరించారు మరియు బాప్‌దాదా అప్పుడప్పుడు జ్ఞానం, అప్పుడప్పుడు శక్తులు, గుణాలు అనే రంగుని చల్లుతూ ఉన్నారు, ఇలా ఫరిస్తా దుస్తులలో ఫరిస్తా అయ్యి 5 లేదా 10 నిమిషాలు అనుభవం చేస్కోండి. ఆ తర్వాత మరలా దుస్తులు మార్చుకోండి. కర్మయోగులు కదా మీరు! ఇలా రోజంతటిలో ఎప్పుడు సమయం దొరికితే అప్పుడు ఈ ఫరిస్తా దుస్తులను వేస్కోండి మరియు బాబా ద్వారా రంగు చల్లుకోండి. ఈ ఫరిస్తా దుస్తుల యొక్క అనుభవాన్ని ఇప్పటి నుండి చేసుకుంటారు కదా! ఈ దుస్తులు వేసుకోవటం ద్వారా నషా పెరుగుతుంది మరియు ఫరిస్తాగా అవ్వటంలో సహాయం కూడా లభిస్తుంది. నలువైపుల ఉన్న పిల్లలందరికీ హోలీకి ఈ బహుమతిని బాప్‌దాదా ఇచ్చారు. ఈ దుస్తులు వేసుకుంటూ అభ్యాసం చేస్తూ ఉండాలి మర్చిపోకూడదు. హోలీకి ఫరిస్తా దుస్తులను బహుమతిగా ఇస్తున్నాను. కనుక మధ్యమధ్యలో ఈ అభ్యాసం చేస్తూ ఉండాలి. సహజమే కదా! దుస్తులు మార్చుకోవటం వచ్చు కదా! వచ్చా? వచ్చు కదా! రోజూ స్థూల వస్త్రాలను మార్చుకుంటారు కదా అదేవిధంగా ఫరిస్తా దుస్తులను కూడా మార్చుకుని చూడండి. ఈ డ్రెస్ ఎంత అందంగా, మెరుస్తూ ఉంటుందో! విన్నారా!

ఈరోజు వతనం యొక్క సమాచారం చెప్పాను. ఎడ్వాన్స్‌పార్టీ వారందరినీ మీరందరు కూడా గుర్తు చేసుకుంటున్నారు కదా ఎందుకంటే చాలా స్థానాల నుండి అనేకమంది వెళ్ళిపోయారు. వెళ్ళిపోయినవారిని గుర్తు చేసుకుంటారు కదా! బాప్‌దాదా కూడా అమృతవేళ విశేషంగా ఎడ్వాన్స్‌పార్టీ వారితో సేవ చేయిస్తారు ఎందుకంటే ప్రపంచం అంతా నిద్రపోతూ ఉంటుంది కనుక వీరు దుస్తులు మార్చుకుని వతనానికి వచ్చేస్తారు. విన్నారా! ఇప్పుడు ఏమి చేస్తారు? ఈ వ్యాయామాన్ని మర్చిపోకూడదు. వస్త్రాలను మార్చుకోవాలి. రోజంతటిలో ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు ఈ ఫరిస్తా దుస్తులు ధరించి కూర్చోండి, 3 నిమిషాలు కూర్చున్నా కానీ కూర్చోవటం మాత్రం తప్పనిసరి. దుస్తులను తప్పకుండా మార్చుకోండి. ఇప్పటి నుండే సంస్కారంగా చేస్కోండి. ఎందుకంటే ఫరిస్తా కాకుండా దేవతగా కాలేరు. మంచిది.

మంచిది, నలువైపుల ఉన్న పిల్లలందరినీ కూడా బాప్‌దాదా చూస్తున్నారు. దూరంగా కూర్చున్నా కానీ విజ్ఞాన సాధనాల ద్వారా చాలా ఎక్కువ స్థానాల నుండి మధువనంలో ఉన్నారని

Created by Universal Document Converter

చూస్తున్నారు. ఇప్పుడు మీరు టోలీ తింటున్నారు కదా అలాగే అక్కడ కూడా టోలీ పంచుతున్నారు. దూరంగా కూర్చుని కూడా సమీపంగా ఎలా అనుభవం చేసుకుంటున్నారో అని అందరినీ బాప్‌దాదా కూడా చూస్తున్నారు. నలువైపుల ఉన్న పిల్లలందరు బాబా సమానంగా, సంపూర్ణంగా అవ్వాలి. ఈ సంకల్పాన్ని ధారణ చేశారు మరియు ఆ సంకల్పానికి సమయాన్ని అనుసరించి ధృడత యొక్క బలం ఇస్తూ ఉన్నారు.

ఈవిధంగా నలువైపుల ఉన్న శుభ సంకల్పాన్ని ధారణ చేసేవారికి, వెనువెంట బాబా యొక్క ఆశలను పూర్తి చేసే ఆశాసితారలకు, దాదీ మాట - కర్మాతీతంగా అవ్వాల్సిందే, అవ్వాల్సిందే, అవ్వాల్సిందే... మరియు మమ్మా మాట - ఏదైతే చేయాలో అది ఇప్పుడే చేయండి, రేపటికి వదలకండి. మరియు దీదీ యొక్క మాట - ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి; ఈ మాట చెవుల్లో మారుమ్రోగుతూ ఉండాలి. ఇప్పుడు ఇంటికి తిరిగి వెళ్ళాలి, కర్మాతీతంగా అవ్వాలి మాటిమాటికి ఇవే మాటలను స్మృతిలోకి తెచ్చుకునే సమర్థ ఆత్మలకు బాప్‌దాదా యొక్క హోలీ మరియు పిల్లల హోలీ యొక్క శుభాకాంక్షలు. దానితో పాటు మధువనం యొక్క మిఠాయి కంటే ముందుగా బాప్‌దాదా యొక్క మిఠాయి తినండి. అందరూ నోరు తెరవండి మరియు మిఠాయి తినండి. తిన్నారా! అయితే అందరికీ బాప్‌దాదా మరియు ఎడ్వాన్స్‌పార్టీ వారి యొక్క చాలా చాలా కోటానుకోట్ల ప్రియస్మృతులు మరియు బాబా యొక్క నమస్తే.

## బాప్‌దాదా ద్వారా లభించిన ఖజానాలను స్వయంలో నింపుకుని కార్యంలో ఉపయోగించండి; అనుభవం యొక్క అధికారిగా అవ్వండి ....24-3-09

ఈరోజు నలువైపుల ఉన్న సర్వ ఖజానాలను జమ చేసుకునే సంపన్న పిల్లలను చూస్తున్నారు మరియు వెనువెంట ప్రతి ఒక్క బిడ్డ ఎంత వరకు సర్వ ఖజానాలను జమ చేసుకున్నారో ఆ ఫలితాన్ని చూస్తున్నారు. ఖజానాలు అయితే బాప్‌దాదా ద్వారా చాలా లభించాయి మరియు అవినాశిగా లభించాయి. అన్నింటికంటే గొప్ప ఖజానా - జ్ఞానధనం. దీని ద్వారా ముక్తి మరియు జీవన్ముక్తి ప్రాప్తించింది. పాత దేహం మరియు పాత ప్రపంచం నుండి ముక్తి-జీవన్ముక్తి స్థితి మరియు ముక్తిధామానికి వెళ్ళే ముక్తి పిల్లలందరికీ ప్రాప్తించింది. ఈ ఒక్క జ్ఞాన ఖజానాయే కాదు, యోగ ఖజానా కూడా లభించింది; దీని ద్వారా సర్వశక్తులు ప్రాప్తిస్తాయి. దీంతోపాటు ధారణా ఖజానా కూడా లభించింది; దీని ద్వారా సర్వ గుణాలు ప్రాప్తిస్తాయి. దీంతో పాటుగా సేవా ఖజానా కూడా లభించింది, దీని ద్వారా ఆశీర్వాదాల ఖజానా మరియు సంతోష ఖజానా ప్రాప్తిస్తుంది. వీటన్నింటి కంటే గొప్ప ఖజానా - సంగమయుగి సమయం యొక్క ఖజానా. ఎందుకంటే కల్పమంతటిలో ఈ సంగమయుగి సమయం అమూల్యమైన ఖజానా. ఈ సంగమయుగి సమయంలోని ఒకొక్క సంకల్పం, ఒకొక్క ఘడియ అమూల్యమైనది. ఎందుకంటే సంగమయుగ సమయంలో తండ్రి మరియు పిల్లల యొక్క మధుర కలయిక జరుగుతుంది. మరే యుగంలో పరమాత్మ తండ్రి మరియు పరమాత్మ పిల్లల యొక్క మిలనం జరగదు. సంగమయుగి సమయంలోనే

Created by Universal Document Converter

తండ్రి ద్వారా సర్వ ఖజానాలు ప్రాప్తిస్తాయి. ఖజానాలను జమ చేసుకునే సమయం కూడా సంగమయుగమే. మరే యుగంలోను జమాఖాతా ఉండదు మరియు జమ చేసుకునే బ్యాంక్ కూడా ఉండదు. కేవలం ఒక్క సంగమయుగంలోనే ఎన్ని ఖజానాలు ఎంతగా జమ చేసుకోవాలంటే అంత జమ చేసుకోగలరు. ఈ సంగమయుగం యొక్క గొప్పతనం ఏమిటంటే ఈ ఒక్క జన్మలో అనేక జన్మలకు సంపాదించుకోగలరు. అందువలన ఈ చిన్న యుగానికి చాలా గొప్పతనం ఉంది మరియు పిల్లలకు తండ్రి ద్వారా సర్వ ఖజానాలు ప్రాప్తిస్తాయి. తండ్రి అందరికీ ఇస్తారు కానీ ఖజానాలను జమ చేసుకోవటంలో ప్రతి ఒక్కరు తమ పురుషార్ధాన్ని అనుసరించి జమ చేసుకుంటారు. ఇచ్చే తండ్రి ఒక్కరే, అందరికీ ఒకేవిధంగా కూడా ఇస్తున్నారు, ఒకే సమయంలో ఇస్తున్నారు కానీ ధారణ చేయటంలో ఏమి చూశారంటే తండ్రి ఒకేవిధంగా ఇచ్చారు కానీ వాటిని ధారణ చేయటంలో ప్రతి ఒక్కరు ఎవరి పురుషార్ధాన్ని అనుసరించి వారు ఉన్నారు. ఎందుకంటే ఖజానాలను ధారణ చేసేటందుకు 1. మీ పురుషార్ధం ద్వారా ప్రాలబ్ధాన్ని తయారుచేసుకోగలరు 2. సదా స్వయం సంతుష్టంగా ఉండటం మరియు సర్వులను సంతుష్టం చేయటం అనే ఈ విశేషత ద్వారా ఖజానాలను జమ చేసుకోగలరు. 3. సేవ ద్వారా ఎందుకంటే సేవ ద్వారా సర్వాత్మలకు సంతోషం ప్రాప్తిస్తుంది. సంతోష ఖజానాను ప్రాప్తింప చేసుకోగలరు. మీ పురుషార్ధం, సర్వులను సంతుష్టం చేసే పురుషార్ధం మరియు సేవ యొక్క పురుషార్ధం ఈ మూడు రకాల పురుషార్ధాల ద్వారా ఖజానాలను జమ చేసుకోగలరు. ఖజానాలు జమ చేసుకోవటంలో, విశేషంగా సంబంధ సంపర్కాలలోకి రావటంలో నిమిత్తభావం, నిర్మాణభావం, నిస్వార్ధభావం, ప్రతి ఆత్మ పట్ల శుభభావన మరియు శుభ కామన కలిగి ఉండటం అవసరం. సేవలో లేదా సంబంధ సంపర్కాలలో ఈ అన్ని భావనలు ఉంటే పుణ్యఖాతా మరియు ఆశీర్వాదాల ఖాతాను చాలా సహజంగా జమ చేసుకోగలరు.

బాప్‌దాదా అందరి లెక్కలఖాతాను చూశారు, అయితే ఏమి చూశారు? నలువైపుల పిల్లలు నెంబరువారీగా ఉన్నట్లుగా చూశారు. తండ్రి ఒక్కరే, ఒకే సమయంలో ఇస్తున్నారు కానీ జమ చేసుకోవటంలో మూడు రకాలైన పిల్లలను చూశారు. 1. జమ అయిన ఖజానాలను తినేశారు. జమ చేసుకున్నారు మరియు తినేసి సమాప్తి చేసేసుకుంటున్నారు. 2. తిన్నారు, జమ చేసుకున్నారు మరియు జమ చేసుకోవటంపై ధ్యాస పెట్టుకుని పెంచుకున్నారు కూడా. ఖజానాలను పెంచుకునే సాధనం ఏమిటి? పెంచుకోవడానికి సాధనం - ఏవైతే ఖజానాలు లభించాయో వాటిని సమయానుసారం ఏ పరిస్థితి వస్తుందో ఆ పరిస్థితిని అనుసరించి కార్యంలో ఉపయోగించాలి. ఎవరైతే కార్యంలో ఉపయోగిస్తారో, స్థితి ద్వారా పరిస్థితిని మార్చుకోగలరో వారు జమ చేసుకోగలరు. కార్యంలో ఉపయోగించనివారికి జమ కూడా అవ్వదు. ప్రతి ఒక్కరు మిమ్మల్ని మీరు అడగండి - సమయానుసారం స్వయం గురించి లేదా ఇతరుల గురించి ఖజానాలను ఉపయోగిస్తున్నారా? ఎంతగా కార్యంలో ఉపయోగిస్తూ ఉంటారో అంతగా పెరుగుతూ ఉంటాయి ఎందుకంటే కార్యంలో ఉపయోగించటం ద్వారా అనుభవం అవుతూ ఉంటుంది అంటే అనుభవం యొక్క అధికారం అదనం అవుతుంది కనుక పరిశీలించుకోండి లేదా మిమ్మల్ని మీరు అడగండి - ఈ అన్ని ఖజానాలు జమ అయ్యాయా? సమయానికి కార్యంలో ఉపయోగి స్తున్నానా? అనుభవం యొక్క అధికారం పెరుగుతుందా? అని ఎందుకంటే అన్ని అధికారాలలోకెల్ల అనుభవం యొక్క అధికారం గొప్పదిగా కీర్తించబడింది కనుక ప్రతి ఒక్కరు మీ జమాఖాతాను పెంచుకోవాలి, పరిశీలించుకోవాలి

Created by Universal Document Converter

ఎందుకంటే పరిశీలించుకుని ఖజానాను పెంచుకోగలరు. ఇప్పుడింకా సమయం ఉంది. అవకాశం ఉంది ఆ తర్వాత ఈ అవకాశం కూడా సమాప్తం అయిపోతుంది. ఖజానాలు పెంచుకోవాలని అనుకుంటారు కానీ పెంచుకోలేరు. బాప్‌దాదా చూసారు - ఖజానాలు లభిస్తున్నాయి, సంతోషంతో స్వయంలో నింపుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. మురళి ద్వారానే ఖజానాలు లభిస్తాయి కానీ రెండు రకాలైన పిల్లలు ఉన్నారు ఒకరు - వినేవారు. రెండవవారు - లీనం చేసుకునేవారు. కొంతమంది పిల్లలు విని చాలా సంతోష పడుతున్నారు కానీ వినటం మరియు లీనం చేసుకోవటంలో చాలా తేడా ఉంది. లీనం చేసుకునేవారు అనుభవీగా అవుతారు ఎందుకంటే లీనం చేసుకుని సమయాను సారం ఉపయోగిస్తూ ఉంటారు. ఖజానాను పెంచుకుంటూ ఉంటారు. వినేవారు బాబా చాలా బాగా చెప్పారు, చాలా మంచి విషయం చెప్పారు అని వర్ణిస్తారు కానీ లీనం చేసుకోకుండా సమయానికి పనిలో ఉపయోగించలేరు కనుక అందరు పరిశీలించుకోండి, నింపుకునేవారేనా? కొద్దిగా అయినా తక్కువ ఉంటే, పూర్తిగా నిండుగా లేకపోతే కదులుతూ ఉంటుంది. పూర్తిగా నింపుకుంటే కదలదు కనుక ఈరోజు బాప్‌దాదా అందరి ఖజానాలను పరిశీలించారు. చెప్పాను కదా, మూడు రకాలైన పిల్లలు ఉన్నారు. ఇప్పుడు నేనెవరు? అని మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. ఖజానాలను పెంచుకోవటం అంటే సమయానికి కార్యంలో ఉపయోగించటం ఎంతగా కార్యంలో ఉపయోగిస్తూ ఉంటారో అంతగా ఖజానా పెరుగుతూ ఉంటుంది. ఏవైతే ఖజానాలను ఉన్నాయో ఆ ఖజానాలకు యజమాని అయినవారు కార్యంలో ఉపయోగిస్తారు. మీ అందరికీ సర్వ ఖజానాలను బాబా వారసత్వంగా ఇచ్చారు. బాబా ఖజానాను మీ ఖజానాగా చేసుకోవటంలో ప్రతి ఒక్కరు ధ్యాస పెట్టుకోవాలి ఎందుకంటే ఖజానాలు ఎంత నిండుగా ఉంటాయో అంతగా సంపన్నస్థితిలో అచంచలంగా, స్థిరంగా ఉంటారు.

బాప్‌దాదా కోరుకునేదేమిటంటే, ప్రతి ఒక్క బిడ్డ సంపన్నమవ్వాలి, తక్కువగా ఉండకూడదు అని ఎందుకంటే బాబా ద్వారా అవినాశి ఖాతా జమ చేసుకునే అవకాశం కేవలం ఇప్పుడే లభిస్తుంది అందువలనే ఇప్పుడు లేకున్నా మరెప్పుడు లేదు అని చెప్పబడింది.ఈ మహిమ సంగమయుగి సమయానిదే. భవిష్యత్తులో అయితే ఇప్పుడు ఏదైతే జమ చేసుకున్నారో దాని ఫలం పొందుతారు కానీ ప్రాప్తిని పొందే సమయం ఇప్పుడే. ప్రతి ఒక్కరు మీ ఖాతాను చూసుకోవాలి. ఎవరికి ఎంతగా ఖజానా నిండుగా ఉంటుందో వారి నయనాల ద్వారా, నడవడిక ద్వారా, ముఖం ద్వారా తెలిసిపోతుంది. వారి నడవడిక మరియు ముఖం వికసించిన గులాబీ వలె ఉంటుంది. బాప్‌దాదా ప్రతి ఒక్కరి నడవడిక మరియు ముఖం ద్వారా చూస్తూ ఉంటారు, ఎంత హర్షితంగా, ఎంత ప్రసన్నంగా ఉంటున్నారు అని. నయనాల ద్వారా ఆత్మీయత, ముఖం ద్వారా చిరునవ్వు మరియు కర్మ ద్వారా ప్రతి ఒక్క గుణం అందరికీ అనుభవం అవుతుంది కనుక ప్రతి ఒక్కరు మిమ్మల్ని మీరు పరిశీలన చేసుకోండి.

బాప్‌దాదాకి ప్రతి ఒక్క బిడ్డపై ఇదే శుభభావన ఉంది -ప్రతి ఒక్క బిడ్డ అనేకాత్మలను ఖజానాలతో సంపన్నంగా తయారుచేయాలి అని. ఈరోజుల్లో విశ్వాత్మలందరు కూడా ఏదోక ఆధ్యాత్మికశక్తి కావాలి అని కోరుకుంటున్నారు.ఆ ఆధ్యాత్మికశక్తినిచ్చే దాతలు బ్రాహ్మణాత్మలైన మీరే ఎందుకంటే మీరే అందరికంటే ఉన్నతోన్నతమైనవారు, పవిత్రమైనవారు మరియు ధనవంతులు.అందరికంటే పవిత్రమైనవారు కూడా మీరే. మీకు జరిగేటువంటి విధిపూర్వకమైన

Created by Universal Document Converter

పూజ ఎవరికీ జరగదు. ఇప్పుడు అంతిమ జన్మలో కూడా మీ యొక్క పూజ ఏ ధర్మపితకి, మహానాత్మలకు, ఏ నిమిత్త ఆత్మలకు జరగటంలేదు. విధిపూర్వక పూజకి స్మృతిచిహ్నం తయారుచేస్తారు కానీ విధిపూర్వక పూజ జరగటంలేదు మరియు మీకు లభించేటువంటి ఖజానా, మీరు మొత్తం విశ్వంలో అందరికంటే ధనవంతులు, బ్రాహ్మణాత్మలైన మీ ఒక జన్మ యొక్క ఖజానా 21 జన్మలు ఉంటుంది ఎందుకంటే ఈ ఖజానా బాబా ద్వారా వారసత్వంగా లభించింది. బాబా ఎలా అయితే అవినాశియో అలాగే బాబా ద్వారా లభించిన ఖజానా కూడా అవినాశి అయిపోతుంది. అందువలనే మీరు విశ్వంలో అందరికంటే ధనవంతులు మరియు అందరికంటే పవిత్రులు.

అందరూ స్వయాన్ని ఇటువంటి విశేషసేవాధారిగా భావిస్తున్నారు కదా! ఇప్పటి సమయాను సారంగా విశ్వాత్మలకు ఏది అవసరమో తెలుసు కదా! ఈరోజుల్లో విశ్వానికి కావల్సింది – సంతోషం, శక్తి మరియు స్నేహం. ఆత్మికస్నేహాన్ని కోరుకుంటున్నారు. ఇప్పుడు సమయానుసారంగా బ్రాహ్మణాత్మలైన మీరు దాతగా అవ్వండి. మనస్సు ద్వారా శక్తులను ఇవ్వండి, వాచా ద్వారా జ్ఞానం ఇవ్వండి మరియు కర్మణా ద్వారా గుణదానం చేయండి. బ్రహ్మాబాబా అంతిమంలో మూడు మాటలు పిల్లలందరికీ కానుకగా ఇచ్చారు, జ్ఞాపకం ఉన్నాయి కదా! ఆ మూడు మాటలను కనుక సేవలో ఉపయోగిస్తే చాలా మంది ఆత్మలను సంతుష్టం చేయగలరు. ఆ మూడు మాటలు ఏమిటంటే – నిరాకారి, నిరహంకారి మరియు నిర్వికారి. మనస్సులో నిరాకారి అవ్వాలి, మాటలో నిరహంకారి అవ్వాలి మరియు కర్మణా ద్వారా నిర్వికారి అవ్వాలి. ఈ మూడు మాటలను సేవలో ఉపయోగించండి. ఇప్పుడు విశ్వానికి మీ శక్తి ద్వారా కొద్దిగా అయినా మనస్సు యొక్క ఆనందం, సుఖం యొక్క ప్రాప్తి అనుభవం అవ్వాలి. అందరు నిరాశగా ఉన్నారు. మీరు విశ్వానికి ఆశాసితారలు. బాప్‌దాదా పిల్లలందరినీ బాబా యొక్క ఆశాసితారలుగా చూస్తున్నారు. కేవలం నమ్మకం కలిగిన సితారలుగా అవ్వకూడదు కానీ ఆశలను పూర్తి చేసే ఆశాసితారలుగా అవ్వాలి.

బాప్‌దాదా దగ్గరికి పిల్లల స్నేహం సదా చేరుతూ ఉంటుంది. అన్నింటికంటే సహజమైన పురుషార్థం ఏమిటి? రకరకాలైన పురుషార్థాలు ఉన్నాయి కానీ సహజమైన పురుషార్థం – స్నేహం. స్నేహంలో శ్రమ కూడా ప్రేమ రూపంలోకి మారిపోతుంది. బాబాకి స్నేహిగా అవ్వటం అంటే సహజంగా పురుషార్థం చేయటం. స్నేహంలో అందరు స్నేహిగా ఉంటారు కానీ సదా స్నేహిగా ఉండాలి, అప్పుడప్పుడు స్నేహం చేసేవారిగా కాదు. స్నేహసాగరంలో సదా లీనమై ఉండే స్నేహిగా భావిస్తున్నారా! సదా మరియు స్నేహ సాగరంలో ఇమిడి ఉండాలి, మునకలు వేసేవారిగా కాదు, లీనమై ఉండాలి. ఎవరైతే స్వయాన్ని సదా స్నేహసాగరంలో లీనమై ఉండే ఆత్మలం అని భావిస్తున్నారో వారు చేతులెత్తండి! సదాయేనా? సదా అనే మాటను అండర్‌లైన్ చేసుకోండి. సదాయేనా? సదాయేనా? చేతులెత్తండి? చేతులైతే చాలా బాగా ఎత్తారు. బాప్‌దాదా చేతులను చూసి సంతోషిస్తున్నారు ఎందుకంటే ధైర్యం పెట్టుకుంటున్నారు. ఒకవేళ కొంచెం తక్కువైనా చేతులెత్తాము అని జ్ఞాపకం వస్తుంది కదా! బాప్‌దాదాకి ఒక్కొక్క బిడ్డపై చాలా స్నేహం ఉంది. ఎందుకు? ఎందుకంటే బాప్‌దాదాకి తెలుసు, ఈ ఒక్కొక్క ఆత్మ అనేకసార్లు స్నేహి అయ్యారు, ఇప్పుడు కూడా అయ్యారు మరియు ప్రతి కల్పం ఈ ఆత్మలే స్నేహిగా అవుతారు . మేమే ప్రతి కల్పం అధికారి ఆత్మలం అనే నషా మరియు సంతోషం ఉంటుందా? బాప్‌దాదా అనుభవమైన

Created by Universal Document Converter

అధికారి ఆత్మలను చూసి హృదయాపూర్వక ఆశీర్వాదాలు ఇస్తున్నారు. సదా అలసిపోనివారిగా అయ్యి ఎగురుతూ ఉండండి. ఎప్పుడైనా ఏదైనా పరిస్థితి వచ్చినా కానీ స్వస్థితిని అలజడి చేసుకోకండి. స్వస్థితిలో ఉంటే పరిస్థితి ఏమీ చేయలేదు. మంచిది, మొదటిసారి వచ్చినవారు చేతులెత్తండి! చాలామంది వస్తారు. బాప్‌దాదాకి ఒక్కొక్క బిడ్డని చూసి ఓహో నా పిల్లలు ఓహో అని గర్వంగా ఉంది. ఎలా అయితే మీరు మనస్సులో స్వతహాగానే ఓహో బాబా! ఓహో!! నా బాబా ఓహో!! అనే పాటలు పాడతారు కదా అలాగే బాబా కూడా పిల్లల గురించి ఓహో నా ప్రతి బిడ్డ ఓహో అనే పాట పాడుతున్నారు. ఎందుకంటే బాబాకి కూడా మీరు కల్పం తర్వాత దొరుకుతున్నారు మరియు ఒక్కొక్కరు విశ్వం ముందు మహాన్‌ఆత్మలు. ఓహో పిల్లలు ఓహో అనే పాట బాబా కూడా పాడుతున్నారు. ఓహో, ఓహో కదా! ఓహో, ఓహో పిల్లలు కదా! ఓహో! ఓహో! పిల్లలు చేతులు ఎత్తండి! సదా ఇదే స్మృతి ఉంచుకోండి మేము ఓహో, ఓహో పిల్లలం అని. పురుషార్థులైనా కానీ ఓహో, ఓహో పిల్లలు. బాబా యొక్క ఓహో, ఓహో పిల్లలు బాబా వెంటే వెళ్తారు. ఉండిపోరు కదా! బాబా అయితే అంటారు, ప్రతి ఒక్క బిడ్డను స్నేహమనే ఒడిలో వెంట తీసుకువెళ్తాను అని. తయారేనా? తయారేనా? మార్గమధ్యలో ఆగిపోరు కదా? వెంట వెళ్తాను అనే ప్రతిజ్ఞ ఉంది కదా! ప్రతిజ్ఞను నిలుపుకునేవారు కదా!

ఇప్పుడు బాప్‌దాదా ఇదే కోరుకుంటున్నారు, మీ యొక్క ఫరిస్తా రూపాన్ని ప్రత్యక్షం చేయండి. నడుస్తూ, తిరుగుతూ ఫరిస్తా డ్రెస్ వేసుకున్నట్లు అనుభవం చేసుకోండి. బాప్‌దాదా ఈ వ్యాయామం గురించి చెప్పారు కదా! ఎలా అయితే శరీరం యొక్క డ్రెస్ మార్చుకుంటున్నారో అలాగే ఆత్మ యొక్క స్వరూపమైన ఫరిస్తా స్వరూపాన్ని మాటిమాటికి అనుభవం చేసుకోండి. ఫరిస్తా డ్రెస్ ఇష్టమే కదా! ఎలా అయితే బ్రహ్మాబాబా అవ్యక్త ఫరిస్తా రూపంలో వతనంలో కూర్చున్నారో అలాగే బాబా సమానంగా మీరు కూడా నడుస్తూ, తిరుగుతూ ఫరిస్తా రూపంలో అనుభవం చేసుకోండి ఎందుకంటే ఫరిస్తా రూపంగా అయినప్పుడే దేవతగా అవుతారు. ఎలా అయితే బాబా యొక్క మూడు రూపాలు స్మృతి ఉంటాయి కదా; తండ్రి, శిక్షకుడు మరియు సద్గురువు అలాగే స్వయం యొక్క మూడు రూపాలను కూడా స్మృతి ఉంచుకోండి - బ్రాహ్మణుల నుండి ఫరిస్తా మరియు ఫరిస్తా నుండి దేవత. ఈ మూడు రూపాలు పక్కాగా ఉన్నాయి కదా! అప్పుడప్పుడు బ్రాహ్మణాత్మను అనే డ్రెస్ వేసుకోండి, అప్పుడప్పుడు ఫరిస్తా యొక్క డ్రెస్ వేసుకోండి, అప్పుడప్పుడు దేవతా డ్రెస్ వేసుకోండి. ఈ మూడు రూపాల ద్వారా స్వతహాగానే త్రికాలదర్శి సీట్‌పై కూర్చుని సాక్షి అయ్యి ప్రతి కార్యం చేస్తూ ఉంటారు. అందరి నుండి బాప్‌దాదా ఇదే కోరుకుంటున్నారు సదా బాబా వెంట ఉండండి, ఒంటరిగా అవ్వకండి. వెంట ఉంటేనే వెంట వెళ్ళగలరు. ఒకవేళ ఇప్పుడు అప్పుడప్పుడు వెంట ఉంటే కనుక వెంట ఎలా వెళ్తారు! స్నేహి, స్నేహిని ఎప్పుడు మర్చిపోరు. రోజంతటిలో ఈ అభ్యాసం చేస్తూ ఉండండి ఇప్పుడిప్పుడే బ్రాహ్మణులుగా, ఇప్పుడిప్పుడే ఫరిస్తాగా, ఇప్పుడిప్పుడే దేవతగా అవ్వాలి. నలువైపుల ఉన్నటువంటి సదా ఖజానాలతో సంపన్నంగా ఉండే పిల్లలందరికీ, మీరు సదా మీ నడవడిక మరియు ముఖం ద్వారా సేవ చేసే సేవాధారులు ఎందుకంటే మీ అందరి ప్రతిజ్ఞ ఏమిటంటే మేము విశ్వ పరివర్తకులుగా అయ్యి విశ్వాన్ని పరివర్తన చేస్తాము అని, సేవాధారులు నడుస్తూ, తిరుగుతూ కూడా సేవలో తత్పరులై ఉంటారు.

Created by Universal Document Converter

ఇలా విశ్వసేవాధారి, విశ్వపరివర్తకులకు, ప్రతి ఒక్కరిని బాప్‌దాదా యొక్క ఖజానాలతో నిండుగా చేసే పిల్లలకు, నలువైపుల ఉన్న పిల్లలందరికీ బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు హృదయపూర్వక ఆశీర్వాదాలు మరియు నమస్తే.

## కారణం అనే మాట నుండి ముక్తి అయ్యి నడవడిక మరియు ముఖం ద్వారా ముక్తినిచ్చే ముక్తిదాత అవ్వండి, సేవ యొక్క ఉత్సాహ, ఉల్లాసాలతో పాటు సదా బేహద్‌వైరాగ్యవృత్తిలో ఉండండి ...7-4-2009

ఈరోజు బాప్‌దాదా నలువైపుల ఉన్న డబల్ యజమానులైన ప్రతి బిడ్డను చూస్తున్నారు. డబల్ యజమానులు అంటే ఒకటి, బాబా యొక్క సర్వ ఖజానాలకు యజమానులు మరియు రెండు, స్వరాజ్యానికి యజమానులు. రెండింటి యజమానిస్థితి ప్రతి బిడ్డకు బాబా ద్వారా లభించింది. బాలకులు కూడా మరియు యజమానులు కూడా! మీరు నా బాబా అన్నారు మరియు బాబా కూడా నా పిల్లలు అని అన్నారు కనుకనే బాలకులు మరియు యజమానులు రెండు అనుభవం అయ్యాయి.

ఈరోజు చాలా ఎక్కువ మంది పిల్లలు వచ్చారు, ఇది ఈ సంవత్సరం యొక్క చివరి టర్న్ కదా! ఈరోజు బాప్‌దాదా ప్రతి ఒక్కరి పురుషార్ధాన్ని పరిశీలన చేసారు. మరి బాబా ఏమి చూసి ఉంటారో చెప్పండి? నా పురుషార్ధం ఏమిటి? అని ప్రతి ఒక్కరు మిమ్మల్ని మీరు అడగండి. బాప్‌దాదా పిల్లలందరినీ చూసి సంతోషపడుతున్నారు కానీ బాబాకి ఒక ఆశ ఉండిపోయింది, అది ఏమిటో చెప్పమంటారా! బాబా యొక్క ఆశను పూర్తి చేస్తారు కదా! ఒకే ఆశ ఉంది, అది చెప్పమంటారా! ఆశను పూర్తి చేసేవారు చేతులెత్తండి! చాలా మంచిది. చిన్న ఆశయే.అది ఏమిటంటే ఈరోజు నుండి ఒక మాటను మార్చుకోండి, ఏ మాటను మార్చుకుంటారు? మాటిమాటికి క్రిందికి తీసుకువచ్చే మాట ఏమిటంటే - కారణం. ఈ కారణం అనే మాటను పరివర్తన చేసుకుని నివారణ అనే మాటను సదా ధారణ చేయండి ఎందుకంటే ఇప్పుడు మీ అందరి సేవ కూడా ఏమిటి? విశ్వాత్మల అందరి సమస్యల కారణాలను నివారణ చేసి నిర్వాణధామానికి తీసుకువెళ్ళాలి ఎందుకంటే మీరందరు ముక్తిదాతలు కనుక ఇతరులకు ముక్తిని ఇవ్వాలంటే స్వయం కారణాలను నివారణ చేసుకోవాలి అప్పుడే ఇతరులకు ముక్తిని ఇప్పించగలరు.నిర్వాణధామానికి పంపించగలరు. కనుక ఈ ఒక మాటను మార్చుకోవటం కష్టమా లేదా సహజమా? ఆలోచించండి!

ఈరోజు బాప్‌దాదా ఇక్కడికి వచ్చినవారి నుండి లేదా తమ, తమ స్థానాలలో ఉండి ఎవరైతే బాబాని చూస్తున్నారో లేదా మురళి వింటున్నారో వారందరి నుండి ఒకే మాట యొక్క పరివర్తనను కోరుకుంటున్నారు ఎందుకంటే కారణమనేది క్రిందికి తీసుకువచ్చేస్తుంది.అర్ధకల్పం కారణాలలో ఉన్నారు ఇప్పుడు నివారణ చేసుకునే సమయం.నివారణ మరియు నిర్వాణం మరియు ముక్తి. ఈరోజు బాప్‌దాదాకి ఈ మాటను ఇచ్చే ధైర్యం ఉందా! చివరి టర్న్ కదా, అందరు ఉత్సాహ, ఉల్లాసాలతో వచ్చారు మరియు బాప్‌దాదా ఒక్కొక్కరికి శుభాకాంక్షలు ఇస్తున్నారు. నిద్రించడానికి, భోజనం చేయడానికి కష్టమే కానీ అందరు స్నేహంతో, స్నేహంతో విమానంలో అందరినీ

Created by Universal Document Converter

మధువనానికి చేర్చింది. బాప్‌దాదా ప్రతి ఒక్కరి స్నేహాన్ని చూసి ప్రతి ఒక్కరికీ కోటానుకోట్ల హృదయపూర్వకమైన స్నేహాన్ని ఇస్తున్నారు.కానీ స్నేహంలో మీరు ఏమి చేస్తున్నారు? ఎవరితో స్నేహం ఉంటుందో వారికి స్నేహంతో బహుమతిని కూడా ఇస్తారు. ఈరోజు బాప్‌దాదా బహుమతిగా ఈ కారణం అనే మాటను తీసుకోవాలనుకుంటున్నారు. బాప్‌దాదా యొక్క ఈ ఆశను పూర్తి చేయాలి కదా! మరలా చేతులు ఎత్తండి! ఆ మాటను ఇక్కడే వదిలేసి వెళ్ళిపోవాలి. ఈ ద్వారం నుండి బయటికి వెళ్ళగానే కారణమనే మాట సమాప్తి అయిపోవాలి. ఒకవేళ అది పొరపాటుగా వచ్చినా, బాబాకి ఇచ్చేసిన వస్తువు అంటే అది తాకట్టు వస్తువు. తాకట్టు వస్తువుని ఎలా ఉంచుతారు? తిరిగి తీసుకుంటారా? అందరు ధృడసంకల్పం చేసారా? చేసారా? చేసారా? మరలా చేతులు ఎత్తండి! మంచిది, చాలా మంచిది. ఎందుకంటే ఇప్పుడు సమయానుసారం మీ ముందు క్యూ పెడతారు. క్యూ ఎందువలన పెడతారు? ఓ ముక్తి ఆతలు ముక్తినివ్వండి అని. ముక్తినిచ్చే ముక్తిదాతలైన మీరు మొదట ఈ ఒక మాట నుండి ముక్తి అయినప్పుడే ముక్తిని ఇవ్వగలరు.

బాప్‌దాదా ఇదే కోరుకుంటున్నారు – ఇప్పుడు ఈ సంవత్సరం యొక్క హోమ్‌వర్క్ ఇదే–స్వయం ముక్తి అయ్యి ముక్తిని ఇప్పించాలి ఎందుకంటే రోజురోజుకి సమస్యలు చాలా పెరగనున్నాయి. సమస్య సమాధాన స్వరూపంలోకి మారిపోవాలి. సమస్యను తొలగించటంలో శ్రమ మరియు సమయం పట్టకూడదు. మీకు మీ భక్తుల పిలుపు మరియు సమయం యొక్క పిలుపు వినపడటం లేదా! ఇప్పుడు సమయానుసారంగా ఏమి పరివర్తన అవసరం? ఇప్పుడు ప్రతి ఒక్కరు అనుభవీమూర్తి అయ్యి ఏదోక అనుభవం చేయించే అవసరం ఉంది. బాబా ఇప్పుడు ఇదే కోరుకుంటున్నారు – మీ ముఖం ద్వారా మరియు నడవడిక ద్వారా వీరు ముక్తిదాత పిల్లలు ముక్తినిచ్చేవారు అని అందరికీ స్పష్టంగా అనుభవం అవ్వాలి.మీ మస్తకం ద్వారా మెరిసే సితార అనుభవం అవ్వాలి.కేవలం చెప్పటం ద్వారా కాదు, ముఖం ద్వారా అనుభవం అవ్వాలి ఎందుకంటే అనుభవమనేది సమీపంగా తీసుకువస్తుంది.కనుక ఈ అనుభవాన్ని ముఖం ద్వారా మరియు నడవడిక ద్వారా చూపించండి. ఎలా అయితే విజ్ఞాన సాధనాలు అనుభవాలు చేయిస్తున్నాయి కదా! ఇప్పుడు వేడి సమయం కనుక వేడిని మరియు చల్లదనాన్ని అనుభవం చేయిస్తున్నాయి కదా! మరి ఇలా విజ్ఞాన సాధనాలే అనుభవీగా చేయగల్గుతున్నప్పుడు శాంతిశక్తి శక్తి యొక్క అనుభూతిని చేయించలేదా! ఇప్పుడు బాప్‌దాదా పిల్లల నుండి ఇదే కోరుకుంటున్నారు, అనుభవమనే స్థితిలో స్థితులై నయనాల ద్వారా, మస్తకం ద్వారా ఏదోక శక్తి యొక్క అనుభవం చేయించండి.విన్నటువంటి విషయాలు విన్న సమయంలో బావున్నాయనిపిస్తాయి కానీ మరలా ఏదైనా సమస్య వచ్చినప్పుడు మర్చిపోతారు కూడా కానీ అనుభవమనేది జీవితాంతం మర్చిపోరు. బాప్‌దాదా ఒకటి, కారణాన్ని చూసారు మరియు ఫలితాన్ని కూడా చూసారు.ఒక ఫలితాన్ని చూసి చాలా, చాలా శుభాకాంక్షలు ఇచ్చారు. ఏమి ఫలితం చూసారు? ఈరోజు వరకు సేవ యొక్క ఉత్సాహ, ఉల్లాసాలు బావున్నాయి. బాప్‌దాదా శుభాకాంక్షలు కూడా ఇస్తున్నారు, సేవను కూడా పెంచుతున్నారు మరియు ప్లాన్స్ కూడా బాగా తయారు చేస్తున్నారు, శక్తిననుసరించి ఫలితం కూడా వస్తుంది కానీ ఒక విషయాన్ని అనుభవం చేయించేటందుకు మీపై ధ్యాస పెట్టుకోవాలి. ఇప్పుడు మీ సేవ ప్రసిద్ధం అవుతుంది, సంతోషిస్తున్నారు కూడా మరియు ఈరోజుల్లో ఆసక్తి కూడా

Created by Universal Document Converter

పెరుగుతుంది కానీ ఇప్పుడు ఇక అనుభవం చేయించే విధి ఏమిటి? ఇప్పుడు ఉత్సాహ, ఉల్లాసాలైతే ఉన్నాయి. ఎంతగా ఉత్సాహం ఉందో అంతగా సమయానుసారంగా ఇప్పుడు బేహద్‌వైరాగ్యవృత్తి ఉండాలి. పురుషార్థంలో ఏదైనా సమస్యారూపంగా అవుతుందంటే దానికి కారణం, బేహద్ వైరాగ్యవృత్తిలో లోపం ఉన్నట్లే. ఇప్పుడు బేహద్‌వైరాగ్యవృత్తి ఉండాలి.

బేహద్‌వైరాగ్యమనేది సదాకాలికంగా ఉండాలి. ఒకవేళ సమయాను సారంగా కనుక ఉంటే సమయం మొదటి నెంబర్ అయిపోతుంది మరియు మీరు రెండవ నెంబర్ అయిపోతారు. ఎందుకంటే సమయం మీకు వైరాగ్యాన్ని ఇప్పించింది. బేహద్ వైరాగ్యమనేది సదాకాలికంగా ఉంటుంది. ఒకవైపు ఉత్సాహ,ఉల్లాసాలు, సంతోషం ఉండాలి మరియు రెండవవైపు బేహద్ వైరాగ్యం ఉండాలి. బేహద్‌వైరాగ్యం సదా ఉండకపోవడానికి కారణం ఏమిటి? బాప్‌దాదా చూసిన కారణమేమిటంటే, దేహాభిమానం. దేహం అనే మాట అన్నింటిలో వస్తుంది. దేహ సంబంధాలు, దేహ పదార్థాలు, దేహ సంస్కారాలు ఇలా అన్నింటిలో దేహమనేది వస్తుంది మరియు విశేషంగా దేహాభిమానం అనేది ఏ విషయంలో వస్తుంది? ఆ విషయం దేహీ అభిమాని (ఆత్మాభిమానం) నుండి దేహాభిమానంలోకి తీసుకువచ్చేస్తుంది. ఆ విషయం గురించి బాప్‌దాదా పరిశీలన చేస్తే మూల కారణం, పాత సంస్కారాలే క్రిందికి తీసుకు వచ్చేస్తున్నాయి. సంస్కారాలను తొలగించుకున్నారు కానీ ఏదోక సంస్కారం ఇప్పటి వరకు సంస్కార రూపంలో పని చేస్తుంది. ఎలా అయితే దేహాభిమానం యొక్క సంస్కారం స్వతహాగా ఉంటుందో అలాగే దేహీ అభిమానం యొక్క సంస్కారం స్వతహాగా ఉండటంలేదు. మేము సమాప్తి చేసుకున్నాము కానీ బీజాన్ని భస్మం చేసుకోలేదు అని అంటున్నారు. అందువలనే సమయం వచ్చినప్పుడు దేహాభిమానం యొక్క సంస్కారం ప్రత్యక్షం అయిపోతుంది. ఇప్పుడు ఈ దేహాభిమానం యొక్క సంస్కారాన్ని శక్తిశాలి దేహీఅభిమాని శక్తితో వంశ సహితంగా సమాప్తి చేయాలి ఎందుకంటే పిల్లలు అనుకోకుండానే అప్పుడప్పుడు వచ్చేస్తుంది అని అంటున్నారు. ఎందుకు వస్తుంది? అంశం ఉంటే కనుక వంశంగా అయ్యి వస్తుంది. ఇప్పుడు శక్తిస్వరూపంగా అయ్యే అవసరం ఉంది, స్వయాన్ని పరిశీలన చేసుకోండి – ఏ స్వరూపంలో అయినా అంశమాత్రంగా అయినా పాత దేహాభిమానం యొక్క సంస్కారం ఉండిపోలేదు కదా? అని. అది ఉండిపోతే కనుక బేహద్‌వైరాగ్యవృత్తి ద్వారా సమాప్తి అవుతుంది. సేవలను చూసి, విని బాప్‌దాదా సంతోషిస్తున్నారు కానీ ఇప్పుడు బాబాకి ఇదే కోరిక ఉంది, ఎలా అయితే సేవ యొక్క నిశ్చయం మరియు మెరుపు అనుభవం అవుతుందో అలాగే బేహద్‌వైరాగ్యవృత్తి యొక్క ప్రభావం ఉండాలి ఎందుకంటే ఈరోజుల్లో సేవ ద్వారా మీ గౌరవం పెరుగుతుంది, ప్రకృతి మీకు దాసీ అయిపోతుంది. సాధనాలు పెరుగుతాయి కానీ బేహద్‌వైరాగ్యవృత్తి ద్వారా సాధన మరియు సాధనాల యొక్క సమానత ఉంటుంది. ఎలా అయితే మీరు ప్రవృతిలో ఉండేవారికి ఉదాహరణ చెప్తారు కదా, అన్నీ చేస్తూ కర్మయోగిగా, కమలపుష్ప సమానంగా ఉండండి అని.అలాగే మీ అందరికీ కూడా సేవ చేస్తూ, సాధనాలు ఉన్నా కానీ సాధన మరియు సాధనాల సమానత ఉంటుంది.కనుక ఇప్పుడు ఈరోజుల్లో సేవతో ఎడిషన్‌గా బేహద్‌వైరాగ్యవృత్తి యొక్క అవసరం ఉంది. నడుస్తూ, తిరుగుతూ కూడా వీరు విశేషాత్మలు అని అనుభవం చేసుకోవాలి. కేవలం యోగంలో కూర్చున్న సమయంలోనే కాదు మరియు ఉపన్యాసం చెప్పే సమయంలోనే కాదు కానీ నడుస్తూ, తిరుగుతూ కూడా మీ మస్తకం ద్వారా శాంతి, శక్తి, సంతోషం యొక్క అనుభూతి చేయించాలి ఎందుకంటే ఇప్పుడు సమయాను

Created by Universal Document Converter

సారంగా సమయం మారనున్నది. బాప్‌దాదా సమయానుసారంగా సైగ చేస్తున్నారు కానీ ఈరోజు విశేషంగా బేహద్‌వైరాగ్యవృత్తి గురించి సైగ చేస్తున్నారు దీనికొరకు ఇప్పుడు మిమ్మల్ని మీరు పరిశీలన చేసుకుని దేహీఅభిమానానికి విఘ్నమైన దేహాభిమానం అంటే అనేక రకాలైన దేహాభిమానం యొక్క అనుభవం మీకు ఉంది కనుక దానిని పరివర్తన చేసుకోండి మరియు రెండవది, చాలా సమయం గురించి కూడా ఆలోచించండి. చాలా సమయం యొక్క అభ్యాసం ఉండాలి. చాలా సమయం యొక్క పురుషార్థం మరియు చాలా సమయం యొక్క ప్రాప్తి. ఒకవేళ ఇప్పుడు చాలా సమయం యొక్క పురుషార్థంలో ధ్యాస తక్కువ పెడితే అంతిమ సమయంలో చాలా సమయం యొక్క ప్రాప్తిని జమ చేసుకోలేరు. బాగా ఆలశ్యం అనే బోర్డ్ పెట్టబడుతుంది అందువలన బాప్‌దాదా ఈరోజు మరొక సంవత్సరానికి హోమ్‌వర్క్ ఇస్తున్నారు. ఈ దేహాభిమానం అనేది సర్వ సమస్యలకు కారణమవుతుంది మరియు మరలా పిల్లలు రమణీయులు కనుక సమయం వచ్చేసరికి మేము సరైపోతాము అని బాబాకి కూడా నమ్మకం కలిగిస్తున్నారు. బాప్‌దాదా అంటున్నారు, సమయం మీకు టీచరా? సమయానికి సరైపోతాము అని అంటే మీకు టీచర్ ఎవరు అయ్యారు? మీ రచన అయిన సమయం మీకు టీచర్ అవ్వటమనేది బావుంటుందా? అందువలన సమయాన్ని మీరు సమీపంగా తీసుకురావాలి.

ఈరోజు బాప్‌దాదా మాటిమాటి ఇదే సైగ చేస్తున్నారు – స్వయాన్ని పరిశీలన చేసుకోండి, మాటిమాటికి పరిశీలన చేసుకోండి మరియు పరివర్తన చేసుకోండి. చాలా సమయం యొక్క పరివర్తన చాలా సమయం యొక్క ప్రాలబ్దానికి అధికారిగా చేస్తుంది. ఇప్పటివరకు బలహీన పురుషార్థులు అయినా కానీ చివరి నెంబర్ బిడ్డపై కూడా బాబాకి స్నేహం ఉంటుంది. స్నేహం ఉంది కనుకనే బాబా వారిగా అయ్యారు, బాబాని గ్రహించగలిగారు, నా బాబా అని అంటున్నారు అందువలన సమయంపై వదిలేయకండి. సమయం వస్తుంది అనటం కాదు, సమయం యొక్క సంపూర్ణతను మనమే తీసుకురావాలి. బాప్‌దాదా యొక్క విశ్వపరివర్తనా కార్యానికి మీరందరు సహయోగులు. బాబా ఒక్కరే కార్యం చేయరు, పిల్లలతో కలిసి చేస్తారు. బాబా అయితే మొదట పిల్లలు, పిల్లలు ముందు అని అంటారు.ఇప్పుడు ఒకవేళ తర్వాత సంవత్సరం రావాలంటే ఈ హోమ్‌వర్క్ చేసి ఉంచుతారా! అలాగేనా చేతులెత్తండి! మంచిది.వెనుక ఉన్నవారు కూడా చేతులు ఎత్తుతున్నారు.

ఈరోజు సంఖ్య పెరిగిపోయింది కనుక బాప్‌దాదా ఈ బిడ్డకు సైగ చేసారు, చక్రం తిరిగి చూసి రండి, ఎక్కడెక్కడ పడుకున్నారు, ఎలా వరసలో ఉండి భోజనం తింటున్నారు అని. చాలా పెద్ద వరస ఉంది కానీ అందరి ముఖంలో సంతోషం ఉంది.మధువనంలో అయితే ఉన్నారు కదా కానీ ఈ సంతోషాన్ని మధువనంలోనే వదిలి వెళ్ళకూడదు, వెంట తీసుకువెళ్ళాలి. బాప్‌దాదా వతనంలో కూర్చుని మీరందరు నిద్రపోవటం, భోజనం దగ్గర వరసలో నిల్చునే దృశ్యాన్ని చూసారు. ఆ దృశ్యాన్ని చూసి బాప్‌దాదాకి ఎటువంటి సంకల్పం వచ్చిదంటే, ఇప్పుడిప్పుడే బొంతలు, పరుపుల యొక్క వర్షం పడాలి అని కానీ ఇది కూడా ఆనందాల మేళా. బాప్‌దాదా చూసారు, చాలా మంచిగా అందరు ఎక్కడ స్థానం దొరికినా, ఎలా దొరికినా అందరు పాస్ అయ్యారు. చప్పట్లు కొట్టండి కానీ ఈ హోమ్‌వర్క్ మర్చిపోకండి. దీనిలో చప్పట్లు కొట్టడంలేదు. బాప్‌దాదా మరియు విశేషంగా బ్రహ్మాబాబా పిల్లలను మధువనానికి శృంగారం అని అంటారు. మీరందరు మధువనానికి

Created by Universal Document Converter

వచ్చారు మరియు బాప్‌దాదా కూడా సాకారంగా ఇంతమంది పరివారాన్ని చూసి సంతోషిస్తున్నారు. సహించాల్సివస్తుంది కానీ ఈ సహనం సదాకాలికంగా సహనశక్తిని పెంచుతుంది. అందరు సంతోషంగా ఉన్నారు కదా! కష్టమనిపించ లేదు కదా! ఇంత పరివారం ఉన్నా కానీ నీళ్ళు అయితే లభించాయి కదా! అందరు నీటిని ఉపయోగించుకున్నారు కదా! కొద్దిగా తక్కువైతే ధ్యాస పెట్టాల్సి ఉంటుంది కానీ ఈరోజుల్లో గ్రామాలలో త్రాగడానికి కూడా నీరు దొరకటంలేదు కానీ మీకు ఇక్కడ బట్టలు ఉతుక్కోవడానికి కూడా నీరు లభించింది. ఇంత పరివారాన్ని చూసి సంతోషంగా కూడా ఉంటుంది.బాప్‌దాదాకి నషాగా ఉంటుంది, మొత్తం కల్పంలో ఇంత పెద్ద పరివారం ఎవ్వరికీ ఉండరు అని. మంచిది.

ఎవరైతే మొదటిసారి బాప్‌దాదాని కలుసుకోవడానికి వచ్చారో వారు లేవండి. చూడండి, సగం క్లాస్ మొదటిసారి వచ్చినవారే. వెనుక ఉన్నవారు చేతులు ఎత్తండి! నిల్చుని చూడండి. ఎవరైతే మొదటిసారి వచ్చారో వారికి బాప్‌దాదా క్రొత్తజన్మ యొక్క పుట్టినరోజు శుభాకాంక్షలు ఇస్తున్నారు. ప్రజలైతే లక్షలాది శుభాకాంక్షలు చెప్తారు కానీ బాబా కోటానుకోట్ల శుభాకాంక్షలు చెప్తున్నారు మరియు ఇప్పుడే వచ్చినవారికి సదా ఒక అవకాశం ఇస్తున్నారు ఆ అవకాశం ఏమిటంటే –ఇప్పుడే వచ్చినా కానీ ఒకవేళ తీవ్రపురుషార్థం చేస్తే బాప్‌దాదా మరియు డ్రామా వారికి లాస్ట్ సో పాస్ట్, పాస్ట్ సో ఫస్ట్ వెళ్ళే అవకాశం ఇస్తున్నారు. వీరికి కూడా మొదటి నెంబర్ ఇస్తారు. అవకాశం ఉంది కనుక అవకాశదారులుగా అవ్వండి. కేవలం ధ్యాస పెట్టాల్సి ఉంటుంది. మంచిది, మీ అందరికీ కూడా పరివారం యొక్క వృద్ధి మంచిగా అనిపిస్తుంది కదా! ప్రతి జోన్‌లో ఒక టర్న్ తర్వాత మరొక టర్న్ వస్తూ ఉంటే మధువనం నివాసీయులందరు సహయోగి అయ్యారు. మధువనం నివాసీయులందరు మధువనం యొక్క భుజాలు. వీళ్ళందరు మధువనానికి భుజాలు అని దాదీ చెప్తున్నారు.క్రింద ఉన్నా, పైన ఉన్నా, తోటలో ఉన్నా, హాస్పటల్లో ఉన్నా, క్రింద ఆబూ నివాసీయులైనా, పైన ఆబూనివాసీయులైనా అందరు మధువనం యొక్క భుజాలే. బాప్‌దాదా చూసారు, ఈరోజు మధువనం వారు త్యాగం చేసారు. ఇక్కడ కూర్చోవడానికి బదులు ఎవరి స్థానాలలో వారు కూర్చున్నారు కానీ బాప్‌దాదా దూరంగా చూడటంలేదు, బాప్‌దాదా హృదయంలో ఇమిడి ఉన్నట్లుగా చూస్తున్నారు అయినప్పటికీ అలసిపోని సేవాధారులుగా అయ్యి సేవలో సహయోగి అవుతున్నారు కదా! ఈరోజు విశేషంగా మధువనం యొక్క భుజాలందరికీ, విశేషంగా మధువనం నివాసీయులకు శుభాకాంక్షలు ఇస్తున్నారు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు.

చూడండి! 40 సంవత్సరాలు కూడా పూర్తి అవుతున్నాయి. 40 సంవత్సరాలలో సేవా అవకాశం తీసుకున్నవారు ఎంత భాగ్యశాలురు! ఇది సేవ చేయటం కాదు, ఫలం తినటం. బాబా దృష్టిలో, హృదయంలో ప్రతి ఒక బిడ్డ హృదయసింహాసనాధికారి. బాబా మమ్మల్ని చూసారో, లేదో అని ఎవరు అనుకోకండి. బాప్‌దాదా ప్రతి ఒక బిడ్డని దూరదేశంలో ఉన్నా కూడా హృదయసింహాసనాధికారిగా చూస్తారు. వెనుక ఉన్నవారు కూడా వెనుక లేరు బాబా హృదయంలో ఉన్నారు. చాలా మంది ఉన్నప్పటికీ ఎంత శాంతిగా ఉందో చూడండి! ఎందుకు? అందరు స్నేహంలో లీనమై ఉన్నారు. స్నేహశక్తి బాప్‌దాదాని మరియు పరివారాన్ని ఆకర్షిస్తుంది. ఇంత పెద్ద పరివారం శాంతి శక్తితో సంతోషంగా ఉండటమే ఈ శాంతిశక్తి పరివారం యొక్క విశేషత. ఎలాంటి సీట్ దొరికినా కానీ మీరు ఏ సీట్‌లో కూర్చున్నారు? వెనుక ఉన్నారు, ఎదురుగా లేరు

Created by Universal Document Converter

కానీ ఒక్కొక్కరు స్నేహమనే సీట్‌పై కూర్చున్నారు. మధువనం నివాసీయులకు (భుజాలకు కూడా) ఒక్కొక్కరికీ బాప్‌దాదా కోటానుకోట్ల స్నేహం ఇస్తున్నారు. ఈరోజు దాదీలకు మరియు నిమిత్త సహయోగులకు కూడా బాప్‌దాదా అలసిపోనివారిగా అయ్యి సేవ చేసినందుకు శుభాకాంక్షలు ఇస్తున్నారు. వెనువెంట ఈ బిడ్డకు కూడా అంటే ఈ రథానికి కూడా శుభాకాంక్షలు ఇస్తున్నారు. ఈ బిడ్డకు చిన్నతనం నుండి వరదానం ఉంది. ఈ బిడ్డకు ధ్యానం యొక్క వరదానం చిన్నతనం నుండి ఉంది. ఈ బిడ్డలో ఉన్న సరళత మరియు సహనశీలత యొక్క విశేషత కారణంగానే ఈమెకు నిమిత్తంగా అయ్యే పాత్ర లభించింది. ప్రతి ఒక్కరికీ ఎవరి పాత్ర వారిది బావుంది. బాప్‌దాదా దాదీలను సంభాళన చేసే మున్నీ బెహన్, మోహిని బెహన్‌కి కూడా శుభాకాంక్షలు ఇస్తున్నారు మరియు ఎవరైతే నిమిత్తంగా అయ్యారో వారందరికీ కూడా శుభాకాంక్షలు మరియు సేవాస్థానాలలో ఉంటే టీచర్స్‌కి, ఎక్కడి నుండి వచ్చినా ఆ టీచర్స్‌కి అంటే ఎవరి టర్న్ అయితే వారు వస్తారు కదా! కానీ ఎక్కడినుండి వచ్చిన టీచర్స్‌కి అయినా బాప్‌దాదా ఒక విశేష సేవను స్మృతి ఇప్పిస్తున్నారు, ఆ హోమ్‌వర్క్ చేయాలి. టీచర్స్ కొరకు హోమ్‌వర్క్ ఏమిటంటే - టీచర్ సదా బాప్‌దాదాకి సత్యమైన సహయోగిగా, సమీప సహయోగిగా అంటే మీ ద్వారా బాబాని ప్రత్యక్షం చేసేవారిగా ఉండాలి. ఎవరు మిమ్మల్ని చూసినా వీరిని తయారుచేసినవారు ఎవరు! వీరి శిక్షకుడు, సద్గురువు ఎవరు! అనిపించాలి. మిమ్మల్ని చూడకూడదు, బాబాని చూడాలి. ఇప్పుడు ఈ 6-7 నెలలలో ఇదే స్వమానంలో ఉండాలి, ఈ హోమ్‌వర్క్ బాప్‌దాదా అడుగుతారు. ప్రతి ఒక్కరు ఏశాతంలో చేసారు? అని. ఎక్కువ సమాచారాన్ని అడగరు కానీ ఏ శాతంలో హోమ్‌వర్క్ చేసారు? అనేది అడుగుతారు. మీరు కనిపించకూడదు, బాబా కనిపించాలి. దీనిలో అన్ని ధారణలు వచ్చేస్తాయి. మధువనం వారికి కూడా బాప్‌దాదా ప్రియస్మృతులు ఇస్తూనే ఉన్నారు. కానీ మధువనం వారు కూడా అంటే నలువైపుల ఉన్నవారందరు అంటే మధువనం యొక్క ఒక్కొక్క రత్నం బాబాని ప్రత్యక్షం చేయడానికి నిమిత్తం అని భావించాలి. మధువనం వారు సమయమంతా ఇలా మనసాసేవ, కర్మణా సేవ మరియు అందరినీ బాబా సమానంగా చేసే ఉదాహరణగా అయ్యి చూపించాలి. మధువనం వారు బాబాకి బాబా సమానంగా అయ్యే పతం మీలో చూపించారా? అనే ఫలితం ఇవ్వాలి. ప్రతి ఒక్కరినోటి నుండి ఓహో బాబా యొక్క పిల్లలు ఓహో అనే మాట రావాలిమరియు మీరందరు ఏమి చేస్తారు? మీరందరు మిమ్మల్ని మీరు నెంబర్‌వారీగా కాదు నెంబర్‌వన్‌గా అయ్యే ఉదాహరణగా అయ్యి చూపించాలి. నెంబర్‌వారీగా అవ్వటంలో మజా ఉండదు. నెంబర్‌వన్ అవ్వాలి. నెంబర్‌వారీగా అవ్వటమనేది ఏమైనా గొప్ప విషయమా! అందరు విన్ (విజయం) మరియు వన్ యొక్క ఫలితం వినిపించాలి.

నలువైపుల ఉన్న బాప్‌దాదా యొక్క హృదయసింహాసనాధికారి మరియు భృకిటి సింహాసనాధికారి మరియు భవిష్యత్తు యొక్క రాజ్య సింహాసనాధికారి ఇలా బాప్‌దాదా యొక్క ప్రియమైన పదమాపద భాగ్యశాలి పిల్లలకు, సదా తమ నయనాల ద్వారా ఆత్మీయత యొక్క అనుభవం చేయించేవారికి మరియు ముఖం ద్వారా సదా అదృష్టవంతులుగా, మనస్సు సదా సంతోషంలో నాట్యం చేస్తూ ఉండాలి. ఎవరు ఎదురుగా వచ్చినా వీరికి ఉన్న సంతోషం ఎక్కడ లేదు అని అందరు నేర్చుకుని వెళ్ళాలి, ఇలా ప్రతి ఒక బాబా యొక్క పిల్లల ద్వారా బాబా యొక్క , నోటి ద్వారా బాబా యొక్క పరిచయం ఇస్తున్నారు కానీ నయనాల ద్వారా మరియు ముఖం

Created by Universal Document Converter

ద్వారా బాబా యొక్క సాక్షాత్కారం చేయించేవారికి, ఇలా నలువైపుల ఉన్న పిల్లలకు, ఎవరైతే ఉత్తరాలు పంపారో, ఈ- మెయిల్ చేసారో, అవన్నీ బాప్‌దాదా దగ్గరికి చేరుకున్నాయి. మీరు చేయగానే ఆ సమయంలోనే బాబా దగ్గరికి చేరిపోయాయి. ఎదురుగా కర్చున్న వారి కంటే ముందుగా మీరు ఏ సమయంలో చేసారో ఆ సమయంలోనే చేరిపోయాయి. అందువలనే చాలా, చాలా శుభాకాంక్షలు. దేశ, విదేశాలలోఉన్న పిల్లలందరికీ బాబా హృదయపూర్వక స్నేహానికి బదులు ఇస్తున్నారు. నలువైపుల ఉన్న పిల్లలకు బాప్‌దాదా కోటానుకోట్ల హృదయపూర్వక పాలన మరియు హృయపూర్వకమైన ప్రేమను ఇస్తున్నారు మరియు అందరికీ నమస్తే చెప్తున్నారు. మంచిది.

## సర్వ ఖజానాలతో సంపన్నమై మీ ముఖం మరియు నడవడిక ద్వారా అలౌకికతను సాక్షాత్కారం చేయించండి ....25-10-09

ఈరోజు సర్వ ఖజానాల దాత, ఖజానాలకు యజమానులైన తన పిల్లలను చూస్తున్నారు. ప్రతి ఒక్క బిడ్డ సర్వ ఖజానాలతో సంపన్నం ఎందుకంటే బాబా పిల్లలందరికీ ఒకేవిధంగా, ఒకే సమయంలో సర్వ ఖజానాలను ఇచ్చారు. కనుక బాప్‌దాదా తన యొక్క పిల్లలు మరియు యజమానులను కలుసుకునే టందుకు వచ్చారు. పిల్లలు పిలిచారు మరియు తండ్రి పిల్లలపై గల స్నేహంతో వచ్చారు. ఖజానాలు అయితే చాలా ఉన్నాయి, అన్నింటికంటే మొదటి ఖజానా జ్ఞానధనం; ఈ జ్ఞానధనంతో మీరు సంపన్నం అయిపోయారు మరియు మహాదానియై ఇతరులకు కూడా పంచిపెడుతున్నారు. ఈ జ్ఞాన ఖజానాతో ఆత్మ ఏదైతే భిన్న భిన్న బంధనాలలో చిక్కుకుపోయిందో ఆ బంధనాలన్నింటి నుండి ముక్తులయ్యారు. బంధనయుక్తుల నుండి బంధనముక్తులు అయ్యారు. దీంతో పాటు యోగం అనగా స్మృతి ఖజానా; దీని ద్వారా అనేక శక్తులను పొందారు. అదేవిధంగా ధారణ ద్వారా సర్వ గుణాల అనుభూతి అనగా ఖజానా లభించింది. మరియు ధారణా శక్తి ద్వారా సర్వుల స్నేహశక్తి, సర్వులకు ప్రియంగా, అతీతంగా అయ్యే శక్తి యొక్క ఖజానా ప్రాప్తించింది. సర్వుల స్నేహ ఖజానాను అనుభవం చేసుకున్నారు. ఇలా సర్వ ఖజానాలతో పాటు మరొక విశేష ఖజానా ఉంది; అది సంగమయుగం యొక్క సమయం. ఏ ఆత్మకి అయితే సమయం యొక్క ఖజానా యొక్క గొప్పతనం తెలుసో ఆ ఆత్మ సదా అనేక ప్రాప్తులకు యజమాని అవుతుంది. ఎందుకంటే సంగమయుగి సమయం చాలా తక్కువ కానీ సమయం కంటే ప్రాప్తులు ఎక్కువ. అన్నింటికంటే ఎక్కువ సంగమయుగి శ్రేష్టాతి శ్రేష్ట ప్రాప్తి ఏమిటంటే స్వయం భగవంతుడు తండ్రి రూపంలో, శిక్షకుని రూపంలో, సద్గురువు రూపంలో ప్రాప్తిస్తారు. సంగమయుగంలో చిన్న జన్మలో 21 జన్మల ప్రాప్తి లభిస్తుంది, దీనిలో తనువు, మనస్సు, ధనం, జనం అన్ని ప్రాప్తులు ఉంటాయి. మరియు 21 జన్మలు పూర్తిగా ప్రాప్తిస్తాయి, సగం కాదు, పావు వంతు కాదు పూర్తిగా 21 జన్మలు గ్యారంటీ. అన్నింటికంటే ఎక్కువ గొప్పతనం సంమయుగి సమయం, సంగమయుగం యొక్క ఒకొక్క సెకండు అనేక సంవత్సరాలతో సమానం. అయితే చెప్పండి సర్వఖజానాలతో సంపన్నులేనా? సంపన్నులే కదా? అందువలన బాప్‌దాదా సదా సమయం యొక్క స్మృతిని ఇప్పిస్తున్నారు. కొంతమంది పిల్లలు అనుకుంటున్నారు - ఒకటి, రెండు నిమిషాలు ఏదైనా ఆలోచిస్తే ఏమవు

Created by Universal Document Converter

నిమిషాలే కదా అని అనుకుంటున్నారు. కానీ ఈ సమయానికి ఎంత గొప్పతనం ఉందో దాని అనుసారంగా రెండు నిమిషాలు రెండు గంటలు కాదు, రెండు సంవత్సరాలతో సమానం. సంగమయుగి సమయానికి ఇంత గొప్పతనం ఉంది. సర్వ ఖజానాల యొక్క, సర్వ గుణాల యొక్క, పరమాత్మ ప్రేమ యొక్క, బ్రాహ్మణ పరివారం యొక్క ప్రేమ, కల్పపూర్వపు ఈశ్వరీయ హక్కు ఇవన్నీ ప్రాప్తించేది ఈ చిన్న యుగంలోనే.మరే యుగంలోను ఈ సర్వప్రాప్తులు ఉండవు. రాజ్య భాగ్యం ఉంటుంది, మీ అందరి రాజ్యం ఉంటుంది, సుఖం, శాంతి అన్నీ ఉంటాయి కానీ పరమాత్మ కలయిక, అతీంద్రియ సుఖం, బ్రాహ్మణ పరివారం, ఆది మధ్యాంత జ్ఞానం ఇవన్నీ కేవలం సంగమయుగంలోనే లభించాయి, ప్రతి కల్పం లభిస్తూ ఉంటాయి.

అయితే బాప్‌దాదా ప్రతి ఒక్కరి ముఖం ద్వారా ఖజానాలను ఎంత వరకు జమ చేసుకున్నారో చూస్తున్నారు. ఖజానాలు అయితే లభించాయి కానీ ప్రతి ఒక్కరు జమఖాతాను ఎంత పెంచుకున్నారు అనేది ప్రతి ఒక్కరి ముఖం మరియు నడవడిక ద్వారా కనిపిస్తుంది. మీరందరు కూడా నేను ఎంత వరకు జమ చేసుకున్నాను అని ఎవరికి వారే తెలుసుకోవచ్చు. ఇప్పుడు బాప్‌దాదా యొక్క మనస్సులో ఆశ ఏమిటంటే ఖజానాలు అయితే లభించాయి కానీ ఇప్పుడు వాటిని కేవలం వర్ణించే సమయం కాదు మీ ముఖం మరియు నడవడిక వాటిని ప్రత్యక్షంగా అనుభవం చేయించాలి – ఈ ఆత్మలు ఎవరో విశేషమైనవారు, అతీతులు మరియు పరమాత్మకి ప్రియులు అని ఎందుకంటే ముమ్ముందు సమయం పరివర్తన అవుతుంది కనుక కేవలం వర్ణించటం ద్వారా మీ సేవ జరగదు, సమయం ప్రమాదకరంగా ఉంటుంది కనుక ఎక్కువ సమయాన్ని ఎవరూ కేటాయించలేరు కానీ ఖజానాలతో సంపన్నమైన మీ ముఖం ద్వారా, నడవడిక ద్వారా మీ అలౌకికత దూరం నుండే సాక్షాత్కారం అవుతుంది. ఇప్పుడు ఇటువంటి పురుషార్ధాన్ని ప్రత్యక్షం చేయండి. బ్రహ్మాబాబాని చూడండి సంఘటన మధ్యలో ఉన్నా కానీ దూరం నుండే వ్యక్తిత్వం యొక్క మెరుపు అనుభవమయ్యేది. అదేవిధంగా ఇప్పుడు విశేషంగా డబల్ విదేశీయులను బాప్‌దాదా డబల్ పురుషార్ధి అని అంటున్నారు. బాప్‌దాదా ఈరోజు నిమిత్త డబల్ విదేశి పిల్లలను చూసి సంతోషిస్తున్నారు. వృద్ధి కొరకు చాలా మంచి పురుషార్ధం చేస్తున్నారు. పాలన కూడా అందరికీ చాలా మంచిగా లభిస్తుంది. నిమిత్తమైన ఆత్మలతో బాప్‌దాదాకి ఒక విషయం మంచిగా అనిపిస్తుంది అదేమిటంటే ప్రతి సంవత్సరం సర్వాత్మలు సంఘటనగా విశేషంగా మధువనంలో కలుసుకుంటారు ఎందుకంటే మధువనం యొక్క వాయుమండలం యొక్క తాజాదనం చాలా సహయోగమిస్తుంది. ఇక్కడ ఒకటే భాద్యత – స్వ పరివర్తన. మనసాసేవకు, ఒకరికొకరి అనుభవాలకు మంచి అవకాశం దొరుకుతుంది. కనుక బాప్‌దాదా ఈ విషయానికి శుభాకాంక్షలు ఇస్తున్నారు.

ఇప్పుడు మీ మీ స్థానాలకు వెళ్ళి కొంచెం అద్భుతం చేయండి. బాబాకి ప్రియమైన కొంచెం అతీతస్థితి ప్రత్యక్షంలో అనుభవం చేయించాలి. దాని ద్వారా మధువనపు తాజాదనం యొక్క సహయోగం అక్కడ కూడా అనుభవం చేసుకుంటారు. ఈరోజు విశేషంగా డబల్ పురుషార్ధీ గ్రూపు యొక్క మిలనం. భారతదేశంలోని పిల్లలకు మీరంటే ఎంతో ప్రేమ అందుకే మొదటి మిలనం యొక్క అవకాశం మీకు ఇచ్చేస్తారు. మొదటి అవకాశం తీసుకున్నందుకు మొదటి నెంబరు తీస్కోవాలి. మంచిగా అనిపిస్తుంది, డబల్ విదేశీయులు లేదా డబల్ పురుషార్ధీలు బాబా యొక్క ఒక పేరుని ప్రత్యక్షం చేశారని ఇంతకు ముందు కూడా చెప్పాను. విదేశాలలో చాలా వైపుల

Created by Universal Document Converter

నుండి బాబా పిల్లలను వెతికి తీసి వారి అదృష్ట చిత్రాన్ని తయారుచేశారు. అందువలన సంలగ్నతతో నలువైపుల శ్రమ చేస్తున్నారు. దాని ద్వారా బాబా యొక్క విశ్వకళ్యాణకారి కర్తవ్యాన్ని ప్రసిద్ధి చేశారు. అందువలన బాప్‌దాదా ప్రతీ ఒక్కరికీ ఓహో! పిల్లలూ ఓహో! అని శుభాకాంక్షలు ఇస్తున్నారు. భారతదేశంలో ఇప్పుడు కూడా మూలమూలలా బాబా సందేశాన్నిచ్చే సేవ జరుగుతూ ఉంది అదేవిధంగా అక్కడ కూడా మిగిలిపోయిన దేశాలలో సందేశాన్ని ఇవ్వాలనే ఉత్సాహ ఉల్లాసాలు ఉన్నాయి ఎందుకంటే సమయంపై నమ్మకం లేదు. బాప్‌దాదా ముందునుండే చెప్పారు అకస్మాత్తుగా ఏదైనా జరగవచ్చు అందువలన సందేశమివ్వటం మరియు మీ ఉన్నతి ఏదైనా ఇప్పుడిప్పుడే, ఎప్పుడో కాదు. బాప్‌దాదా చెప్పారు - వాస్తవానికి బ్రాహ్మణుల నిఘంటువులో అప్పుడప్పుడు అనే పదం బావుండదు, ఇప్పుడిప్పుడే సంకల్పం చేశారు, చేయవలసిందే. చేస్తాం, చూస్తాం ఇలాంటి మాటలు అనకూడదు. కనుకనే మీ మమ్మా కూడా ఇదే లక్ష్యం పెట్టుకున్నారు మరియు స్మృతి ఇప్పించేవారు - ఇప్పుడు లేకున్నా మరెప్పుడు లేదు.

అయితే డబల్ పురుషార్థి పిల్లలు ఇప్పుడిప్పుడే చేసేవారా లేక ఎప్పుడో చేసేవారా? ఇప్పుడిప్పుడే చేసి చూపించేవాళ్ళం అనేవారు చేతులెత్తండి. చేయవలసిందే, చేయవలసిందే. చేస్తాము కాదు, చేయవలసిందే. గుర్తు ఉంచుకోండి, మీ చార్ట్ మీరే పెట్టుకోండి. బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు - ప్రతిరోజు రాత్రి మీ రోజంతటి చార్ట్ చెప్పి తర్వాత మీ బుద్ధిని ఖాళీ చేసుకుని నిద్రించటం ద్వారా నిద్ర కూడా బాగా వస్తుంది మరియు రోజూ సమాచారాన్ని ఇవ్వటం ద్వారా మరుసటి రోజు, బాబాకి నేను నా గురించి చెప్పాను అనే స్మృతి సహయోగాన్నిస్తుంది. ధర్మరాజుపురికి వెళ్ళనవసరం లేదు. ఇచ్చేశారు కదా మరియు పరివర్తన చేసుకున్నారు కనుక ధర్మరాజుపురి నుండి తప్పించుకుంటారు. సంవత్సరాల విషయం వదిలేయండి, తక్కువలో తక్కువ ఎంత సమయంలో వీలైతే అంత తక్కువ సమయంలో తయారవ్వండి, ముఖం ద్వారా, నడవడిక ద్వారా కనిపించాలని బాబా యొక్క ఆశ ఏదైతే ఉందో ఆవిధంగా ప్రత్యక్షంలో చేసి చూపించండి. ధైర్యం ఉందా, ఉంటే చేతులెత్తండి. ధైర్యం ఉందా? ఉందా ధైర్యం? మంచిది, శుభాకాంక్షలు. బాప్‌దాదా ప్రతి ఒక్కరిలో నిశ్చయం మరియు ధైర్యం యొక్క ఉత్సాహ ఉల్లాసాలు ఇప్పుడిప్పుడే చూస్తున్నారు.కానీ వెళ్తూ వెళ్తూ విమానంలో కొంచెం తక్కువ అవ్వకూడదు,పెంచుకుంటూ ఉండాలి. దృఢ సంకల్పం అనే తాళంచెవిని బాప్‌దాదా ఇచ్చారు, దానిని సదా జాగ్రత్తగా ఉంచుకోండి. చేయవలసిందే, చేస్తాం, చూస్తాం.... ఇలా అనకూడదు. అటువంటి ఇప్పుడు గడిచిపోయింది. అయిపోతుంది, అవ్వవలసిందే. అయిపోతుందిలే అనకూడదు, అవ్వవలసిందే. బాప్‌దాదా ఇచ్చిన డబల్ పురుషార్థి అనే టైటిల్‌ని గుర్తు ఉంచుకోండి. బాప్‌దాదా ఫలితం విన్నారు, బాప్‌దాదా ఇచ్చిన సేవాప్లాన్‌లో భారత దేశీయులు కూడా తక్కువ చేయలేదు. విదేశీయులు కూడా తక్కువ చేయలేదు. ఈ వరదానాన్ని ఎక్కువ స్థానాలలో ఉత్సాహ ఉల్లాసాలతో చేశారు. మరియు ప్రతి స్థానం యొక్క వేర్వేరు ఫలితం కూడా వస్తుంది. కనుక బాప్‌దాదా భారతదేశీయులకు మరియు విదేశీ పిల్లలకు ప్రత్యక్షంలోకి తీసుకువచ్చినందుకు పదమాపదమాల శుభాకాంక్షలు ఇస్తున్నారు.

ఇప్పుడు ఈ సంవత్సరంలో విశేషంగా ఏ విషయం ప్రత్యక్షంలోకి తీసుకురావాలో చెప్పాను; ఇప్పుడు ఎవరు చూసినా కానీ ముఖంలో మెరుపు కనిపించాలి, ప్రత్యక్షతకు నిమిత్తమవ్వాలి, బాబాని ప్రత్యక్షం చేయాలంటే ఏమి చేయాలి? సదా సర్వులూ ఉండీ ముఖం కలిగి ఉండాలి

Created by Universal Document Converter

ఏదో చింతనలో ఉన్నట్లు లేదా ఏదో అలజడిలో ఉన్నట్లు ఉండకూడదు. బాప్‌దాదా చెప్పారు కదా – ఇప్పుడు రెండు మాటలను గుర్తు పెట్టుకోండి – 1. మాయకు గెట్ అవుట్ సూచన ఇవ్వండి 2. మిమ్మల్ని మీరు అతిథి గృహంలో (గెస్ట్ హౌస్) ఉన్నట్లు అనుభవం చేసుకోండి. ఈ ప్రపంచం మీది కాదు, అతిథి గృహం, ఇప్పుడు ఇంటికి వెళ్ళవలసిందే. ఇంటి దృశ్యాలు మనస్సులో, బుద్ధిలో కనిపించాలి. అప్పుడు స్వతహాగానే ఇల్లు రానేవస్తుంది. ఇప్పుడు ఇంటికి తిరిగి వెళ్ళాలి అని మీ పాట ఒకటి ఉంది కదా! కనుక ఇప్పుడు భారతీయులు అయినా, విదేశీయులు అయినా ఈ అనుభవాన్ని ప్రత్యక్షంగా చేసుకుని చూపించండి. బేహద్ వైరాగ్యం రావాలి, అతిథి గృహంతో మనస్సు తగుల్కోదు. వెళ్ళిపోవాలి, వెళ్ళిపోవాలి అనే గుర్తుంటుంది. బేహద్ వైరాగ్యం ఏ రకమైన అనగా మనస్సు యొక్క సంకల్పాలను లేదా పరస్పర సంఘటనలో వచ్చే మాయా విఘ్నాలను ఒక్కసారిగా సమాప్తం చేసేస్తుంది. మాయా తుఫానులు మీ కొరకు కానుకగా (గిఫ్ట్) అయిపోతాయి. వచ్చే చిన్న పెద్ద పరీక్షలు పరీక్షలుగా అనిపించవు, అనుభవాన్ని పెంచేటందుకు సహాయపడినట్లుగా (లిఫ్ట్) అనిపిస్తాయి. గిఫ్ట్ మరియు లిఫ్ట్. అర్థమైందా!

ఇప్పుడు లక్ష్యం పెట్టుకోండి – బేహద్ వైరాగ్యం మరియు ధైర్యం, ఉత్సాహ ఉల్లాసాలనే రెక్కలతో ఎగురుతూ ఉండండి మరియు ఎగిరింప చేయండి. ఇప్పుడు ఎగిరే సమయం. రెక్కలు బలహీనం అవ్వటం లేదు కదా అని సదా పరిశీలించుకుంటూ ఉండండి. బాప్‌దాదా డబల్ విదేశీయులు చేసిన విస్తారం గురించి సంతోషిస్తున్నారు కానీ ఇప్పుడు ఏమి చూడాలను కుంటున్నారు? ప్రతి ఒక్క బిడ్డ బాబా సమానంగా సంపన్నంగా మరియు సంపూర్ణంగా, సర్వ ఖజానాలతో సంపన్నంగా మరియు లభించే ప్రతి శ్రీమతంలో సంపూర్ణంగా చూడాలను కుంటున్నారు. ఇష్టమేనా? ఇష్టమైతే చప్పట్లు కొట్టండి. మంచిది. ఈ చప్పట్లను ప్రతి రోజు గుర్తు పెట్టుకోవాలి. మీ అంతట మీరే మనస్సులో చప్పట్లు మ్రోగించుకోవాలి. బయటకి కాదు, మనస్సులో మ్రోగించుకోవాలి. ఇది హోమ్‌వర్క్. మంచిది.

**నలువైపుల ఉన్న తీవ్ర పురుషార్థిలకు, ధైర్యం, ఉత్సాహ ఉల్లాసాలతో ఎగిరేవారికి, నడిచేవారిగా కాదు ఎగిరేవారికి, నలువైపుల ఉన్న బాబా సమానంగా సంపన్నంగా మరియు సంపూర్ణంగా తయారయ్యేవారికి, బాప్‌దాదా యొక్క హృదయసింహాసనాధికారులకు, సదా బాబాని కంబైండ్ రూపంగా అనుభవం చేసుకునే మరియు సహయోగం తీసుకునే బాబా యొక్క ప్రతి గారాభ, స్నేహి పిల్లలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.**

Created by Universal Document Converter

# స్వరాజ్యం యొక్క ఫలితాన్ని పరిశీలించుకుని స్వయాన్ని పరివర్తన చేసుకోండి మరియు అఖండ రాజ్యాధికారి అవ్వండి .....15-11-09

ఈరోజు మనోభిరాముడైన బాబా తన ప్రియమైన పిల్లలను కలుసు కునేటందుకు వచ్చారు. ఎందువలన ప్రియమైనవారు? పిల్లలైన మీరు ప్రతి ఒక్కరు మూడు సింహాసనాలకు యజమానులు, తెలుసా? 1. స్వరాజ్యం యొక్క సింహాసనం 2. బాప్‌దాదా యొక్క హృదయ సింహాసనం 3.భవిష్య సింహాసనం. మూడు సింహాసనాలకు అధికారులు. భవిష్య సింహాసనం గురించి కూడా ఇప్పుడే అభ్యాసం చేస్తున్నారు. భవిష్య తయారీలు లేదా పురుషార్ధం ఇప్పుడే చేస్తున్నారు. ఇప్పటి పురుషార్ధం అనేక జన్మలకు రాజ్యభాగ్యాన్ని ఇప్పించేది. ఈ సమయంలోనే రాజ్యభాగ్యం యొక్క సంస్కారాన్ని ధారణ చేస్తున్నారు ఎందుకంటే ఇప్పటి పురుషార్ధమే భవిష్య రాజ్యాధికారిగా తయారుచేస్తుంది. అయితే ఆరకంగా మీ పురుషార్ధం యదార్ధంగా ఉందా? పరిశీలించుకోండి. భవిష్యత్తులో ఒకే రాజ్యం ఉంటుంది అలాగే మనస్సులో ఒకే రాజ్యం నడుస్తుందా? పురుషార్ధంలో ఒకే రాజ్యం ఉందా? లేక రాజ్యంలో మాయ విఘ్నం వేస్తుందా? ఒకే రాజ్యానికి బదులు మాయా ప్రభావం పడటం లేదు కదా? రెండు రాజ్యాలు లేవు కదా? భవిష్యత్తు యొక్క విశేషతయే - ఒకే రాజ్యం. ఇప్పటి అభ్యాసమే భవిష్యత్తులో నడుస్తుంది. అయితే పరిశీలించుకోండి, ఇప్పుడు స్వరాజ్యం, ఈ స్వరాజ్యంలో మాయ ప్రవేశించటం లేదు కదా? రెండు రాజ్యాలైతే లేవు కదా? ఒకవేళ రెండు రాజ్యాలు నడుస్తుంటే కనుక ఒకే రాజ్యం యొక్క సంస్కారాన్ని ఎప్పుడు నింపుకుంటారు? భవిష్యత్తు యొక్క విశేషతయే ఒకే రాజ్యం, ఒకే ధర్మం. ధర్మం ఏమిటి? మీ యొక్క విశేష ధారణ ఏమిటి? సంపూర్ణ పవిత్రత; అయితే ఒకే ధర్మం ఉందా? మాయ మధ్యలో ప్రవేశించటం లేదు కదా? అని పరిశీలించుకోండి. ఒకరి నియమం మరియు ఆజ్ఞయే ఉందా లేక మాయ మధ్యలో ప్రవేశిస్తుందా? ఒకని రాజ్యమే నిర్విఘ్నంగా నడుస్తుందా? మరోవిషయం ఏమిటంటే ఆ రాజ్యంలో సుఖశాంతులు సదా సహజంగా ఉంటాయి. అయితే ఇప్పుడు మీ రాజ్యంలో సదా సుఖశాంతులు ఉన్నాయా? ఎవరూ ప్రవేశించటం లేదు కదా? స్వరాజ్యంలో మాయ ప్రవేశించి అశాంతిని వ్యాపించటం లేదు కదా? స్వరాజ్యంలో ఏదో సౌకర్యం, ప్రశంస యొక్క ప్రభావాన్ని మాయ వేయటం లేదు కదా? సదా సుఖం, శాంతి, ఆనందం, ప్రేమ, అతీంద్రియసుఖం స్థిరంగా ఉంటున్నాయా? ఎందుకంటే మీకు తెలుసు భవిష్య రాజ్యంలో సర్వ ప్రాప్తులు సంపన్నంగా ఉంటాయి కనుక సంతుష్టత కూడా ఉంటుంది. అయితే ఇప్పుడు కూడా స్వరాజ్యం సంపన్నంగా ఉంటుందా లేక ఏదైనా లోటు ఉంటుందా? ఎందుకంటే ఇప్పటి పురుషార్ధంలో లోటు ఉండిపోతే భవిష్య అఖండ రాజ్యానికి అధికారిగా ఏవిధంగా కాగలరు? ఇప్పటి పురుషార్ధంపైనే అంతా ఆధారపడి ఉంది. ఇప్పటి ఏ లోటు అయినా భవిష్యత్తులో సంపూర్ణ రాజ్యాధికారిగా అవ్వనివ్వదు. చాలాకాలం యొక్క స్వరాజ్యం యొక్క అభ్యాసం భవిష్య విశ్వరాజ్యాధికారిగా చేస్తుంది. కనుక సదా ఈ విషయాన్ని మీరు పరిశీలించుకోవాలి. ఎందుకంటే ఒకవేళ ఇప్పుడు చాలాకాలం యొక్క పురుషార్ధం లేకపోతే ప్రాలబ్ధం కూడా తక్కువ లభిస్తుంది అందువలన బాప్‌దాదా ప్రతి సమయం ధ్యాస ఇప్పిస్తున్నారు - దీని కొరకు ఇప్పుడు మిమ్మల్ని మీరు సంపన్నంగా మరియు సంపూర్ణంగా తయారుచేసుకోండి. పురుషార్ధం చేస్తూ ఉన్నాం అని మధ్యమధ్యలో అంటున్నారు కానీ ఆ పురుషార్ధం మధ్యలో

Created by Universal Document Converter

అయిపోతుందిలే, చేసేస్తాం ఇలా అంటే ఈ సంస్కారం 21 జన్మల అవినాశి అఖండ రాజ్యాధికారిగా కానివ్వదు. కనుక బాప్‌దాదా సదాకాలానికి ధ్యాసను ఇప్పిస్తున్నారు, పరిశీలించుకోండి - ఏదైనా విఘ్నం లేదా తుఫాను వస్తే అది కానుకగా అయిపోతుందా? తుఫాను తుఫానుగా కాదు, కానుకగా అయిపోవాలి. ఏ మాయా యుద్ధం అయినా అది మిమ్మల్ని అనుభవీగా తయారు చేస్తుంది. ఆ అనుభవం కూడా ఎలాంటిదంటే మిమ్మల్ని అనుభవంలో మరో మెట్టు ఎక్కిస్తుంది. దీనికొరకు బాప్‌దాదా చెప్తున్నారు మీ చార్ట్ మీరే పరిశీలించుకోండి. ఎంతగా మీ చార్ట్‌ని పరిశీలించుకుంటారో అంతగా పరివర్తన చేసుకుంటారు. అయితే ప్రతి ఒక్కరు మీ మీ చార్ట్‌లను పరిశీలించుకుంటున్నారా? పరిశీలించుకుంటున్నారా? రోజూ పరిశీలించు కునేవారు చేతులెత్తండి! అప్పుడప్పుడు కాదు, రోజూ పరిశీలించు కునేవారు చేతులెత్తండి. రోజూ చార్ట్‌ని పరిశీలించుకోండి మరియు పరివర్తన అవ్వండి ఎందుకంటే సమయం యొక్క సూచన బాప్‌దాదా చాలా సమయం నుండి ఇచ్చారు. సమయాన్ని చూస్తున్నారు కూడా మనుష్యుల మనస్సులో చింత పెరిగిపోతూ ఉంది కానీ మీ మనస్సులో చింత లేదు, ప్రభు చింతన ఉంది. ప్రభు చింతన ఉన్న కారణంగా సదా మీకు తెలుసు మేము నిమిత్తం మరియు నిర్మానం, చేసి చేయించేవారు బాబా. దీని కారణంగా మీ మనస్సులో చింత ఉండదు. చేసి చేయించేవారు చేయిస్తున్నారు ఈ స్మృతి సదా ముందుకి తీసుకు వెళ్తుంది.

ఇప్పుడు విశేషంగా ప్రతి ఒక్కరు ఇది పరిశీలించుకోవాలి - ఈ సంగమయుగం యొక్క ఒకొక్క సెకండు, సమయం మరియు సంకల్పం శుభంగా నడుస్తున్నాయా? ఈ సమయం యొక్క గొప్పతనాన్ని తెలుసుకుని ఒక్క సెకండు సెకండు కాదు కానీ ఒక్క సెకండుకి ఎంతో విలువ, గొప్పతనం ఉంది. అప్పుడప్పుడు పిల్లలు అంటున్నారు - సంకల్పాలు నడిచాయి కానీ రెండు, నాలుగు నిమిషాలే అని, కానీ సంగమయుగి సమయానికి విలువ ఉంది, ఇప్పుడు ఒక సెకండు ఒక గంటతో సమానం. ఈ సమయం యొక్క విలువ అంతటిది ఎందుకంటే బాప్‌దాదా చెప్పేశారు అకస్మాత్తుగా ఏ సమయంలోనైనా మీకు అంతిమ పరీక్ష ఉంటుంది. బాప్‌దాదా కూడా చెప్పరు అందువలన ఈ సమయంలో సంపన్నంగా, సంపూర్ణంగా అవ్వటంపై ధ్యాస పెట్టాలి. బాప్‌దాదా ఇచ్చిన ఖజానాలన్నింటినీ ఒకొక్క ఖజానాని సమయానుసారం ఉపయోగించాలి. మీరు ఖజానాలకు యజమానులు, యజమాని యొక్క విశేషత ఏమిటంటే ఏ సమయంలో ఏ ఖజానా అవసరమో ఆ సమయంలో ఆ ఖజానాను ఉపయో గించటం. అలా ఉపయోగిస్తున్నారా? ఇముడ్చుకునేశక్తిని మీరు ఆజ్ఞాపిస్తే ఆ శక్తి కార్యంలోకి వస్తుందా? ఎందుకంటే యజమాని అని ఎవరిని అంటారంటే సమయానికి తమ ఖజానాలను ఉపయోగించగలవారిని. కనుక ఇప్పుడు అందరూ స్వయంపై ఇంత ధ్యాస పెట్టాలి. అందరిలో సంతోష ఖజానా ముఖం మరియు నడవడిక ద్వారా కనిపించాలి. సంతోషం అనేది అవినాశి తండ్రి ఇచ్చినది. అవినాశి తండ్రి ఇచ్చిన దానిని అవినాశిగా ఉంచు కోండి. సంతోషం గురించి చెప్తారు - సంతోషానికి మించిన ఆహారం ఏదీ లేదు, సంతోషానికి మించిన ఖజానా మరేదీ లేదు. కనుక ఎవరిలో సదా సంతోషం ఉంటుందో వారి నయనాల ద్వారా, ముఖం ద్వారా, నడవడిక ద్వారా అది స్వతహాగానే కనిపిస్తుంది. బాప్‌దాదా ఇచ్చే వరదానం ఏమిటంటే సదా సంతోషంగా ఉండండి మరియు సదా సంతోషాన్ని పంచండి ఎందుకంటే సంతోషాన్ని పంచటం ద్వారా సంతోషం పెరుగుతుంది. మీ ఇతర ఖజానా అయినా పంచటం

Created by Universal Document Converter

ద్వారా తరిగిపోతుంది కానీ సంతోష ఖజానా పంచే కొలదీ పెరుగుతుంది. అయితే పరిశీలించుకోండి – సంతోష ఖజానా సదా స్థిరంగా ఉంటుందా?

ఇప్పుడు దేశీయులు అయినా, విదేశీయులు అయినా పిల్లలందరికీ బాప్‌దాదా ఒక విషయం గురించి శుభాకాంక్షలు ఇస్తున్నారు. ఆ విషయం ఏమిటి? దేశంలో కానీ, విదేశాలలో కానీ పిల్లలందరు ఉత్సాహ ఉల్లాసాలతో ఆత్మలకు బాబా సందేశాన్ని ఇచ్చేశారు. అందరూ తమకు తాము సంతోషంతో కార్యం చేశారు, ప్రతి చోట ఒక కార్యక్రమం చేశారు కానీ దానికి వేయిరెట్లు ఫలాన్ని పొందారు. సమయప్రమాణంగా ముస్ముందు పరిస్థితులు మరింత ప్రమాదకరం అయిపోతాయి. అందువలన బాప్‌దాదాకి ఉన్న సంకల్పం ఏమిటంటే ఏ గ్రామం నుండి అయినా, ఏ మూల నుండి అయినా నింద రాకూడదు, మన తండ్రి వచ్చేశారు కానీ మాకు సందేశం ఇవ్వలేదు అని. అందరూ ఉత్సాహ ఉల్లాసాలతో చేశారు దానికి బాప్‌దాదా సంతోషం కానీ అలాగే పరస్పరం కలిసి ఇటువంటి కార్యక్రమాలు చేస్తూనే ఉండాలి. బాప్‌దాదా చూశారు – అందరూ తమ తమ ధైర్యం, ఉత్సాహ ఉల్లాసాలను ఉపయో గించారు, ఇప్పుడు అందరూ చాలా బాగా చేశారు, కానీ ఇక ముందు కూడా సమయప్రమాణంగా లక్ష్యం పెట్టుకోండి – ఏ మూల కూడా సందేశం అందకుండా మిగిలిపోకూడదు. దీనిలో మీ పురుషార్థం కూడా బాగుంటుంది మరియు ఆత్మల కళ్యాణం కూడా జరుగుతుంది. అందరికీ ఈ కార్యక్రమం బాగా అనిపించింది కదా! అందువలన బాప్‌దాదా పిల్లలందరికీ మాటిమాటికీ చెప్తున్నారు – ఆత్మల పట్ల దయా హృదయులు అవ్వండి. ఈరోజుల్లో దు:ఖం, అశాంతి కారణంగా అందరూ మనస్సుతో దయ చూపండి! దయ చూపండి! అని అంటున్నారు. అయితే బాబాకి తోడు పిల్లలైన మీరే కనుక బాబా పిల్లల ద్వారా దయాహృదయుల పాత్రను చూడాలనుకుంటున్నారు. దు:ఖమయ ప్రపంచం మారి సుఖమయ ప్రపంచం రావాలని మీ అందరికీ ఉల్లాసం ఉంది కదా! అందువలన సుఖమయ ప్రపంచం రావడానికి దు:ఖం, అశాంతి వినాశనం అవ్వడానికి పరిస్థితులు మారుతున్నాయి. మీ రాజ్యాన్ని సమీపంగా తీసుకువస్తూ నడవండి. మంచిది.

బాబాని కలుసుకోవడానికి మొదటిసారిగా వచ్చిన పిల్లలు చేతులెత్తండి. మంచిది, చాలామంది ఉన్నారు. కొంచెం లేచి నిల్చోండి. శుభాకాంక్షలు. సమాప్తికి ముందుగా చేరుకున్నారు. క్రొత్త జన్మ తీసుకున్నారు. ఈ విషయం గురించి ఇప్పుడు వచ్చిన పిల్లలందరికీ బాప్‌దాదా మరియు నలువైపుల ఉన్న పిల్లలందరి ద్వారా శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. బ్రాహ్మణపరివారాన్ని చూసి సంతోషంగా అనిపిస్తుంది కదా! కానీ ఇప్పుడు వచ్చిన వారందరికీ బాప్‌దాదా చెప్తున్నారు – ఇప్పుడు చాలా సమయం గడిచిపోయింది, చాలా కొంచెం సమయం మిగిలి ఉంది అందువలన తీవ్ర పురుషార్థం చేయాలి. తీవ్ర పురుషార్థులు ముందుకి వెళ్ళిపోతారు, నడవటం కాదు, ఎగరాలి. ఎగిరేకళ యొక్క పురుషార్థం చేస్తే ఆలస్యంగా వచ్చినా కానీ బాబా నుండి పూర్తి వారసత్వం యొక్క హక్కుని పొందగలరు. ప్రతి సెకండు సంతోషంగా ఉండాలి మరియు అందరికీ సందేశాన్ని ఇవ్వాలి. మంచిది.

**నలువైపుల ఉన్న తీవ్ర పురుషార్థులకు, ప్రతి సమయం బాప్‌దాదాని తోడుగా చేసుకుని కంబైండ్‌గా ఉండే అభ్యాసిగా ఉండే పిల్లలకు బాప్‌దాదా విశేషంగా వరదానం ఇస్తున్నారు సదా ఎగురుతూ వెళ్ళండి మరియు ఇతరులకు కూడా ఎగిరే సహాయాన్ని ఇచ్చి ఎగిరింపచేయండి.**

Created by Universal Document Converter

అందరూ విజయీలు, విజయానికి ఫలంగా ప్రతి సమయం బాప్‌దాదా నుండి ఆశీర్వాదాలు ప్రాప్తిస్తాయి. కనుక అమరంగా అయ్యి అందరికీ అమృతాన్ని త్రాగించండి. నలువైపుల ఉన్న పిల్లలందరు బాప్‌దాదా ఎదురుగా ఉన్నారు. ప్రతి ఒక్కరిపై బాప్‌దాదాకి మనస్ఫూర్వక ప్రేమ ఉంది ఎందుకంటే ప్రతి ఒక్కరిలో ఏదొక విశేషత ఉంది. ఇప్పుడు సర్వ విశేషతలతో స్వయాన్ని విశేషాత్మగా తయారుచేసుకుని ముందుకి నడవండి. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా బాప్‌దాదా యొక్క కోటానుకోట్ల ప్రియస్మృతులు స్వీకరించండి. నమస్తే.

## బాబాకి మరియు సర్వులకు ప్రియంగా అయ్యేటందుకు సంతుష్టమణియై ప్రతి పరిస్థితి యొక్క ప్రభావం నుండి ముక్తులుగాఉండండి ..... 30-11-09

ఈరోజు నలువైపుల ఉన్న సంతుష్ట ఆత్మలను చూస్తున్నారు. సంతుష్ట మణులు నలువైపుల తమ యొక్క మెరుపుని వెదజల్లుతున్నారు, అన్నింటికంటే ఉన్నతోన్నతమైన స్థితి సంతుష్ట స్థితి. సదా సంతుష్టంగా ఉండేవారు బాబాకి అయితే ప్రియమే కానీ సర్వులకి కూడా ప్రియమనిపిస్తారు. ఎవరికైతే సర్వప్రాప్తులు ఉంటాయో వారే సదా సంతుష్టంగా ఉండగలరు. ప్రాప్తులకు ఆధారం సంతుష్టత అందువలన ఇటువంటి ఆత్మలు బ్రాహ్మణాత్మలందరికీ కూడా ప్రియమనిపిస్తారు. సర్వ ప్రాప్తులు అంటే సదా సంతుష్టం. సంతుష్ట ఆత్మ యొక్క ప్రభావం వాయుమండలంపై కూడా పడుతుంది. సర్వ ప్రాప్తులు పరమాత్మ ఇచ్చినవి. పరమాత్మ తండ్రి ద్వారా సర్వ శక్తులు, సర్వ గుణాలు, సర్వ ప్రాప్తులను పొందిన ఆత్మ సదా సంతుష్టంగా ఉంటుంది. సంతుష్ట ఆత్మ యొక్క స్థితి సదా ప్రగతిశీలంగా ఉంటుంది. సంతుష్ట ఆత్మపై పరిస్థితి ప్రభావం వేయలేదు ఎందుకంటే ఎక్కడ సంతుష్టత ఉంటుందో అక్కడ సర్వశక్తులు, సర్వగుణాలు స్వతహాగానే వచ్చేస్తాయి. ఒక సంతుష్టత అనేక గుణాలను తీసుకువస్తుంది. అయితే నేను సంతుష్ట ఆత్మగా ఉంటున్నానా? అని ప్రతి ఒక్కరు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. సంతుష్ట ఆత్మ సదా సర్వులకు మరియు బాబాకి సమీపంగా మరియు సమాన స్థితిలో ఉంటుంది. కానీ ఈ స్థితిలో ఉండేటందుకు చాలా సాక్షి స్థితి కావాలి, త్రికాలదర్శి స్థితి కావాలి. త్రికాలదర్శి అంటే ప్రతి కర్మ, ప్రతి విషయం యొక్క మూడుకాలాలను పరిశీలించి కర్మ చేసేవారు. దీనికొరకు రెండు విషయాలు అవసరం. ఆ రెండు విషయాలు సంబంధం మరియు సంపద. సంబంధం కూడా అవినాశి మరియు సంపద కూడా అవినాశి, ఇవి ప్రాప్తించేది అవినాశి తండ్రి ద్వారా. ఎప్పుడైతే అవినాశి సంబంధం మరియు సంపద ప్రాప్తిస్తాయో అప్పుడు ఆత్మ సదా సంతుష్టంగా ఉంటుంది. బాబాకి మరియు సర్వాత్మలకు కూడా అతిప్రియం అయిపోతుంది. ఏ పరిస్థితి అయినా మాయా రూపంగా వస్తే భయపడరు, బేహద్ తెరపై మిక్కీమౌస్ ఆట జరుగుతుంది అని భావిస్తారు. అలజడి అవ్వరు, ఆ మిక్కీమౌస్ ఆటను చూసి ఉల్లాసంగా ఉంటారు. మాయ యొక్క భిన్న భిన్న రూపాలను భిన్న భిన్న మిక్కీమౌస్ రూపాలుగా అనుభవం చేసుకుంటారు. ఇటువంటి స్థితి యొక్క అనుభవం బాబా ద్వారా సర్వులు ప్రాప్తింప చేసుకోవలసిందే మరియు చేసుకున్నారు కూడా. బాప్‌దాదా చూస్తున్నారు - నిర్భయంగా, ఏకాగ్రబుద్ధితో ఏ పరిస్థితిలోను అలజడి అవ్వటం లేదు. ఇటువంటి ప్రతి విజయీ ఆత్మ పల్ల

Created by Universal Document Converter

సదా బాబాకి సదా ఉండే శుభ ఆశ ఏమిటంటే ప్రతి ఒక్కరు సదా విజయీ అయ్యి బాబాకి తమ యొక్క విజయీ స్వరూపాన్ని చూపించాలి. అయితే నేనెవరు? అని ప్రతి ఒక్కరు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు - ఇప్పటి సమయానుసారంగా అప్పుడప్పుడు అనే మాటను బ్రాహ్మణ నిఘంటువు నుండి తొలగించండి అని. బాబా నుండి సదాకాలిక వారసత్వాన్ని తీసుకోవాలంటే, ప్రతి ప్రాప్తి సదా ప్రాప్తించాలి. ఎందుకంటే బాబా హృదయంలో ఆశలను పూర్తి చేసే ఆశాదీపాలు. అటువంటి వారి సంకల్పంలో కూడా అప్పుడప్పుడు అనే మాట రాలేదు, ఎందువలన? సదా బాబాతో పాటు తోడుగా ఉంటారు. తోడుగా ఉండేవారు కూడా మరియు తోడై విశ్వపరివర్తనా కార్యం చేసేవారు కూడా.

అయితే చెప్పండి; సదా అనే వరదానాన్ని బాప్‌దాదా ద్వారా ప్రాప్తింప చేసుకున్నారా? జన్మ తీసుకుంటూనే బాప్‌దాదా ప్రతి ఒక్కరికీ సదా యోగి భవ! పవిత్ర భవ! అనే వరదానాన్ని ఇస్తారు. ఆ వరదానం ద్వారా ప్రాప్తులన్నీ సదాకాలికంగా లభిస్తాయి. అప్పుడప్పుడు కాదు. కనుక పిల్లలందరూ సదాకాలానికి అధికారులు ఎందుకంటే బాబాకి ప్రతి ఒక్క పిల్లవాడిపై చివరి పిల్లవాడు అయినా కానీ ప్రతి ఒక్కరిపై మనస్ఫూర్వక ప్రేమ ఉంటుంది. ఎందుకంటే గొప్ప గొప్ప వారు ఉన్నారు, వారు తమని తాము తెలివైనవారిగా భావిస్తారు అటువంటి వారు కూడా బాబాని గ్రహించలేకపోయారు కానీ చివరి పిల్లవాడు అయినా కానీ గ్రహించారు మరియు మనస్ఫూర్తిగా నా బాబా అని అంటారు అందువలన బాబాకి ప్రతి ఒక్కరిపై అవినాశి ప్రేమ ఉంటుంది, ప్రతి ఒక్కరికీ బాబా యొక్క వరదానం లభిస్తుంది. పిల్లలు నెంబరువారీగా ఉన్నా కానీ ప్రతి రోజు బాప్‌దాదా ఒకే సమయంలో ఒకే వరదానాన్ని పిల్లలందరికీ ఇస్తారు. ప్రతి ఒక్కరు నెంబరువారీగా ఉంటారు కానీ నా బాబా అన్నారంటే చాలు వరదానానికి అధికారి అయిపోయారు. భారతదేశంలో ఉంటున్నా, విదేశాలలో ఉంటున్నా; ఎక్కడ ఉంటున్నా కానీ ప్రతి ఒక్కరికీ వరదానం ఒకే తండ్రి నుండి లభిస్తుంది మరియు ఆ వరదానాన్ని పొంది పిల్లలు సంతోషిస్తున్నారు కూడా. కానీ పిల్లలు రెండు రకాలుగా ఉన్నారు. 1. వరదానం ద్వారా తప్పకుండా సంతోషపడతారు కానీ నా వరదానం ఇది అని కేవలం వర్ణించటం లేదా సంతోషపడటమే కాకుండా వరదానాన్ని ఫలవంతం చేసుకున్నవారే మొదటినెంబరు. మొదటి నెంబరు పిల్లలు వరదానం నుండి లాభం పొంది వరదానంతో ఫలం పొందుతారు. బీజం ఉంది కానీ బీజాన్ని ఫలవంతం చేసుకోకపోతే కేవలం సంతోషం మాత్రమే ఉంటుంది. వరదానం నుండి ఫలం పొందడానికి ఏమి చేయాలంటే బీజాన్ని ఫలవంతం చేయాలంటే దానిని నాటి నీరు, సూర్యరశ్మి మొదలైనవి అందించాలి అప్పుడే ఫలాలు వస్తాయి అదేవిధంగా ఇక్కడ కూడా ప్రతి ఒక్కరు వరదానం నుండి ఫలం పొందాలి, దాని ద్వారా విస్తారం అవుతూ ఉండాలి, తమ మనస్సులోనే వరదానం యొక్క ఫలంతో వృద్ధి జరగాలి దాని కొరకు బాబా చెప్తున్నారు - వరదానం నుండి ఫలం పొందాలంటే ఆ వరదానాన్ని మాటిమాటికీ స్మృతిలోకి తెచ్చుకోండి. స్మృతి స్వరూప స్థితిలో స్థితులవ్వండి. మాటిమాటికి స్మరణ కాదు, స్మృతిలోకి తెచ్చుకోవాలి, ఫలానికి నీరు అందించటం అంటే ఇదే. ఇక స్వరూపంలో స్థితులవ్వటమే సూర్యరశ్మిని అందించటం. ఇలా వరదానం ఫలవంతం అవ్వటం ద్వారా స్వయంలో కూడా చాలా శక్తి నిండుతుంది మరియు ఆ ఫలం ద్వారా ఇతరులకు కూడా శక్తిని అనుభవం చేయించగలరు. అయితే ఇప్పుడు బాప్‌దాదా ఏమి కోరుకుంటున్నారు? బాప్‌దాదా కొంతకాలంగా సమయం

Created by Universal Document Converter

గురించి హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరి చదువు యొక్క ఫలితం అకస్మాత్తుగా రానున్నది, అందువలన సదా ఎవరెడీగా ఉండాలి. దాంతో పాటు బాప్‌దాదా ఇస్తున్న మరో సూచన ఏమిటంటే ఇప్పుడు ఎగిరేకళ యొక్క తీవ్ర పురుషార్ధం చేసే సమయం ఇది. నడుస్తున్నాం కాదు, ఎగురుతున్నాం అనాలి. మీ దినచర్యను సాధారణ పద్ధతిలో గడపడం, సాధారణ పురుషార్ధం చేయటం ఆరోజులు వెళ్ళిపోయాయి అందువలన బాప్‌దాదా సూచిస్తున్నారు – ప్రతి సెకండు మరియు ప్రతి సంకల్పాన్ని పరిశీలించుకోండి. ఒకవేళ మీరు తీవ్ర పురుషార్ధం చేయకుండా ఒక గంట సాధారణ పురుషార్ధంలో ఉన్నారనుకోండి ఆ గంటలో అకస్మాత్తుగా అంతిమ పరీక్షా సమయం వచ్చేసిందనుకోండి అంతిమతి సోగతి కనుక ఆ ఒక గంట సాధారణ పురుషార్ధం ఎంత నష్ట పరుస్తుంది! అందువలన బాప్‌దాదా ప్రతి ఒక్కరికీ ప్రతి సంకల్పం, ప్రతి సెకండు సమయం యొక్క గొప్పతనం గురించి ప్రతి సమయం సూచిస్తున్నారు. అలజడి సమయంలో అచంచలంగా ఉండే పురుషార్ధం తీవ్రపురుషార్ధులే చేయగలరు. సాధారణ పురుషార్ధులు ఎవరెడీగా అవ్వటంలోనే సమయాన్ని గడిపేస్తారు. బాప్‌దాదా చెప్పారు – సెకండులో బిందువు అనగా ఫుల్‌స్టాప్ పెట్టాలి అని కానీ మీకు తీవ్ర పురుషార్ధం లేనట్లయితే ఏమవుతుంది? అనుభవీలు. బిందువుకి బదులు ప్రశ్నార్ధకం అయిపోదు కదా! బిందువు ఎంత సహజంగా ఉంటుంది, ప్రశ్నార్ధకం ఎంత వంకరగా ఉంటుంది? బిందువు బిందువే అవ్వాలి కానీ కామా (,) అవ్వకూడదు, ఆశ్చర్యార్ధకం (!) అవ్వకూడదు. ఏమి చేయను? అని ఆలోచించుకునే సమయం కూడా ఉండదు. ఇంత తీవ్ర పురుషార్ధం చేయటమే పరీక్షలో పాస్ అవ్వటం అని ఎవరూ అనుకోలేరు కూడా.

బాప్‌దాదా చూశారు – ఇప్పుడు కూడా కొంతమంది పిల్లల రోజంతటి చార్ట్‌లో కారణంగానైనా లేదా అకారణంగానైనా ఎందుకు, ఏమిటి, ఏవిధంగా, ఈవిధంగా... అనే మాటలు ఉన్నాయి. ఎక్కువమంది చార్ట్‌లో బాప్‌దాదా చూసింది ఏమిటంటే వ్యర్ధ సంకల్పాల అల సమయాన్ని ఉపయోగించు కుంటుంది. వ్యర్ధం యొక్క వేగం ఎంత తీవ్రంగా ఉందంటే సాధారణ సంకల్పాలు ఒక గంటలో వస్తే , తీవ్రసంకల్పాలు ఒక నిమిషంలో వస్తున్నాయి. అందువలన ఈరోజు సర్వులకి ప్రియమైన మరియు బాప్‌దాదాకి ప్రియమైన సంతుష్ట ఆత్మలు ఎవరెవరు? అని చూస్తున్నారు. సంతుష్ట ఆత్మలకు సంకల్పంలో లేదా స్వప్నంలో కూడా ఎందుకు, ఏమిటి అనే భాష రాదు ఎందుకంటే ఆ ఆత్మకు మూడు విషయాలు అనగా ఆత్మ, పరమాత్మ మరియు డ్రామా యొక్క మూడు బిందువులు సమయానుసారం కార్యంలో ఉపయోగిస్తారు. ఎందుకంటే అటువంటి సమయంలో శక్తుల యొక్క ఖజానా అవసరం. ఏ సమయంలో ఏ శక్తిని ఆజ్ఞాపిస్తే ఆ సమయంలో ఆ శక్తి హాజరైపోవాలి అటువంటి వారే మాస్టర్ సర్వశక్తివంతులు. కావలసింది సహనశక్తి అయితే ఎదుర్కొనేశక్తి హాజరైతే ఎలా; అది కూడా ఒక శక్తియే కానీ ఆ సమయంలో అది పనికిరాదు. అయితే సర్వఖజానాలకు తాళంచెవి – మీరు, బాబా మరియు డ్రామా అనే మూడు బిందువులు. అయితే బాప్‌దాదాకి ఒక సంకల్పం ఉంది, చెప్పమంటారా? చేయవలసి ఉంటుంది మరి. చేయడానికి తయారుగా ఉన్నవారు చేతులెత్తండి. చేయవలసి ఉంటుంది. చేయవలసి ఉంటుంది. చేతులు ఎత్తుతున్నారు. మనస్సు యొక్క చేతిని ఎత్తుతున్నారా లేక శరీరం యొక్క చేతిని ఎత్తుతున్నారా? మనస్సు యొక్క చేయి అయితే పక్కాగా ఉంటుంది. సమయానుసారంగా బాప్‌దాదా ప్రతి ఒక్కరిపై ఒక శుభ ఆశ పెట్టుకుంటున్నారు – 15 రోజుల తర్వాత మరలా బాబా మిలనం ఉంటుంది

Created by Universal Document Converter

కదా, ఈ మధ్యలో గల 15 రోజులు ఒక విశేష అభ్యాసాన్ని ట్రయల్‌గా చేసి చూడండి, వాస్తవానికి అయితే సదా ఉండాలి కానీ 15 రోజులు ట్రయల్ వేసి చూడండి మరియు మీ మీ కనెక్షన్‌లో ఉన్న సెంటర్స్ వారిచే కూడా చేయించండి, అన్నీ తిరిగి లేదా ఫోన్ చేసి అయినా వారికి గుర్తు చేయండి హోమ్‌వర్క్ చేస్తున్నారా? అని. అయితే హోమ్‌వర్క్ ఏమిటి? సులువైనదే, ప్రతి ఒక్కరు భిన్న భిన్న పరిస్థితులను, విషయాలను దాటుతున్నారు కానీ ఈ 15 రోజులు ప్రతి ఒక్కరు సంకల్పం, వాణి మరియు కర్మలో తక్కువలో తక్కువ 80 శాతం మార్కులు పొందాలి. 20 శాతం బాప్‌దాదా అవకాశమిస్తున్నారు. అంగీకారమేనా? సరేనా? ఇవ్వనా! ఈ పని ఇవ్వనా! మంచిది, 15 రోజులు చేయాలి, మాయ కూడా వింటుంది. విషయాలైతే వస్తాయి కానీ విషయాలను చూడకూడదు, పాస్ అవ్వాలి, ఇది గుర్తు ఉంచుకోవాలి. 15 రోజులంటే పెద్ద విషయమేమి కాదు, ప్రతి ఒక్కరు బాప్‌దాదాతో సత్యమైన హృదయం, స్వచ్ఛమైన హృదయంతో సంకల్పం, వాణి మరియు కర్మలో పాస్ అయ్యి చూపించండి. చూపించగలరా? టీచర్స్ చెప్పండి, ఇది అవుతుందా? 15 రోజులంటే చాలా సహజం, ట్రయల్ వేయమని బాప్‌దాదా చెప్తున్నారు. సంకల్పం కూడా వ్యర్థం కాకూడదు, యుద్ధం చేయకూడదు, విజయీ అవ్వాలి. 15 రోజులు సంపూర్ణ విజయీ. కష్టమా లేక సహజమా? సహజం అనేవారు చేతులెత్తండి. సహజమేనా? అయితే బాప్‌దాదా ఈ 15 రోజుల ఫలితం చూస్తారు. ఆ తర్వాత పెంచుతారు. 15 రోజులంటే ఎవరైనా కానీ చేయగలరు కదా! చేయగలరు కదా! మధువనం వారు చెప్పండి, మధువనం వారు చేతులెత్తండి. బాగా ముందు మధువనం వారు కూర్చున్నారు. చాలా మంచివారు. విదేశీయులు, భారతీయులు అందరూ చేయాలి. గ్రామాల్లోని వారు, పట్టణాల్లోని వారు అందరూ 15 రోజులు రికార్డు పెట్టుకోవాలి. ఏమిటి, ఎందుకు అనకూడదు; విషయం అటువంటిది ఏమి చేయము అని చెప్పకండి. 80 శాతం మార్కులు తీసుకోవలసిందే. అయినా కానీ బాప్‌దాదా 20 శాతం తేలికగా వదిలేస్తున్నారు. ఎందుకంటే బాప్‌దాదా చూస్తున్నారు అక్కడక్కడ నడుస్తూ నడుస్తూ మాయ సోమరితనం, నిర్లక్ష్యం రూపంలో వస్తుంది, ఇది, అది అని చెప్పటం సూక్ష్మ సోమరితనం, ఈ సోమరి తనం తీవ్ర పురుషార్థంలో లోటు తీసుకువస్తుంది. ఎందుకంటే ఇప్పుడు బాప్‌దాదా విద్యార్థులందరితో ప్రతి ఒక్కరితో ముందుగా 15 రోజులు అభ్యాసం చేయించి కొంతకాలం ఈవిధంగానే అభ్యాసం చేయించాలని అనుకుంటున్నారు.

**నలువైపుల ఉన్న బాప్‌దాదా యొక్క ఆశలను పూర్తి చేసే ఆశాదీపాలకు, ఎందుకు, ఏమిటి అనే భాషకు అతీతంగా ఉండేవారికి, సదా ఏకీరసంగా ఉండేవారికి, సదా ఒక్క బాబా తప్ప మరెవ్వరు లేరు, బాబాతోనే జీవితం యొక్క విశేష మూడు సంబంధాలైన తండ్రి, టీచరు, సద్గురువును అనుభవం చేసుకునేవారికి, తండ్రి నుండి వారసత్వం, టీచరు నుండి చదువు యొక్క వారసత్వం మరియు సద్గురువు నుండి వరదానాల యొక్క వారసత్వాన్ని ప్రాప్తింప చేసుకునే భాగ్యశాలి పిల్లలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.**

Created by Universal Document Converter

**పరివారంలో ప్రీతిని నిలుపుకునేటందుకు జ్ఞాన సాగరులై బాబా సమానంగా సాక్షి స్థితి యొక్క స్థితిలో స్థితులవ్వాలి. బాబా, స్వయం, డ్రామా మరియు పరివారం నాల్గింటిలో నిశ్చయబుద్ధి అయ్యి విజయీ అవ్వాలి ..... 15-12-09**

ఈరోజు సమర్ధ తండ్రి తన సమర్ధ పిల్లలను చూస్తున్నారు. ఎందుకంటే ప్రతి ఒక్కరు స్నేహంతో బాబా సమానంగా అయ్యేటందుకు చాలా సంలగ్నతతో పురుషార్ధం చేస్తున్నారు. బాప్‌దాదా పిల్లలను చూసి సంతోషిస్తున్నారు. ఓహో పిల్లలూ! ఓహో!! అని పిల్లల యొక్క పాట మనస్సులో పాడుకుంటున్నారు. ఎందుకంటే పిల్లలు బాబా యొక్క శిరోకిరీటాలు. చూడండి, పిల్లల యొక్క పూజ రెండు రూపాలలో జరుగుతుంది, తండ్రి యొక్క పూజ ఒకే రూపంలో జరుగుతుంది. అంటే పిల్లలు తండ్రి ద్వారా తండ్రికంటే ముందుకి వెళ్తున్నారు. అందువలన పిల్లల యొక్క పురుషార్ధం చూసి బాప్‌దాదా సంతోషిస్తున్నారు. నెంబరువారీగా ఉన్నారు కానీ పురుషార్ధం యొక్క లక్ష్యం ముందుకి తీసుకు వెళ్తుంది. ఈరోజు అమృతవేళ నలువైపుల ఉన్న పిల్లలలో జ్ఞానానికి పునాది అయిన ఒక విషయాన్ని చూశారు. పునాది - నిశ్చయం. నిశ్చయబుద్ధి విజయంతి! అని అంటారు. కనుక మీ అందరి నిశ్చయాన్ని చూశారు. అందరికీ నెంబరువారీగా బాబాపై నిశ్చయం అయితే ఉంది, దానికి గుర్తు - అందరూ బాబాని గ్రహించి, బాబావారిగా అయ్యారు మరియు బాబాని కలుసుకునేటందుకు ఇక్కడికి కూడా వచ్చారు. ప్రతి ఒక్క బిడ్డకు తండ్రిపై తెగిపోని నిశ్చయం ఉంది కానీ ఇతర నిశ్చయాలు కూడా పక్కాగా ఉండాలి. అవి ఏమిటంటే స్వయంపై నిశ్చయం దాంతో పాటు డ్రామాపై నిశ్చయం మరియు పరివారంపై నిశ్చయం ఈ నాలుగు విషయాలలో పక్కాగా ఉండటం అంటే నిశ్చయబుద్ధి విజయంతిగా అవ్వటం. అయితే ఈ నాలుగు నిశ్చయాలలో పక్కాగా ఉన్నానా అని పరిశీలించుకోండి. బాబా గురించి అయితే అందరూ నా బాబా మరియు నేను బాబావాడిని అని అంటారు. బాబాని నావారు అని తండ్రి యొక్క పూర్తి అధికారాన్ని పొందారు. సదా తండ్రి ద్వారా అధికారి అయ్యి ఖజానాలకు అధికారులు అయిపోయారు. దీంతోపాటు స్వయంపై కూడా నిశ్చయం తప్పక ఉండాలి. ఎందుకు? ఒకవేళ స్వయంపై నిశ్చయం లేకపోతే బలహీనం అయిపోతారు. స్వయంపై నిశ్చయం అంటే నేను బాబా ద్వారా స్వమానధారిని, స్వరాజ్యాధికారిని, స్వయంగా బాబా ఎన్ని స్వమానాలు ఇచ్చారో అని ఒకొక్క స్వమానాన్ని స్మృతిలోకి తీసుకురండి అప్పుడు నషా ఎంత పెరుగుతుందో! ఈరోజుల్లో ఎవరికైనా ఏదైనా బిరుదు లభిస్తే అది కూడా తమ భాగ్యంగా భావిస్తారు కానీ పిల్లలైన మీకు ఒకొక్క స్వమానాన్ని ఎవరు ఇచ్చారు? స్వయంగా బాప్‌దాదా ప్రతి ఒక్క బిడ్డను స్వమానధారిగా తయారుచేశారు. ఒకొక్క స్వమానాన్ని గుర్తు చేసుకుంటూ సంతోషంలో ఎగురుతున్నారా? స్వయంలో కూడా సదా నిశ్చయం యొక్క నషా ఇంతగా ఉండాలి. నేను తండ్రి ద్వారా స్వరాజ్యాధికారిని, స్వమానధారిని, కోట్లలో కొద్దిమందిలో ఒక ఆత్మను అనుకోవాలి. బాబాపై నిశ్చయం ఎలాగైతే ఉందో వెనువెంట స్వయంపై కూడా నిశ్చయం అవసరం, ఎందుకంటే స్వయంపై నిశ్చయం ఉంటే ఎక్కడ నిశ్చయం ఉంటుందో అక్కడ ప్రతి కర్మలో నిశ్చయబుద్ధి అంటే స్వమానధారి విజయీగా ఉంటారు. నిశ్చయం యొక్క అర్ధమే సఫలత. మాకు బాబాపై నిశ్చయం ఉంది అని అనటం కాదు, బాబాపై ఉంది చాలా మంచిది, కానీ నేనెవరు? అని స్వయం యొక్క నషా కూడా

Created by Universal Document Converter

అవసరం. ఒకొక్క స్వమానాన్ని జ్ఞాపకం చేస్కోండి, అప్పుడు నిశ్చయం మరియు నషా మీ నడివడిక మరియు ముఖంలో కనిపిస్తుంది మరియు కనిపిస్తూ ఉంటుంది. వీటితో పాటు మూడవ విషయం-డ్రామాపై నిశ్చయం కూడా చాలా అవసరం, ఎందుకంటే డ్రామాలో సమస్యలు కూడా వస్తాయి మరియు సఫలత కూడా వస్తుంది. డ్రామాపై పక్కా నిశ్చయం ఉంటే డ్రామా యొక్క నిశ్చయంతో నిశ్చయబుద్ధిగా ఉన్నవారు సమస్యను సమాధానరూపంలోకి మార్చేసుకుంటారు. ఎందుకంటే నిశ్చయం అంటే విజయం. ఎవరిపై విజయీగా అవుతారు? పరివర్తన చేయటంలో. ఒక్క సెకండులో సమస్య పరివర్తన అయిపోయి సమాధాన రూపంలో అయిపోతుంది. అలజడిలోకి రారు, అచంచలంగా ఉంటారు ఎందుకంటే డ్రామా యొక్క జ్ఞానంతో స్థిరంగా, అచంచలంగా తయారవుతారు. కల్పపూర్వం కూడా నేనే సమాధాన స్వరూపంగా అంటే సఫలత ఆత్మగా అయ్యాను, ఇప్పుడు అయ్యాను మరలా కల్పంతర్వాత కూడా నేనే అవుతాను అనే నిశ్చయం ఉంటుంది. ఈ నషా డ్రామాపై నిశ్చయాన్ని పక్కా చేయిస్తుంది. నేను అయ్యాను, ఇప్పుడు నేనే, మరలా కూడా నేనే అవుతాను అనే నషా, గర్వం ఉంటుంది. అందువలన ఈ పురుషార్థి జీవితంలో డ్రామాపై నిశ్చయం కూడా అవసరం. ఇక నాల్గవది పరివారంపై నిశ్చయం. ఎందుకంటే తండ్రి వస్తూనే పరివారాన్ని ఉత్పన్నం చేశారు. కనుక బాబాపై నిశ్చయం ఎలాగైతే ఉందో పరివారంపై నిశ్చయం కూడా అవసరం. పరివారం ఎవరిది? ఇంత పెద్ద పరివారం వేరెవరికైనా ఉంటుందా? కనుక పరివారంపై నిశ్చయం కూడా చాలా అవసరం. ఇంత పెద్ద పరివారం విశ్వంలో ఎవరికైనా ఉంటుందా? మీ అంత పరివారం విశ్వంలో ఎవరికైనా ఉందేమో పరిశీలించండి. ఏ దైవీ తండ్రికి పరివారం రూపంలో ఎవరూ ఉండరు, అక్కడ శిష్యులు ఉంటారు, ఇక్కడ పరివారం. సేవలో మరియు సంబంధంలో పరివారంతో పాటు ఉంటారు. మాకు అయితే బాబాతోనే కనెక్షన్, పరివారంతో లేకపోతే ఏమయ్యింది అని అనకూడదు. పరివారంపై నిశ్చయం 21 జన్మలు నడుస్తుంది. తెలుసు కదా! పరివారంతో సంబంధంలోకి వస్తేనే నేను ఇంత పెద్ద పరివారంలో అందరితో నిశ్చయబుద్ధి అయ్యి నడుస్తున్నాను అని తెలుస్తుంది. పరివారంలో నడవడానికి పరివారంలో ప్రతి ఒక్కరి సంస్కారం రకరకాలుగా ఉంది మరియు ఉంటుంది అనే విషయంపై ధ్యాస ఇవ్వవలసి ఉంటుంది. మీ స్మృతిచిహ్నం - మాల. మాలలో కూడా చూడండి, ఎక్కడ మొదటి నెంబరు, ఎక్కడ 108వ నెంబరు. ఎందుకంటే పరివారంలో భిన్న భిన్న సంస్కారాలు ఉంటాయి. ఇంత పెద్ద పరివారంలో నడుస్తూ, ఒకొక్కరి సంస్కారాలను అర్థం చేసుకుంటూ, ఒకే పరివారంగా, ఒకే బాబా యొక్క ఒకే రాజ్యంగా ఒకటై నడవాలి. ఎలా అయితే పరివారం ఎంత పెద్దదో అలాగే పరస్పరంలో అంత విశాలహృదయం, ప్రతి ఒక్కరి పట్ల శుభ భావన, శుభకామన యొక్క స్థితిలో స్థితులై నడవాలి. ఎందుకంటే పరివారం మధ్యలోనే స్వభావ సంస్కారాలు వస్తాయి. పరివారంతో ఏమిటి, బాబాతో ఉంది అని కొందరు అనుకుంటారు కానీ ఇక్కడ ధర్మం మరియు రాజ్యం రెండింటి స్థాపన జరుగుతుంది. కేవలం ధర్మమే కాదు, వచ్చినటువంటి ఇతర ధర్మపితలకు కేవలం ధర్మమే ఉంటుంది, రాజ్యం ఉండదు. ఇక్కడైతే మీరందరు కూడా రాజ్యం చేయాలి. అయితే రాజ్యంలో పరివారం అవసరం ఉంటుంది మరియు 21 జన్మలు భిన్న భిన్న రూపాలతో పరివారంతో పాటే ఉండాలి, పరివారాన్ని వదిలి ఎక్కడికీ వెళ్ళలేరు. బాబాకి తెలుసు, నాకు తెలుసు బాబాతోనే పని అని అనుకోకూడదు. ఒకవేళ ఈ నాలుగు నిశ్చయాలలో ఒక నిశ్చయం

Created by Universal Document Converter

అయినా తక్కువగా ఉంటే అలజడిలోకి వచ్చేస్తారు. బాబా అయితే శక్తినిచ్చేవారు కానీ మీతో పాటు ఉండేవారు ఎవరు? సాకారంలో పరివారమే తోడు. బాబా చూశారు, ఎక్కువమంది మూడు నిశ్చయాలలో మంచిగా నడుస్తున్నారు కానీ పరివారంలో తోడుని నిలుపుకోవటం, సంస్కారాలను కలుపుకోవటం, ఒకొక్కరినీ కళ్యాణ భావనతో చూడటం మరియు నడవటంలో కొంతమంది పిల్లలు శక్తిననుసరించి ఉంటున్నారు. కానీ బాబా చూశారు, ఎవరైతే పరివారంపై నిశ్చయంలో జ్ఞాన సాగరులై బాబా సమానంగా సదా సాక్షి స్థితిలో స్థితులై పరివారంతో పాటు ఉన్నారో మరియు ఉంటారో వారే మొదటి నెంబరు లేదా మొదటి తరగతిలోకి వస్తారు. కనుక పరిశీలించుకోండి- పరివారంలో భావ, స్వభావాలు కూడా ఉంటాయి, చిన్న చిన్న పొరపాట్లు కూడా ఉంటాయి. పరివారం యొక్క సంబంధంలోనే విఘ్నాలు వస్తాయి కనుక పరివారం యొక్క సంబంధంలో పాస్ అవ్వటం అవసరం. పరివారంలో నడవటంలో ఏదైనా లోపం వస్తే విఘ్నం చిన్నది అయినా, పెద్దది అయినా కానీ విసిగిస్తుంది. పరివారం యొక్క సంబంధంలోనే ఇది ఎందుకు? ఇది ఏవిధంగా? అనేవి వస్తాయి. కనుక ఎందుకు అనుకునే బదులు మేము కలిసి నడవాలి, పరివారంపై ప్రీతిని నిలుపుకోవాలి అనుకోవాలి. ఎందుకంటే ఇది బాబా యొక్క పరివారం, భగవంతుని యొక్క పరివారం, మామూలు పరివారం కాదు. ఓహో బాబా! ఓహో డ్రామా! ఓహో నేను! మరియు ఓహో పరివారం! అనే నషా ఉండాలి. సరేనా? పరిశీలించుకుంటున్నారా? నాల్గింటిలో ఉత్తీర్ణులేనా? నాల్గింటిలో? ఒక్కటి కూడా తక్కువ అవ్వకూడదు, పరిశీలించుకోండి. ఇప్పుడే పరిశీలించుకోండి. ఎందుకంటే విజయీగా అవ్వడానికి సాధనం ఇదే. పరివారం మధ్యలో సంస్కారాలు వస్తాయి కానీ ఆ సంస్కారాలను కలుపుకోవాలి. స్వయం కూడా పరివర్తన చేసుకోవాలి. మరియు పరివారాన్ని కూడా ఇంత ఉన్నత దృష్టితో చూడాలి. బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు, చివరి పిల్లవాడిని కూడా బాప్‌దాదా అతి భాగ్యశాలిగా భావిస్తారు, ఎందుకు? భగవంతుడిని గుర్తించారు, సాధారణ రూపంలో వచ్చిన తండ్రిని గుర్తించారు, పెద్ద పెద్ద మహాత్ములు కూడా గుర్తించలేకపోయారు కానీ బాప్‌దాదా యొక్క చివరి బిడ్డ కూడా నా బాబా అని అంటారు. మనస్సుతో నాబాబా అని అంటారు. బాప్‌దాదా ఇలా చివరి బిడ్డలో కూడా విశేషతను చూసి ఇతర పిల్లలకు ప్రేమను, ప్రియస్మృతులను ఎలా ఇస్తారో అలాగే చివరి బిడ్డకు కూడా ఇస్తారు. కనుక పరిశీలించుకోండి-మూడింటిలో సరిగ్గా ఉన్నారా లేక నాల్గింటిలో సరిగ్గా ఉన్నారా లేక రెండింటిలో, ఒక దానిలో సరిగ్గా ఉన్నారా? పరిశీలించు కున్నారా? చేసుకున్నారా పరిశీలన? బాబా, మీరు, డ్రామా మరియు పరివారం నాల్గింటి నిశ్చయంతో నేను సరిగ్గా ఉన్నాను అని భావించేవారు చేతులెత్తండి. సరిగ్గా ఉన్నారా? మంచిది, సరిగ్గా ఉన్నారు. పరీక్ష పెట్టమంటారా? చేతులెత్తండి. మంచిది, పరివారంలో పాస్ అయిపోయారా? పరివారం యొక్క సంబంధంలోకి రావాలి. ఎందుకంటే పరివారాన్ని వదిలి ఎక్కడికీ వెళ్ళరు, ఉండవలసిందే, నిలుపుకోవలసిందే. అయితే దాంట్లో పాస్ అయ్యారా? వీరు లేకపోతే బావుంటుంది, వీరు ఎందుకు చేస్తున్నారు, ఇది ఎందుకు జరుగుతుంది అని ఎప్పుడైనా ఇలాంటి సంకల్పాలు వస్తున్నాయా? పరివారం యొక్క నషా, నాలుగు నిశ్చయాలు గలవారు ఇలా, అలా అని సంకల్పంలో కూడా అనరు. ఇలా ఎందుకు జరుగుతుంది అని సంకల్పంలోకి వస్తుంది కానీ నన్ను ఆ ఎందుకు, ఏమిటి అనేవి కదపకూడదు, మూడ్‌ని మార్చకూడదు అని అనుకోవాలి. అలాంటి వారిని నాల్గింటిలో పాస్ అని అంటారు.

Created by Universal Document Converter

చేతులైతే ఎత్తారు, బాప్‌దాదాని సంతోష పరిచారు కానీ బాప్‌దాదాకి పరివారం విషయంలో అప్పుడప్పుడు కొన్ని విషయాలు వినవలసి వస్తుంది. చూడవలసి వస్తుంది. పూర్తిగా విశాల హృదయం ఉండాలి, అందరినీ శుభ భావన, శుభ కామనతో సరి చేయాలి ఎందుకంటే ఒకే పరివారం. ఏకీమతంగా నడవాలి మరియు నడిపించాలి. కేవలం నడవటమే కాదు, నడిపించాలి కూడా. అందువలన బాప్‌దాదా ఈ విషయంపై ధ్యాస ఇప్పిస్తున్నారు - పరివారంలో ఏ అలజడిలోనైనా పాస్ అయిపోతున్నారు, వ్యర్థం నడవటం లేదు అనేవారు ఇతరులను కూడా ఆ విధంగా తయారు చేయాలి. ఇప్పుడు మీ మీ సెంటర్స్‌లో ఎంతమంది ఉంటున్నారు, ఎక్కువలో ఎక్కువ 25 నుండి 50 మంది ఉంటు న్నారు. అంతమంది ఉండరు కానీ పెద్ద స్థానం అయితే 50, 60 మంది ఉంటారు, లేదంటే ఎక్కువలో ఎక్కువ 100 మంది ఉంటారు అనుకోండి, అంతమంది ఉండరు కానీ ఉంటారనుకోండి బాప్‌దాదా సేవాకేంద్రాలన్నింటిలో ఉన్న పిల్లలను, చివరి వారిని కూడా తనకు ప్రియమైన వారు అని చెప్తూ నడిపించారు. ఆ ప్రేమకు గుర్తుగా రోజూ బాప్‌దాదా ఏమని ప్రియస్మృతులు ఇస్తారా? మధురాతి మధురమైన అని అంటారు. పులుపుగా ఉండేవారు కూడా ఉంటారని తెలుసు కానీ మధురమైన వారికి, పులుపుగా ఉండేవారిని అని ప్రియస్మృతులో ఎప్పుడైనా ఉన్నారా? వారిని కూడా గారాభమైనవారు అనే అంటారు. కేవలం అనటమే కాదు నా పిల్లలు అని నా వారు అనే భావంతో నడిపిస్తారు. ఎందుకంటే డ్రామాలో, మాలలో అందరూ ఒకే నెంబరు కాదు. ఇది ఫలితం. సంస్కారాలు రకరకాలుగా ఉంటాయి, ఉండాలి కూడా, లేకపోతే అందరూ రాజులు అయిపోతారు. అప్పుడు ప్రజలుగా ఎవరు అవుతారు? రాజ్యం ఎవరిపై చేస్తారు? మంచి ప్రజలు కూడా కావాలి. రాయల్ ప్రజలు కావాలి, రాజధాని కదా! కనుక ప్రతి ఒక్కరు మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి - పరివారంలో ఏ విషయంలోనైనా సంస్కారం చెడుగా ఉంటే నా సంస్కారం ఏమిటి? అని. చెడుని చూసి నా సంస్కారం కూడా చెడుగా అయిపోయిందంటే నేను కూడా చెడుగా అయిపోయినట్లే అనుకోండి. చెడు అనేది మంచిని కూడా మార్చేస్తుంది.

బాబా స్థాపనా సమయంలో 350 - 400 మందిని సంభాళించారు. ఇంతమంది కలిసి ఉన్న పరివారం ఎవరికీ లేదు. వేర్వేరు విధులు అయినప్పటికీ అది విధి మరియు పరివారంలో విధి. మామూలు పరివారం, మామూలు విధి, మామూలు పద్ధతిలో దినచర్య గడపటం కాదు, అతీతమైన మరియు ప్రియమైన పరివారం. వీరు చేశారు కనుకనే ఇలా అయ్యింది, ఇది చేశారు అందుకే ఇలా అయ్యింది అని సాకులు చెప్తున్నారు. బాబా ఎదురుగా వ్యతిరేకత లేదా ఏమిటి? కొంతమంది వెళ్ళిపోయారు కూడా, ఇది వ్యతిరేకత కాదా! అయినా కానీ బాబా అనేవారు - వెళ్ళిపోయిన వారికి ప్రసాదం పంపండి, వారిని పిలిచే ప్రయత్నం చేయండి, సేవ చేయండి, స్మృతి ఇప్పించండి అని. ఇలా నాలుగు నిశ్చయాలలో పాస్ అవ్వాలా లేక మూడింటిలో, రెండింటిలోనా? నెంబర్‌వన్ అవ్వాలి. అందువలనే వినాశనానికి తయారీలు జరుగుతున్నా కానీ వినాశనం ఆగి ఉంది. ప్రకృతి కూడా బాబా దగ్గరకు వస్తుంది. నాకు చాలా భారం అయిపోయింది అని ప్రకృతి కూడా అంటుంది. భారం నుండి ముక్తి అవ్వాలని ప్రకృతి కూడా అనుకుంటుంది. నేను ఇప్పుడు వెళ్ళిపోవాలి, వెళ్ళిపోయే పాత్ర నాది కానీ బ్రాహ్మణ పరివారంలో చిన్న విషయంలో కూడా నాకు తోడుగా అయిపోయే పిల్లలు ఉన్నారు అని మాయ అంటుంది. నన్ను కూర్చోబెడు

Created by Universal Document Converter

తున్నారు అని అంటుంది. ఈ నాలుగు నిశ్చయాలలో శాతం ఉంది కనుకనే మీ రాజ్యాన్ని తీసుకురావడానికి సమయం ఆగుతూ ఉంది. మాయ మరియు ప్రకృతి రెండూ సిద్ధంగా ఉన్నాయి. వాటిని ఆజ్ఞాపించమంటారా, ఇప్పుడు చెప్పండి? పిల్లలు ఎవరెడీ కాకపోతే మాయను మరియు ప్రకృతిని ఆజ్ఞాపించమంటారా? చేయమంటారా? చేయి ఎత్తండి. తయారేనా? మామూలుగా చేయి ఎత్తకండి. పరీక్ష వస్తుంది, వస్తుంది పరీక్ష ఎవరెడీయేనా? బాప్‌దాదాకి ప్రతీ బిడ్డపై ఇదే ఆశ - ఏ విధంగా అనే దానిని తొలగించి ఈవిధంగా చేయండి. ఎలా చేయను, ఎలా అని అనకండి. ఇలా అనండి. ఏమి చేయను కాదు, ఇలా చేయాలి అనాలి. ఈ ఆశను ఎప్పుడు పూర్తి చేస్తారు? ఎంత సమయం కావాలి? ఎందుకంటే అందరూ తయారవ్వాలి. మీరు తయారయ్యారు అని చేతులెత్తారు అయితే మీ పని ఏమిటి? ఒకొక్కరిని మీ సమానంగా తయారు చేయాలి. చేతులెత్తిన వారు ఆవిధంగా తయారు చేయగలరా? పరివారాన్ని తయారు చేయగలరా? ఈ విషయం గురించి చేతులెత్తండి. చేయగలరా? మంచిది, ఎంత సమయా కావాలి? ఎంత సమయం కావాలి? ఒక సంవత్సరమా? ఎంత కావాలి? ఎంత సమయం కావాలి? టీచర్స్ చెప్పండి ఎంత సమయం కావాలి? పాండవులు చెప్పండి. చేయి ఎత్తారు, ఎంత సమయం కావాలి? పరివారం అంటే పరివారంలో సహయోగం ఇవ్వవలసి ఉంటుంది కదా? పరివారంతో త్రెంచుకోకూడదు, వదిలేసి వెళ్ళలేరు, ఉండాల్సిందే ఇక్కడే అయినప్పుడు పరివారాన్ని కూడా తయారు చేయవలసి ఉంటుంది కదా! లౌకికంలో కూడా ఎవరైనా బాగా వృద్ధి అయితే (ఈరోజుల్లో కాదు) ఒకరికొకరు సహయోగి అయ్యి ముందుకి తీసుకువెళ్ళేవారు కదా, గ్రామాన్ని కూడా తమ కుటుంబంగా భావించేవారు. కానీ ఇది అయితే అలౌకిక కుటుంబం ఎందుకంటే గొడవలు లేదా మాయ అనేవి పరివారం విషయంలోనే వస్తాయి, సంబంధంలో వస్తాయి. సంబంధంలోకి వచ్చినప్పుడే వ్యర్థ సంకల్పాలు వస్తాయి. చేయి ఎత్తిన వవారు ఏమంటారు? ఎవరైనా మాట్లాడతారా, మైక్ ఇవ్వండి. (ఈ సీజన్‌లో పూర్తి చేసేస్తాం) ఇలా అనే మిగతావారు చేతులెత్తండి. ఫోటో తీయండి. టీచర్స్, ఈ సీజన్‌లో ఒకరికొకరు సహయోగం ఇచ్చి, ఒకరికొకరు ముందుకి తీసుకెళ్ళి బాబా ఆశను పూర్తి చేస్తారా, సరేనా? చేతులెత్తండి. చేతులెత్తి సంతోషం చేసేశారు. మంచిది. ఒకే బలం, ఒకే నమ్మకం అని బాబా చెప్తున్నారు. ఈ రెండు విషయాలు ఉంటే జరగనిది ఏముంది? బాబా ఎంత కొంచెం సమయంలో స్థాపనా పాత్రను అభినయించారు! ఇప్పుడైతే అందరూ జ్ఞాన సాగరులు అయిపోయారు. డబల్ లైట్‌గా కూడా అయిపోయారు. ఇది కొంచెం ధ్యాస పెట్టవలసిన సబ్జక్టు అని బాప్‌దాదాకి తెలుసు. ఇంతకు ముందు కూడా మీకు పని ఇచ్చాను - తక్కువలో తక్కువ ఒక సెంటర్ అయినా కానీ నిర్విఘ్నంగా అవ్వాలని. సెంటర్ తర్వాత జోన్ అవ్వాలి. జోన్‌ని కూడా వదిలేయండి, ఒక పట్టణం అనుకోండి, ఢిల్లీ, అహ్మదాబాద్, కలకత్తా, ఇలా కలకత్తా ఒకటి అయినా నిర్విఘ్నంగా అవ్వాలి. కలకత్తా వారు, ఢిల్లీ వారు కూడా కూర్చున్నారు, ఇది కర్ణాటక వారి అవకాశం. కర్ణాటక టీచర్స్ అందరూ కూర్చున్నారు. కర్ణాటకలోని ఒకొక్క సేవాకేంద్రం, కనెక్షన్‌లో ఉన్న సేవాకేంద్రాలన్నీ ఒకటి అయిపోవాలి. అప్పుడు ఆ జోన్‌కి లేదా పట్టణానికి బాప్‌దాదా బహుమతి ఇస్తారు. మంచి బహుమతి ఇస్తారు, ఎవరరొకరు నిమిత్తమై చూపించాలి. ముఖ్య సేవాకేంద్రం, ఆ సేవాకేంద్రంతో పాటు ఉన్న మిగిలిన సేవాకేంద్రాలు ఉన్న ఒకటి అవ్వాలి. పరివారం అందరూ అవ్వవలసిందే కానీ ఇప్పుడు వరకు ఫలితం రాలేదు. మధువనం వారు చేతులెత్తారు, మంచిది. చేయవలసింది

Created by Universal Document Converter

ఏముంది? కానీ చేయవలసి ఉంటుంది. సరేనా? ఇష్టమేనా? అందరికీ ఇష్టమేనా? బాప్‌దాదా ఈ సీజన్‌లో మూడు, నాలుగు సార్లు చెప్పారు కానీ ఎవరి ఫలితం ఇంత వరకూ రాలేదు. ఈ విషయం కూడా అకస్మాత్తుగా జరుగుతుంది అని అనుకుంటున్నారు ఏమిటి? అకస్మాత్తుగా జరిగినా కానీ చాలాకాలం యొక్క అభ్యాసం కావాలి అప్పుడే చాలాకాలం యొక్క అధికారాన్ని పొందుతారు అని బాప్‌దాదా చెప్పారు. అయితే ఇప్పుడు ఏమి చేయాలి? సంలగ్నత అనే అగ్నిని వెలిగించండి. చేయవలసిందే. ఒక విషయంలో అందరూ పాస్ అయ్యారు, బాప్‌దాదాపై మాకు 100 శాతం మనస్పూర్వక ప్రేమ ఉంది అనేవారు చేతులెత్తండి. 100 శాతం ఉందా? చేయి పైకి ఎత్తండి. ప్రేమకి బదులివ్వటం అంటే ఏమిటి? ప్రేమకు బదులివ్వటం అంటే సమానంగా అవ్వటం, సంపన్నంగా అవ్వటం, సంపూర్ణంగా అవ్వటం. ఇప్పుడు బాప్‌దాదా ఒక వ్యాయామం చెప్తున్నారు. బాప్‌దాదాలు ఇద్దరిపై ప్రేమ ఉంది అని అందరూ అంటున్నారు చేయి ఎత్తారు, నెంబరువారిగా ఉంటారు కానీ చేయి ఎత్తారంటే బాప్‌దాదా ఒప్పుకుంటారు. ఇద్దరిపై ప్రేమ ఉంది కదా! బ్రహ్మాబాబా మరియు శివబాబా ఇద్దరిపై ప్రేమ ఉంది కదా! చేయి ఎత్తండి. మంచిది, ఇద్దరితో ఉంది. చాలా మంచిది, ధన్యవాదాలు. మంచిది, ఇద్దరి సమానంగా అవ్వాలనుకుంటున్నారు. చేతులు ఎత్తకండి, చేతులూపండి! మంచిది, ఇద్దరిపై ప్రేమ ఉంటే శివబాబా నిరాకారుడు మరియు బ్రహ్మాబాబా ఫరిస్తా. ఫరిస్తా కదా! రేపటి నుండి కాదు, ఈ రోజు నుండి ఇప్పటి నుండి రోజంతటిలో ఇద్దరి తండ్రులపై ప్రేమ ఉంటే ఒకొక్కసారి స్వయాన్ని నిరాకారి తండ్రి సమానంగా నిరాకారి స్థితిని అభ్యాసం చేయండి. తండ్రిని అనుసరించండి. మరియు ఒకొక్కసారి ఫరిస్తాయై సాకార రూపి బ్రాహ్మణులుగా కాదు, బ్రాహ్మణులే, కర్మ చేయండి కానీ కర్మ చేస్తూ ఫరిస్తా స్థితిలో ఉండండి. అప్పుడు కర్మ భారం ప్రభావం వేయలేదు. బ్రహ్మాబాబాపై ప్రేమ ఉంటే బ్రహ్మాబాబా అన్ని పనులు చేశారు, నిమిత్తంగా అయ్యారు, బ్రహ్మాబాబాపై ఎంత భారం ఉంది? మీ ఎవరికీ అంత భారం లేదు, ఉన్న వారు ఎవరైనా ఉన్నారా? బ్రహ్మాబాబా కంటే ఎక్కువ భారం ఎవరికైనా ఉందా? అంటే చేతులెత్తండి. ఎవరూ ఎత్తటం లేదు. బ్రహ్మాబాబా అంత బాధ్యతను నిర్వర్తిస్తూ కూడా కార్యంలో ఏవిధంగా ఉండేవారు, కర్మలో కూడా ఫరిస్తా రూపంగా ఉండేవారు కదా! మీకు కూడా బ్రహ్మాబాబాపై ప్రేమ ఉంది కదా, అయితే ఒకొక్కసారి ఫరిస్తా రూపంలో ఉండండి, ఒకొక్కసారి నిరాకారి స్థితిలో ఉండండి. ఈ అభ్యాసం చేయండి. బ్రహ్మాబాబా అంటూ బ్రహ్మాబాబా సమానంగా ఫరిస్తాగా అయిపోండి మరియు నిరాకార శివ తండ్రిని స్మృతి చేసి నిరాకారి స్థితిలో స్థితులైపోండి, ఇలా చేయగలరా? చేయగలరా లేక కష్టమా? మధ్యమధ్యలో ఇలా చేయాలి, అది నిరంతరం అయిపోవాలి. మీరు చేసే కర్మల లెక్కతో మీ దినచర్య ఏదైతే ఉందో దాని అనుసారంగా ఈ అభ్యాసాన్ని నిర్ణయించుకోండి. రోజంతటిలో తక్కువలో తక్కువ 12 సార్లు ఫరిస్తా అవ్వండి, 12 సార్లు నిరాకారి స్థితిలో స్థితులవ్వండి. చేయగలరా? చేతులెత్తండి. చేయగలరా? కష్టమేమీ లేదా కదా! సహజమే కదా? సహజం అని చేతులెత్తండి, మంచిది, చేయాలి. ఇది పక్కా చేస్కోండి. అప్పుడు మీరు ఏదైతే లక్ష్యం పెట్టుకున్నారో దాని ప్రకారం ఈ సీజన్ చివరికి పరివర్తన అయిపోగలరా. ఈ అభ్యాసం 24 సార్లు చేస్తే నిరంతరం అయిపోయినట్లే కదా! సరేనా, అవుతుంది? చేతులెత్తండి. అవుతుందా. అయితే బాప్‌దాదా తరపున పదమా పదమా పదమా పదమాల రెట్లు శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. తేలికగా వదిలేయకూడదు. రేసులో మేము నంబర్‌వన్ అవ్వాలి

Created by Universal Document Converter

అని అందరూ నిశ్చయం పెట్టుకోండి. నెంబరువారీగా అవ్వకూడదు నెంబర్‌వన్ అవ్వాలి ఎందుకంటే బాప్‌దాదా దగ్గరకు సమయం వస్తుంది. ప్రకృతి అయితే అరుస్తూ ఉంది, భారాన్ని సహించలేక పోతుంది. మాయ కూడా వీడ్కోలు తీసుకోవాలను కుంటుంది కానీ ఏమంటుందంటే నేను ఏమి చేయను, ఎవరొక బ్రాహ్మణులు సంస్కారాలని వశపై ఏదో పని చేసి నన్ను ఆహ్వానిస్తున్నారు, నేను వెళ్ళవలసి వస్తుంది అని. బాప్‌దాదా ఏమి జవాబు చెప్పాలి! అందువలన ఏవిధంగా అయితే సమయం ముందుకి వెళ్తూ ఉందో, ఇప్పుడు మీరు సేవలో కూడా మార్పు చూస్తున్నారు. సేవకి ఫలితం అందరూ కోరుకుంటున్నారు. బ్రహ్మాకుమారీలు చెప్పేది ఇప్పుడు సరిగ్గా జరుగుతుంది అని అనుకుంటున్నారు. మొదట్లో అయితే వినాశనం, వినాశనం అనకండి అనేవారు, ఇప్పుడైతే వినాశనం ఎప్పుడు అవుతుంది? తారీఖు చెప్పండి అని అంటున్నారు. ఇప్పుడు వారు వినాలనుకుంటున్నారు, మొదట్లో అయితే సాకులు చెప్పేవారు, అంటే మార్పు వచ్చినట్లే కదా! ప్రత్యక్షంగా చూస్తున్నారు కదా! అందువలన ఇప్పుడు బాప్‌దాదాతో చేసిన ప్రతిజ్ఞను నిలుపుకోవాలి. సరే. బాప్‌దాదా అన్ని సమాచారాల ఫలితం విన్నారు. జరిగినదంతా మంచిది, మంచి ఉత్సాహ ఉల్లాసాల ఫలితం వచ్చింది. అందువలన ఇప్పుడు లక్ష్యం పెట్టుకోండి – అవ్వవలసిందే మరియు చేయవలసిందే. సమాప్తిని సమీపంగా తీసుకురండి. మీరు కొంచెం కదులు తున్నారు అందువలన సమాప్తి కూడా దూరం అయిపోతుంది. మీరే సమాప్తిని సమీపంగా తీసుకురావాలి ఎందుకంటే రాజ్యం చేసేవారు తయారుకాకపోతే సమయం ఏమి చేస్తుంది? అందువలన సాకులు, కారణాలు అనే మాటలన్నీ సమాప్తి చేయండి. నివారణను ఎదురుగా తీసుకురండి. చేతులు కొద్దిమందే ఎత్తారు కానీ మీ అందరి లక్ష్యం కూడా ఇదే కదా దు:ఖీలకు సందేశమిచ్చి వారిని ముక్తుల్ని చేయాలి. వారిని ముక్తుల్ని చేయకుండా మీరు ముక్తిలోకి వెళ్ళలేరు. కనుక వీరిని ముక్తుల్ని చేయండి. ఎందుకంటే తండ్రి వచ్చారు కదా, విశ్వంలోని ఆత్మలందరికీ వారసత్వం ఇస్తారు కదా. మీకు జీవన్ముక్తి యొక్క వారసత్వాన్ని ఇస్తారు కానీ అందరు పిల్లలే కదా! వారికి కూడా వారసత్వం ఇవ్వాలి కదా! కనుక వారి వారసత్వం – ముక్తి, మీ వారసత్వం – జీవన్ముక్తి. మీరు ముక్తినివ్వనంత వరకు మీరు కూడా వెళ్ళలేరు. దీనికోసం ఈ వ్యాయామం చేయండి. 24 సార్లు చేయండి. రాత్రి, పగలు మొత్తం 24 గంటలు కదా, మీరు 24 సార్లు చేయండి. నిద్ర సమయంలో నిద్రపోండి కానీ పగలు సమయంలో పెంచండి. ఏదైనా కార్యక్రమం జరుగుతున్నప్పుడు రోజు రోజంతా పని చేస్తూనే ఉంటారు కదా! మేల్కొంటారు కదా అలాగే ఇది కూడా. మంచిది.

**నలువైపుల ఉన్న బాబాకి స్నేహి, స్నేహి అయిన వారు సహయోగిగా తప్పక అవుతారు, స్నేహానికి బదులుగా వారు ప్రత్యక్ష రూపంలో ప్రతి కర్మలో తనువు, మనస్సు, ధనం, జనంలో ఒకరికొకరు తప్పనిసరిగా సహయోగి అవుతారు. అటువంటి స్నేహి, సహయోగి పిల్లలకు, సదా బాబా ప్రేమలో లవలీనంగా ఉండేవారికి, ప్రేమలో కాదు, లవలీనంగా ఉండేవారికి మరియు సదా బాబా యొక్క ప్రతి కార్యంలో సమయం, సంకల్పం ఉపయోగించేవారికి, ఎందుకంటే సంగమయుగంలో సమయం మరియు సంకల్పానికి చాలా విలువ ఉంది. ఒక్క జన్మలో అనేక జన్మల ప్రాలబ్ధాన్ని తయారుచేసుకునేవారికి, ఇటువంటి తీవ్ర పురుషార్థి, ప్రతి గుణాన్ని, ప్రతి శక్తిని సమయానుసారం కార్యంలో ఉపయోగించే గుణ సంపన్న, శక్తి సంపన్న పిల్లలకు చాలా చాలా కోటానుకోట్ల కోటానుకోట్ల రెట్లు ప్రియస్మృతులు మరియు నమస్తే.**

Created by Universal Document Converter

## క్రొత్త సంవత్సరంలో ఆత్మలందరికీ సందేశాన్నిచ్చి క్రొత్త ప్రపంచాన్ని బహుమతిగా ఇవ్వండి. బాబా సమానంగా తయారయ్యేటందుకు దేహీ అభిమానిగా ఉండే సహజ స్వభావం తయారు చేసుకోండి ..... 31-12-09

ఈరోజు బాప్‌దాదా ప్రతి ఒక్క బిడ్డను స్నేహం మరియు బాప్‌దాదా యొక్క ప్రేమలో లవలీనమవ్వటం చూస్తున్నారు. ఒకొక్క బిడ్డ పరమాత్మ ప్రేమలో మెరుస్తున్నారు. పిల్లలందరు ప్రేమ అనే విమానంలో వచ్చారు. మామూలుగా అయితే క్రొత్త సంవత్సరాన్ని జరుపుకోవడానికి వచ్చారు. కాని అందరి నయనాలలో ఏమి కన్పిస్తూ ఉంది. క్రొత్త సంవత్సరం అనేది నిమిత్తమాత్రమే. కానీ మీ అందరి కళ్ళలో ఏ ఉల్లాసం ఉంది. మూడు శుభాకాంక్షలు ఇస్తున్నారు. 1. మీ క్రొత్త జీవితం యొక్క శుభాకాంక్షలు 2. క్రొత్తయుగం యొక్క శుభాకాంక్షలు 3. పరివారం మరియు తండ్రి యొక్క మిలనం యొక్క శుభాకాంక్షలు. మీ నయనాలలో ఏమి తిరుగుతూ ఉంది. మీ క్రొత్త యుగం ఎదురుగా వస్తూ ఉంది. ఉల్లాసం వస్తూ వుంది కదా! క్రొత్తయుగం యొక్క మెరిసే దుస్తులు ఎదురుగా స్పష్టంగా కనిపిస్తున్నాయి అంటే ఈరోజు సంగమయుగంలో ఉన్నాం, త్వరలో మెరిసే దుస్తులు వేసుకుంటాము ఇలా ఎదురుగా ఆ దుస్తులను చూసి సంతోషిస్తున్నారు. వీడ్కోలు కూడా ఇస్తున్నారు మరియు శుభాకాంక్షలు కూడా తీసుకుంటున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు ఇచ్చేస్తారు ఇక ఆ సంవత్సరాన్ని మర్చిపోతారు.క్రొత్త ప్రపంచం ఎదురుగా వస్తుంది అదేవిధంగా మీరు పాత ప్రపంచానికి కాదు, క్రొత్త ప్రపంచానికి శుభాకాంక్షలు ఇస్తున్నారు. పాత ప్రపంచానికి వీడ్కోలు ఇస్తున్నారు. ఈరోజు అందరికీ క్రొత్తయుగం గురించి ఉత్సాహ, ఉల్లాసాలు ఉన్నాయి. ప్రజలు కూడా క్రొత్త సంవత్సరానికి శుభాకాంక్షలు ఇస్తారు మరియు వెనువెంట బహుమతిని కూడా ఇస్తారు. అలాగే బాప్‌దాదా కూడా పాత స్వభావ, సంస్కారాలకు వీడ్కోలు ఇచ్చేసి క్రొత్త ప్రపంచానికి వెళ్ళే బహుమతిని పిల్లలైన మీకు ఇస్తున్నారు. ఆ ప్రపంచంలో మీకు ప్రాప్తియే ప్రాప్తి. క్లుప్తంగా చెప్పాలంటే క్రొత్త ప్రపంచంలో అప్రాప్తి వస్తువు ఏదీ ఉండదు.అటువంటి స్వర్ణిమ ప్రపంచాన్ని పిల్లలైన మీ ప్రతి ఒక్కరికీ బాప్‌దాదా బహుమతిగా ఇచ్చేసారు. మేము స్వర్ణిమ ప్రపంచానికి అధికారిగా అవుతున్నాము అని మీకు కూడా నషా ఉంది కదా! ఇటువంటి బహుమతిని ఎవ్వరూ ఇవ్వలేరు. బాబా ప్రతి ఒక్కరికి ఆజ్ఞ ఇచ్చారు - తండ్రి వారసత్వంగా ఇచ్చే స్వర్ణిమ ప్రపంచం యొక్క సందేశాన్ని ఆత్మలందరికీ ఇచ్చి వారికి కూడా బహుమతిని ఇవ్వండి.మీ దగ్గర ఏ బహుమతి ఉంది? 1.క్రొత్త ప్రపంచాన్ని బహుమతిగా ఇవ్వండి 2.మీ దగ్గర చాలా ఖజానాలు ఉన్నాయి. గుణాల ఖజానా, శక్తుల ఖజానా, స్వమానాల ఖజానా ఇలా ఎన్ని ఖజానాలు ఉన్నాయి! కనుక అందరికీ ఏదోక గుణాన్ని, ఏదోక శక్తిని బహుమతిగా ఇవ్వండి. ఆ బహుమతి ద్వారా వారి జీవితం మారిపోవాలి మరియు స్వర్ణిమ ప్రపంచానికి అధికారి అయిపోవాలి. ఎందుకంటే ఈరోజుల్లో చూస్తున్నారు కదా! నలువైపుల దు:ఖం, అశాంతి పెరిగిపోతున్నాయి. నలువైపుల ప్రతి ఒక్కరిలో భయం మరియు చింత. ఇటువంటి దు:ఖీ, అశాంతి ఆత్మలకు తక్కువలో తక్కువ ఈ సందేశాన్ని ఇవ్వండి. ఇప్పుడు తండ్రి వచ్చారు, ఇప్పటి నుండి అవినాశి వారసత్వానికి అధికారి అవ్వండి అని. ఈ సందేశాన్ని ప్రతి ఆత్మకు ఇస్తున్నారు కూడా కానీ ఇప్పుడు కూడా తండ్రి యొక్క

Created by Universal Document Converter

పిల్లలు కొందరు సందేశం నుండి వంచితంగా ఉండి పోయారు.అయినా కానీ అందరు ఒకే తండ్రి యొక్క పిల్లలు కదా! కనుక మీ సోదరీ, సోదరులకు ఈ సందేశం యొక్క బహుమతిని తప్పక ఇవ్వండి. ఎవరు మిగిలిపోకూడదు. సేవ అయితే చేస్తున్నారు పిల్లల సేవ చూసి బాప్‌దాదా సంతోషిస్తున్నారు కానీ బాబా యొక్క ఆశ ఏమిటంటే, నా యొక్క ఏ బిడ్డ సందేశం నుండి వంచితం కాకూడదు అని. మీకు స్వర్ణిమ ప్రపంచం యొక్క బహుమతి లభించింది మాకు తెలియలేదు. మా తండ్రి వచ్చేసారు కానీ మాకు సందేశం లభించలేదు అని వారు నిందించకూడదు.అందువలన ఈ క్రొత్త సంవత్సరంలో ఇదే ప్రయత్నించండి. పరస్పరంలో ప్లాన్ తయారుచేసుకోండి. ఏ మూల మిగిలిపోకూడదు. నింద రాకూడదు. మా తండ్రి వచ్చేసారు అని వారు తెలుసుకుని సంతోషం అవ్వాలి. వంచితం కాకూడదు. అయితే ఈ క్రొత్త సంవత్సరంలో ఏమి చేస్తారు? ఒకరినొకరు కలుసుకునే ప్లాన్ తయారుచేయండి. బాప్‌దాదా అయితే ప్రతి ఒక్కరిపై దయ వస్తుంది. మీరు కూడా ఇప్పుడు దయాహృదయం మరియు కళ్యాణకారి స్వరూపాన్ని ధారణ చేసి మీ సోదరీ, సోదరులందరికీ సందేశం ఇవ్వాలి. కనీసం వారు నిందించకుండా ఉండాలి. ఈరోజు పిల్లలందరు క్రొత్త సంవత్సరం జరుపు కోవాలనే ఉత్సాహ, ఉల్లాసాలతో వచ్చారు.ఒక్కొక్కరిని చూసి బాప్‌దాదా ఏమి పాట పాడుకుంటున్నారో తెలుసా? ఓహో పిల్లలు! ఓహో!! అని పాడుకుంటున్నారు. మొదటిసారి వచ్చిన వారికి చెప్తున్నారు, సమయం యొక్క సమాప్తి కంటే ముందే బాబా వారిగా అయ్యారు అదృష్టవంతులు. ఇలా అదృష్ట వంతులుగా అయినందుకు క్రొత్త పిల్లలకు బాప్‌దాదా కోటానుకోట్ల శుభాకాంక్షలు ఇస్తున్నారు. బాప్‌దాదా పిల్లలందరిలో ఒక విషయం చూడాలను కుంటున్నారు అది ఏమిటో తెలుసా? ప్రతి ఒక్కరి హృదయంలో మేము బాబా సమానంగా అయ్యేవారము,అవుతాము అని కాదు, అయ్యే తీరతాం అనే లక్ష్యం, ఉల్లాసం ఉన్నాయి. అదేవిధంగా ఇప్పుడు లక్ష్యంతో పాటు లక్షణాలను కూడా చూడాలను కుంటున్నారు. ఎలాగైతే సమానంగా అవ్వాలనే లక్ష్యం ఉందో అలాగే బాబా సమానంగా అవ్వాలనే లక్షణాలు కూడా ఉండాలి. ఇప్పుడు లక్ష్యం చాలా ఉన్నతంగా ఉంది కానీ లక్షణాలపై విశేషధ్యాస పెట్టాలి. రెండూ సమానంగా ఉండాలి. కనుక ఎంత ఉన్నత లక్ష్యమో అంత ఉన్నతమైన లక్షణాలు కూడా ఉండాలి. ఇప్పుడు కొంతమంది పిల్లలు లక్షణాలను ధారణ చేయాలను కుంటున్నారు కానీ మధ్య మధ్యలో కానీ అని అంటున్నారు. అనుకుంటున్నాము కానీ ...... ఇలా కానీ అనేది తొలిపోవాలి. ఎంత ఉన్నత లక్ష్యమో అంత లక్షణాలు దూరం నుండే మీ ముఖము మరియు నడవడిక ద్వారా కనిపించాలి. మొదట్లో మీరు దేహాభిమానంలో ఉండేవారు అప్పుడు ఆ దేహాభిమానం సహజ స్వభావంగా ఉండేది. మేము దేహాభిమానంలోకి రావాలి అని ఎప్పుడైనా పురుషార్థం చేసారా? సహజ స్వభావంగా దేహాభిమానం ఉండేది. అర్ధకల్పం పురుషార్థం చేయలేదు. అదేవిధంగా ఇప్పుడు కూడా దేహీఅభిమానిగా అయ్యే అభ్యాసం సహజంగా ఉండాలి. దేహాభిమానం అనేది సహజ స్వభావంగా ఉంది కదా! దేహాభిమానంలోకి రావాలి అని ఎప్పుడైనా గుర్తు చేసుకున్నారా లేదా పురుషార్థం చేసారా? అదేవిధంగా ఇప్పుడు కూడా దేహీఅభిమానిగా అవ్వటంలో శ్రమ ఎందుకు? ఎందుకంటే బాప్‌దాదా దగ్గరికి సమాచారం వస్తుంది దేహాభిమానం తొలగించుకోవడానికి అప్పుడప్పుడు శ్రమ చేయాల్సి వస్తుంది అని. దేహాభిమానం సహజంగా ఉన్నప్పుడు దేహీఅభిమానంలో శ్రమ ఎందుకు? అందువలన బాప్‌దాదాకి పిల్లల శ్రమ మంచిగా అనిపించటం లేదు. శ్రమ

Created by Universal Document Converter

ముక్తులు అవ్వాలి మరియు సహజ సాధనం తయారవ్వాలి. దీనినే లక్ష్యం మరియు లక్షణాలు అని అంటారు. ఆ తర్వాత చూడండి, బాబా సమానంగా అవ్వటం సహజంగా అనిపిస్తుంది. బ్రహ్మాబాబాని చూసారు కదా, ఇంత పెద్ద పరివారం యొక్క బాధ్యత ఉన్నా సహజ స్వభావంగా దేహీ అభిమానిగా ఉన్నారు. పిల్లలపై కూడా బాధ్యత ఉంది కానీ బ్రహ్మాబాబా ముందు అది ఏమనిపిస్తుంది? ఏ బాధ్యత అయినా కానీ జోన్ యొక్క బాధ్యత అవ్వనివ్వండి లేదా ఏదైనా అధికారిక యజ్ఞసేవ యొక్క బాధ్యత అవ్వనివ్వండి ఏదైనా కానీ బ్రహ్మాబాబా బాధ్యత ముందు ఎంత! బ్రహ్మాబాబా శివబాబా యొక్క సహాయంతో ప్రత్యక్షంగా చూపించారు. చేయించేవారు చేయిస్తున్నారు, చేసేవారిగా అయ్యి బాబా సమానంగా అతీతంగా మరియు ప్రియంగా ఉన్నారు. బాబా సమానంగా అవ్వాలనుకుంటే పరిశీలన చేసుకోండి. మనస్సు ద్వారా, వాచా ద్వారా, కర్మణా ద్వారా ఏ కర్తవ్యం మీకు ఉన్నా కానీ నేను చేసేవాడిని, నిమిత్తం, చేయించేవారు యజమాని శివబాబా అనే పాఠం నడుస్తూ, నడుస్తూ మర్చిపోవటం లేదు కదా? లక్ష్యం మరియు లక్షణాలు రెండింటిని సమానంగా తయారుచేసుకోవాలి.ఇప్పుడు పాత సంవత్సరానికి వీడ్కోలు ఇవ్వటంతో పాటు ఈ లక్ష్యాన్ని లక్షణాలలోకి తీసుకురావాలి. కొత్త సంవత్సరం కనుక కొత్త విషయాలు. ఏమి చేయను, మాయ వచ్చేస్తుంది, అనుకోవటం లేదు కానీ వచ్చేస్తుంది ఈ మాటలు లేదా సంకల్పాలకు పాత సంవత్సరంతో పాటు వీడ్కోలు ఇచ్చేయండి. కేవలం సంవత్సరానికే వీడ్కోలు ఇవ్వటం కాదు, బాప్‌దాదా చెప్పారు, మాయ కూడా నా దగ్గరకి వస్తుంది, వచ్చి ఏమంటుంది? ఇది నేను వెళ్ళిపోయే సమయం అని నేను అనుకుంటున్నాను కానీ కొంతమంది పిల్లలు నన్ను ఆహ్వానిస్తుంటే నేను ఏమి చేయను అంటుంది. కనుక ఈరోజు ఆ వీడ్కోలుతో పాటు మాయ యొక్క భిన్న భిన్న రూపాలకు కూడా వీడ్కోలు ఇవ్వాలి. ధైర్యం ఉందా? ఉందా ధైర్యం? చేతులెత్తండి. వీడ్కోలు ఇచ్చే ధైర్యం  ఉందా? వెనుక ఉన్నవారికి ధైర్యం ఉందా? ఎవరిలో ధైర్యం ఉందో వారు చేతులెత్తండి, మీ ధైర్యానికి  బాబా చాలా  కోటానుకోట్ల రెట్లు శుభాకాంక్షలు ఇస్తున్నారు. బాప్‌దాదా ఈ విషయాన్ని ఇంత బలంగా ఎందుకు చెప్తున్నారు? ఎందుకంటే మీరందరు చూస్తున్నారు, ప్రపంచం యొక్క పరిస్థితులు పాడైపోవటం బలంగా ప్రారంభమవుతున్నాయి. అకస్మాత్తుగా జరుగుతుంది అనే మహావాక్యాన్ని కొంతకాలంగా బాప్‌దాదా చెప్తున్నారు. చాలాకాలం యొక్క అభ్యాసం లేకపోతే ఎలా? అకస్మాత్తు సమయంలో అభ్యాసం అవసరం కదా! ఇప్పుడిప్పుడే చూడండి, బాప్‌దాదా హోమ్‌వర్క్ ఇచ్చారు – మొత్తం 24 సార్లు 10 నిమిషాల చొప్పున అభ్యాసం చేయమని హోమ్‌వర్క్ ఇచ్చారు. ఇది కొంతమంది పిల్లలకు కష్టంగా అనిపిస్తుంది. 10 నిమిషాలు అభ్యాసం అవ్వటం లేదంటే అకస్మాత్తు సమయంలో ఏమి చేస్తారు? బాప్‌దాదాకి తెలుసు, 24 సార్లు చేయడానికి కొంతమంది పిల్లలకు సమయం కొంచెం తక్కువ లభిస్తుంది. కానీ 10 ని॥లు ఒకే స్మృతిలో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎలా కావాలంటే అలా చేయగలరా అని బాప్‌దాదా ట్రయల్ వేశారు. ఇప్పుడు కూడా 10 ని॥లు చేయమని బాప్‌దాదా చెప్పటం లేదు. ఒకవేళ మీకు కుదరటం లేదనుకోండి, సరే కానీ ఎవరికి కుదురుతుందో వారు చేయండి. మీకు కుదరకపోతే 5 ని॥లు చేయండి. 5 ని॥లు నుండి 7 ని॥లు, 6 ని॥లు ఇలా ఎంత పెంచుకోగలిగితే అంత పెంచుకోవడానికి ప్రయత్నించండి. దీనిలో ఒత్తిడి ఏమీ లేదు అని బాప్‌దాదా స్వయంగా చెప్తున్నారు. అంటే ఒకవేళ 10 ని॥లు మీకు ఎక్కువ సమయంగా అనిపిస్తే 8 ని॥లు చేయండి లేదా 9 ని॥లు చేయండి కానీ

Created by Universal Document Converter

ఎంత ఎక్కువ చేయగలిగితే అంత చేసుకునే అలవాటు చేస్కోండి. ఎందుకంటే చాలాకాలం యొక్క వరదానాన్ని ఇప్పుడు ప్రత్యక్షంలో చేయగలరు. ఒకవేళ చాలాకాలం యొక్క అభ్యాసం లేనట్లయితే, ఇప్పటి చాలాకాలం యొక్క పురుషార్థం ద్వారా లభించే ప్రాప్తి అర్ధకల్పం యొక్క చాలాకాలంలో తేడా వచ్చేస్తుంది. ఎంత వీలైతే అంత చేయండి అని బాప్‌దాదా మీకు అనుమతినిచ్చారు. వీలైతే 5 ని॥ల కంటే ఎక్కువ చేయండి. 10 ని॥లు కాదంటే 7 ని॥లు చేయండి. 8 ని॥లు చేయండి. 5 ని॥లు అయినా సరే కానీ కొన్ని సమయాలలో 10 ని॥లు చేస్తే బావుంటుంది. మీరు స్వయానికి మరియు విశ్వానికి కూడా కిరణాలు ఇవ్వవలసి వచ్చే సమయం వస్తుంది. అందువలన బాప్‌దాదా అనుమతి ఇస్తున్నారు. ఎంత ఎక్కువ సమయం చేయగలిగితే అంత అభ్యాసం చేయండి. ఎందుకంటే ఇప్పటి చాలాకాలం భవిష్యత్తుకి ఆధారం. సరేనా? కష్టంగా అనిపిస్తుందా, ఏమీ పర్వాలేదు. బాబాకి చెప్పి చాలా మంచి పని చేశారు. 10 ని॥లు కూర్చోలేరా, ఆలోచనలోనే సమయం అయిపోతుంది అంటే 5 ని॥లు అయిపోయినట్లే కదా! అందువలన తక్కువలో తక్కువ 5 ని॥ల కంటే తక్కువ చేయవద్దు అని బాప్‌దాదా చెప్తున్నారు. ఎంత పెంచుకోగలిగితే అంత పెంచుకోండి. సరే, స్పష్టం అయ్యిందా? ఎందుకంటే బాప్‌దాదా ప్రతి ఒక్కరినీ చాలా శ్రేష్ఠ స్వరూపంలో చూస్తారు, దానికి గుర్తుగానే ప్రతీ ఒక్కరికీ ఎన్ని స్వమానాలు ఇస్తారో! స్వమానాల జాబితా తీస్తే ఎంత పెద్దది ఉంటుంది!

ఈరోజు బాప్‌దాదా అమృతవేళ చుట్టూ తిరగడానికి వెళ్ళారు, ఏమి చూడడానికి వెళ్ళారు. బాప్‌దాదా స్వమానాల యొక్క చాలా పెద్ద మాల ఇచ్చారు. వాటిలో ఒకొక్క స్వమానంలో స్థితులై కూర్చోండి. నడుస్తూ స్వమానాలు అనుకుంటూ ఉండండి, మాలను త్రిప్పుతూ వెళ్తే చాలా మజా వస్తుంది. స్వమానాల జాబితా పెట్టుకున్నారు కానీ ఒకొక్క స్వమానం ఎంత గొప్పది మరియు ఎవరు ఇచ్చారు! విశ్వంలోకెల్లా సర్వశక్తివంతుడు మీ ఒకొక్కరికీ అనేక స్వమానాల జాబితా ఇచ్చారు. దానిని ఉపయోగించండి. ఎందుకంటే మీ ఈ స్వమానాన్ని తగ్గించే శక్తి ఎవరికీ లేదు. మరెవ్వరికీ ఇంత స్వమానాల మాల లభించలేదు. అయితే బాప్‌దాదా చూశారు, సత్యయుగంలో రాజ్యభాగ్యం లభిస్తుంది కానీ ఈ స్వమానాల మాల సంగమయుగం యొక్క దానం. బాప్‌దాదా ఎప్పుడూ ఏ బిడ్డను చూసినా కానీ ప్రతీ ఒక్కరినీ స్వమానం యొక్క స్థితిలో చూశారు. ఓహో పిల్లలూ! ఓహో!! అని అనుకుంటారు. కనుక స్వమానం యొక్క అధికారంలో ఉండండి. నేనెవరు? అని ఒకొక్కసారి ఒకొక్క స్వమానాన్ని ఎదురుగా పెట్టుకోండి. ఈరోజు అమృతవేళ ఏ విశేష స్వమానాన్ని బుద్ధిలో ఉంచుకున్నాను అని పరిశీలించుకోండి. ఆ స్వమానం అనేది ఖజానా, దానిని ఉపయోగించండి. ఎందుకంటే ఖజానా పెరగడానికి సాధనం - ఖజానాను ఎంతగా కార్యంలో ఉపయోగిస్తారో అంతగా పెరుగుతుంది. అయితే ఈరోజు బాప్‌దాదా చూస్తున్నారు - ఏయే పిల్లలు ఉన్నారు, ఎవరి దగ్గర స్వమానాల స్మృతి యొక్క మాల పెద్దది ఉంది, ఎవరి దగ్గర చిన్నది ఉంది అని. ఎక్కడ స్వమానం ఉంటుందో అక్కడ దేహాభిమానం సమాప్తి అయిపోతుంది. ఈరోజు బాప్‌దాదా చుట్టు తిరిగారు మరియు చూశారు - ఎలాగైతే స్వమానాల ఖజానా ఉందో అదేవిధంగా ఒకొక్క గుణాన్ని, ఒకొక్క శక్తిని కార్యంలో ఉపయోగించండి. మాయ వచ్చేసింది అనే సమస్య వస్తుంది కదా! నిజానికి మాయ రాదు కానీ బాప్‌దాదా మాయ గురించి చెప్పారు కదా - నన్ను వారు ఆహ్వానిస్తున్నారు, అప్పుడే వెళ్తున్నాను అని మాయ అంటుంది. ఏదైనా బలహీన సంకల్పం చేశారంటే

Created by Universal Document Converter

మాయను ఆహ్వానించినట్లే, శక్తులను వదిలేశారంటే మాయను ఆహ్వానించారు. అనుకోవటం లేదు కానీ వచ్చేస్తుంది, అయితే బలమైనవారు ఎవరు? మీరు కోరుకోవటం లేదు కానీ వచ్చేస్తుంది. అంటే మాయ బలమైనదా లేక మీరా?

ఈరోజు పాత సం॥రం సమాప్తి కానున్నది. కొత్త సం॥రంలో కొత్త ఉల్లాసం, కొత్త ఉత్సాహం ఎందుకంటే సంగమయుగానికి మహిమ ఉంది, ఒకొక్కరోజు ఉత్సవం అంటే ఉత్సాహంతో నిండినది. ఉత్సాహ ఉల్లాసాలు ఉంటే ప్రతిరోజు ఉత్సవమే అందువలన పక్కాగా ఉండాలి. నడుస్తూ తిరుగుతూ రోజూ మీ చార్ట్ చూస్కోవాలి, పరిశీలించుకోవాలి. పరిశీలించుకుంటే పరివర్తన చేసుకుంటారు కదా! పరిశీలనే చేసుకోకపోతే పరివర్తన ఎలా చేసుకుంటారు?

ఈరోజు కొత్త సం॥రం కోసం బాప్‌దాదా యొక్క విశేష సంకల్పం ఏమిటంటే ప్రతి బిడ్డ పాత సం॥రానికి ఎలాగైతే వీడ్కోలు ఇస్తారో అలాగే మాయకు వీడ్కోలు ఇవ్వండి. వ్యర్ధ సంకల్పాలకు వీడ్కోలు ఇవ్వండి ఎందుకంటే ఎక్కువ మందిలో వ్యర్ధసంకల్పాలు రావటం చూశారు. ఎక్కువ వికారి సంకల్పాలు రావటం అనేది తక్కువ. అవి తక్కువ కానీ వ్యర్ధం ఏదైతే ఉందో దాని యొక్క నామరూపాలు సమాప్తి అయిపోవాలి. ప్రతి సంకల్పం సమర్ధంగా ఉండాలి. వ్యర్ధం ఉండకూడదు ఎందుకంటే వ్యర్ధ సంకల్పాలలో కేవలం సంకల్పమే నడవదు, సమయం కూడా వ్యర్ధం అయిపోతుంది మరియు బాబా సమానంగా అవ్వటంలో దూరం అయిపోతారు. సమానంగా అవ్వాలి అనేది మీ కోరిక అలాగనే చేతులెత్తుతారు. కానీ బాప్‌దాదా సదా చెప్తుంటారు, మనస్సు యొక్క చేతిని ఎత్తాలి అని. ఈ చేయి ఎత్తటం సహజం. అయితే వీడ్కోలు ఇచ్చే ధైర్యం ఉందా? ఉందా ధైర్యం? చేయి ఎత్తండి. మంచిది. ధైర్యవంతులు. ఈ ధైర్యాన్ని స్థిరంగా ఉంచుకోండి చాలు. ధైర్యం ఉంటే మీరు పెట్టుకున్న లక్ష్యానికి చేరుకోగలరు ఎందుకంటే బాప్‌దాదా కూడా తోడుగా ఉన్నారు. నా యొక్క ఏ పిల్లవాడు వెనుక ఉండి పోకూడదు అని బాప్‌దాదా కోరుకుంటారు. చేతిలో చేయి వేసి నడవండి, శివతండ్రి నిరాకారుడు, చేయి లేదు కానీ శ్రీమతమే ఆయన చేయి. అడుగడుగు శ్రీమతా నుసారం నడవటమే చేతిలో చేయి వేసి నడవటం. అందరికీ కొత్త సం॥రం యొక్క, కొత్త జీవితం యొక్క, కొత్తయుగం... మూడింటి యొక్క కోటానుకోట్ల కోటానుకోట్ల శుభాకాంక్షలు. ఈసారే కొత్తగా వచ్చిన వారు లేచి నిల్చోండి, మంచిది, చాలామంది వచ్చారు, సగంమంది కొత్తవారు. వచ్చిన కొత్త వారందరికీ బ్రాహ్మణ పరివారం అందరి తరపున, బాప్‌దాదా తరపున మధువనం వచ్చినందుకు శుభాకాంక్షలు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. శుభాకాంక్షలతో పాటు ఒక విషయం గుర్తు ఉంచుకోండి – ఇప్పుడు సాధారణ పురుషార్ధం చేసే సమయం అయిపోయింది, ఇప్పుడు తీవ్ర పురుషార్ధం చేసే సమయం. అయితే మీరందరు ఆలశ్యంగా వచ్చారు కానీ బాప్‌దాదాకి ప్రియమైనవారు. బాగా ఆలశ్యానికి బదులు ఆలశ్యంగా వచ్చారు అంతే, అయినా కానీ అదృష్ట సమయంలో వచ్చారు అని బాప్‌దాదాకి సంతోషంగా ఉంది. అందువలన వచ్చిన వారందరు బాప్‌దాదాకి ప్రియమైనవారు. కనుక నడవటం కాదు, ఎగరాలి. ఎగరటం వేగంగా ఉంటుంది కదా! కనుక ఎగిరేకళ ద్వారా ముందుకి వెళ్ళిపోగలరు. ఈ అవకాశం ఉంది, దీనినే తీవ్ర పురుషార్ధం అని అంటారు. అయితే ఏమి చేస్తారు? ఎగురుతారు, ఎగురుతారా, మంచిది. పనికిరానివి, రాకూడని విషయాలు ఏమి వచ్చినా కానీ వాస్తవానికి అవి రాకూడదు కానీ వచ్చేస్తున్నాయి ఎందుకంటే పరీక్షలు ఉంటాయి కదా! అయితే ఏమి చేస్తారు? ఏదైనా అటువంటి విషయం వస్తే

Created by Universal Document Converter

బాప్‌దాదాకి ఇచ్చేయండి. ఇవ్వటం వస్తుంది కదా! తీస్కోవటం అయితే వచ్చు కానీ ఇవ్వటం కూడా వచ్చు కదా! చిన్న పిల్లలుగా అయిపోవాలి. చిన్న పిల్లలు ఏమి చేస్తారు? వారికి ఏ వస్తువైనా ఇష్టమనిపించకపోతే ఏమి చేస్తారు? అమ్మా, ఇది నువ్వు తీస్కో అని ఇచ్చేస్తారు. అలా చిన్న పిల్లలు అయిపోవాలి, చిన్న పిల్లలు అయిపోయి బాబాకి ఇచ్చేయండి. ఒకవేళ మరలా వస్తే వస్తాయి, బాప్‌దాదా చూశారు, చాలా సమయం వాటితో ఉన్నారు కదా, అందువలన వాటిని వదిలేసినా కానీ మరలా వస్తాయి కూడా. వచ్చినా కానీ ఇచ్చేసిన వస్తువుని తిరిగి వాడుకుంటారా? ఆలోచించండి. ఇచ్చేసినది మీ దగ్గరకి వచ్చిందంటే పరాయిది వచ్చినట్లు. మీరయితే ఇచ్చేశారు కదా కనుక మీది కాదు, పరాయివాటిని స్వంతం చేసుకోకూడదు. ఇది నాది కాదు, పరాయిది, నేనయితే ఇచ్చేశాను అని అనుకోవటంలో లాభం ఉంది. ఎందుకంటే సమయం తక్కువగా ఉంది. మరియు మీరు పురుషార్ధం తీవ్రంగా చేయాలి. వచ్చిన కొత్తవారిని బాప్‌దాదా అదృష్టవంతులు మరియు ప్రియమైనవారు (లక్కీ-లవ్లీ) అని అంటున్నారు. వచ్చేశారు, నా బాబా అని అంటున్నారు కదా! నా బాబా అనేవారు చేతులెత్తండి. వచ్చిన వారందరు నా బాబా అంటారు, నా బాబా అన్నారంటే ఇక నావారు అనేవారు వేరెవరైనా ఉంటారా? బాబాయే నావారు కదా! బాబాపై అధికారం ఉంచుకుని పరాయివిగా భావించి వాటిని బాబాకి ఇచ్చేయండి. మీ దగ్గరకి రానివ్వకూడదు. మంచిది. అయినా కానీ బాబాకి సంతోషంగా ఉంది. బాబాని గ్రహించారు కదా! ఇప్పుడు ఎగరాలి, నడవటం కాదు, ఎగరాలి అనే ధ్యాస బాగా పక్కాగా ఉంచుకోవాలి. మంచిది. చాలామంది ఉన్నారు. టీచర్స్ ఎవరైతే ఉన్నారో వారు మీ కొత్త సోదరీ సోదరులపై దయ చూపించాలి. ప్రతీ వారం వీరి పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ ఉండాలి. ఏ సమస్య లేదు కదా అని అడగాలి. మంచిది. పరివారం అందరి యొక్క శుభాకాంక్షలు కూడా.

**నలువైపుల దేశ విదేశాలలో ఉన్న బాబాకి ప్రియమైన ప్రతీ ఒక్కరికీ, బాబాకి ప్రియమైన, గారాభ పిల్లలకు వీడ్కోలు మరియు శుభాకాంక్షలు. బాబా చెప్పారు కదా - పాత సం॥రంతో పాటు పాత సంస్కారాలకు వీడ్కోలు ఇచ్చేవారికి, స్వభావానికి కూడా వీడ్కోలు ఇచ్చే మహావీర్ పిల్లలకు, ప్రతి అడుగులో పదమాల సంపాదన చేసుకునేవారికి, బాప్‌దాదా ఇచ్చే స్వమానాల యొక్క స్థితిలో ఉంటూ అనుభవం చేసుకునేవారికి, ఒకొక్కరు 21 జన్మల వారసత్వానికి అధికారులు అనే రూపంలో బాప్‌దాదా చూస్తున్నారు. కల్పమంతటిలో 21 జన్మలు అధికారిగా అయ్యే వారసత్వం పిల్లలైన మీకే లభిస్తుంది. ఇటువంటి శ్రేష్ఠ అధికారులకు, నలువైపుల ఉన్న పిల్లలకు బాప్‌దాదా తండ్రి, టీచర్, గురువు రూపంలో మూడు రూపాలతో ప్రియస్మృతులు మరియు నమస్తే.**

Created by Universal Document Converter